శనివారం 7 నవంబరు 2026

https://www.telugudesam.org




వారం వ్యవధిలోనే రెండు తుఫాన్లతో తీవ్రంగా నష్టపోయాం

ఉపశమనం కోసం
తక్షణ సాయం అందించండి

కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు
సీఎం చంద్రబాబు లేఖ

- వివరాలు 3 లో..



అడుగడుగునా భరోసా!

రైతుల కష్టం తెలిసిన నాయకుడిగా...

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

అటు సమీక్షలు, ఇటు పర్యటనలతో నిరంతరం సమన్వయం

అర్నబ్, మురసు తుఫాన్లు సృష్టించిన బీభత్సానికి పంటలు నీట మునిగి సర్వస్వం కోల్పోయిన రైతులకు ధైర్యాన్నిచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా రంగంలోకి దిగారు. ఏసీ గదుల్లో సమీక్షలకే పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలోనూ పర్యటించారు. అన్నదాతల కష్టం తెలిసిన నాయకుడిగా నీట మునిగిన పొలం గట్లు, చెరువులను తలపించే పంట బోదెలపై నడుచుకుంటూ వెళ్లి బాధితుల కన్నీళ్లు తుడిచారు. అనుక్షణం యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ విద్యుత్ పునరుద్ధరణ నుంచి నివారణ చర్యల వరకు ప్రతి అడుగులోనూ తానే ముందై నిలిచి అభాగ్యులకు కొండంత అండగా నిలిచారు.

3



అన్నదాతలకు అభయం

- **బాధితులందరికీ అండగా నిలుస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు**
- **గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన**
- **పొలం గట్లు, పంట బోదెలపై వెళ్తూ దెబ్బతిన్న పంటల పరిశీలన**
- **జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వరకు కాలినడకన వెళ్లి బాధిత రైతులతో మాట్లాడిన చంద్రబాబు**
- **పట్టిసీమ వరమిచ్చినా ప్రకృతి కరుణించలేదని రైతుల ఆవేదన**
- **పంటల బీమానే రైతులకు శ్రీరామరక్ష అన్న సీఎం**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పర్యటించారు. మురసు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను, వరద నీటిలో మునిగిన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వరకు కాలువ గట్లు, పంట బోదెలపై నడుచుకుంటూ వెళ్లి నీట మునిగిన వరి పొలాలను చూశారు. రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. తుఫాన్ల కారణంగా జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేస్తున్నామని, చివరి బాధితుడికి కూడా సాయం అందేలా చూస్తామని అన్నదాతలకు సీఎం అభయం ఇచ్చారు. పట్టిసీమ ద్వారా సాగునీరు అందడంతో పంటలు సాగు చేశామని, మంచి దిగుబడి వస్తుందని ఆశించిన సమయంలో తుఫాను వచ్చి తీవ్రంగా నష్టపరిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ సందర్భంలో సీఎం మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో పంటల బీమా, ప్రభుత్వ ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అండగా నిలుస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు.

2

'పరిషత్' ఫలితాలు నేడే

28 జిల్లాల్లో 365 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు... విధుల్లో 40వేల మందికి పైగా సిబ్బంది

అమరావతి (చైతన్యరథం): ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీపడ్డ వేలాది మంది అభ్యర్థుల భవితవ్యం మరికొన్ని గంటల్లో తేలనుంది. పోలింగ్ ప్రక్రియ ఎంత సజావుగా సాగిందో అంతకంటే క్రమ పద్ధతిలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు 28 జిల్లాల్లో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఈనెల 5న జరిగిన పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు తమ తీర్పును పొందుపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా 70.72 శాతం ఓటింగ్ నమోదైంది. వరదలు, తీవ్ర వర్షాల వల్ల పోలింగ్ వాయిదాపడ్డ ఐదు మండలాల్లో పోలింగ్ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో కౌంటింగ్ ప్రారంభమవుతుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో దాదాపు 40వేల మందికి పైగా సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. 28 జిల్లాల్లోని మొత్తం 365 కౌంటింగ్ కేంద్రాల్లో 9,062 లెక్కింపు బల్లలు ఏర్పాటుచేశారు. ప్రతి బల్లకు వెయ్యి



బ్యాలెట్ పత్రాలు లెక్కిస్తారు. ఇందుకు గాను 11వేలకు పైగా కౌంటింగ్ సూపర్‌వైజర్లు విధులు నిర్వర్తించనున్నారు. వారితో పాటు 28,500 మంది కౌంటింగ్ సిబ్బంది, సహాయకులు ఉంటారు. కౌంటింగ్ కేంద్రాల దగ్గర 19,885 మంది పోలీసులతో మూడంచెల భద్రత కూడా ఏర్పాటు చేశారు. సున్నిత ప్రాంతాల్లో సీసీ టీవీ, డ్రోన్, బాడీ వోర్న్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలి

శివన్నపేట గురుకులంలో జ్వరాల పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు ఆరా

5



పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, వైద్య-ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష

ఆధ్యాత్మిక సేవతో పాటు విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

టీటీడీ సాధికార మండలి చైర్మన్‌గా ఈవో ముద్దాడ రవిచంద్ర ప్రమాణస్వీకారం

6



జగన్ హయాంలో పల్లెలు సర్వనాశనం

రూ.వేల కోట్ల కేంద్ర నిధులను దారిమళ్లించి పప్పుబెల్లాల్లా వాడేశారు

గ్రామీణ ప్రాంతాల్లో ఓటడిగే అర్హత వైసీపీకి లేదు

కూటమి పాలనతో వీడిన గ్రహణం, గ్రామాల్లో మొదలైన వికాసం

మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు

7





అన్నదాతలకు అభయం

బాధితులందరికీ అండగా నిలుస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- **గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన**
- **పొలం గట్లు, పంట బోదెలపై వెళ్తూ దెబ్బతిన్న పంటల పరిశీలన**
- **జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వరకు కాలినడకన వెళ్లి బాధిత రైతులతో మాట్లాడిన సీఎం**
- **పట్టిసీమ వరమిచ్చినా ప్రకృతి కరుణించలేదని రైతుల ఆవేదన**
- **పంటల బీమానే రైతులకు శ్రీరామరక్ష అన్న సీఎం**



గుంటూరు/బాపట్ల (చైతన్యరథం): మురసు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను, వరద నీటిలో మునిగిన పొలాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం బాపట్ల జిల్లాలోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వరకు నడుచుకుంటూ వెళ్లి రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. జిల్లెళ్లమూడి వంతెన వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరం అక్కడి నుంచి రేటూరు గ్రామం వరకు కాలినడకన సాగిన సీఎం దారిపొడవునా రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ తుఫాను కారణంగా జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. మధ్యమధ్యలో పొలాల వద్ద ఆగుతూ రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పంట కాలువ గట్లు, పంట బోదెలపై నడుచుకుంటూ వెళ్లి నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. రైతులు పెట్టిన పెట్టుబడులు, పంట దిగుబడి అంచనాలు, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లెళ్లమూడి వంతెన వద్ద వరద ప్రవాహ ఉధృతిని పరిశీలించిన ముఖ్యమంత్రికి వాగు ఉధృతి కారణంగా చుట్టుపక్కల ప్రాంతాలు నీట మునిగిన తీరును రైతులు, అధికారులు వివరించారు. జిల్లెళ్లమూడి నుంచి రేటూరు వెళ్లే మార్గంలో పలుచోట్ల కోతకు గురైన రహదారిని పరిశీలించారు. నల్లమడ వాగు గేట్లు దెబ్బతిన్నాయని, వాటి కారణంగా నీటి నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం దెబ్బతిన్న గేట్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైతే కొత్త గేట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నల్లమడ డ్రెయిన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. పంట పొలాల్లోకి వరద నీరు చేరకుండా నియంత్రించడంతో పాటు వరద వచ్చినప్పుడు వచ్చే నీటిని సద్వినియోగం చేసుకునేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

రైతులు పడిన కష్టానికి ఫలితం దక్కేలా పని చేస్తున్నాం


రేటూరు గ్రామంలో నడుచుకుంటూ వెళ్లిన ముఖ్యమంత్రి... వరద నీటిలో మునిగిపోయిన వరి చేలను పరిశీలించారు. పొలం గట్లపై నడుస్తూనే రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. పట్టిసీమ ద్వారా సాగునీరు అందడంతో పంటలు సాగు చేశామని, మంచి దిగుబడి వస్తుందని ఆశించిన సమయంలో తుఫాను వచ్చి తీవ్రంగా నష్టపరిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కోసం ఎంత పెట్టుబడి పెట్టారు? పంటల బీమా చేయించుకున్నారా? అనే విషయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంటల బీమా, ప్రభుత్వ ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అండగా నిలుస్తాయని వివరించారు. పంటల బీమాపై రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. తుఫాన్ల ముప్పు తగ్గేలా సాధారణ సాగు సీజను కంటే ముందుగానే నీరు అందించి పంటలు వేసుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ముందస్తు సాగుకు మరింత అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రేటూరులో రైతులు, ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల రాష్ట్రానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్లు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్-నినో ప్రభావంతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పట్టిసీమ ద్వారా సాగునీరు అందించడంతో పంటలు సాగు చేశారని, మంచి దిగుబడులు వచ్చే సమయంలో మురసు తుఫాను నష్టాన్ని మిగిల్చిందని చెప్పారు. ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నష్టాన్ని చాలా వరకు నివారించగలిగామని తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై మురసు తుఫాను తీవ్ర ప్రభావం చూపిందన్నారు. తుఫాన్లపై ముందస్తు హెచ్చరికలు వచ్చినప్పుడు ప్రజలు వాటిని తేలిగ్గా తీసుకోవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముందస్తు చర్యలతో నష్ట నివారణ... వేగంగా పునరుద్ధరణ

తుఫాన్ల కారణంగా జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేస్తున్నామని, చివరి బాధితుడికి సాయం అందేవరకు ప్రభుత్వం పని చేస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రైతులకు నష్టపోయిన పెట్టుబడిలో కొంత మేర ఉపశమనం కలుగుతుందని చెప్పారు. రైతుల పంట నష్టం అంచనాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని... రైతులకు ఫోన్ల ద్వారా సమాచారం అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సాగునీటి సంఘాల ప్రతినిధులతోనూ మాట్లాడి కాలువలు, తూముల్లో పేరుకుపోయిన కంప, ఇతర అడ్డంకులను తొలగిస్తున్నారా అని ఆరా తీశారు. నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్నబ్ తుఫాన్ కారణంగా నేలకొరిగిన 30వేల విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించామని, మురసు తుఫాను వల్ల మరో 10వేల స్తంభాలు దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను కూడా త్వరితగతిన పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. తుఫాను సహాయ చర్యల కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సహకారం తీసుకుంటున్నామని వెల్లడించారు. తుఫాన్ల ప్రభావంపై కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించామని, ప్రధాని నరేంద్ర మోదీ కూడా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు.

ఓ పక్క తుఫాన్లు... మరోపక్క ఎల్-నినో

రాష్ట్రంలోని తీర ప్రాంతాలను వరుస తుఫాన్లు ఇబ్బందులకు గురిచేస్తుంటే, రాయలసీమ ప్రాంతం ఎల్-నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఎదుర్కొంటోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాయలసీమలో కరువు పరిస్థితులను అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందాలు కూడా పర్యటించాయని తెలిపారు. ఒకవైపు తీర ప్రాంతాల్లో నీరు వృథాగా సముద్రంలో కలుస్తుంటే, మరోవైపు రాయలసీమలో నీటి కొరత నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు నీటి భద్రత, సమర్థ నీటి నిర్వహణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. వరద నీటిని సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగిందని ముఖ్యమంత్రి విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో తుఫాన్లు వచ్చినప్పుడు రెడ్‌కార్పెట్ వేసుకుని పంటలను పరిశీలించి పరామర్శించేవారన్నారు. తాము స్థానిక సంస్థల ఎన్నికల కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యత ఇచ్చి తుఫాను సమయంలో సహాయక చర్యలను వేగవంతం చేశామని తెలిపారు. ఎన్నికల సమయంలోనే రెండు తుఫాన్లు వచ్చాయని... అయినా ఎన్నికలపై దృష్టి పెట్టకుండా... ప్రజలకు ఇబ్బందులు పరిష్కరించేందుకే ప్రాధాన్యత ఇచ్చామని... నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉన్నామని ముఖ్యమంత్రి చెప్పారు. కొందరు ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారని, పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత అన్ని అంశాలపై మాట్లాడతానని చెప్పారు. అంతకుముందు జిల్లెళ్లమూడి గ్రామానికి చేరుకున్న ముఖ్యమంత్రిని అమ్మ భక్తులు కలిశారు. వారు గ్రామంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ముఖ్యమంత్రి అభినందించారు. అమరావతి నుంచి ఏరియల్ సర్వే చేసుకుంటూ సీఎం చంద్రబాబు సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకున్నారు. పర్యటనలో మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, వేగేశ్న నరేంద్రవర్మ, ఏలూరి సాంబశివరావు, గుంటూరు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.





ప్రతి అడుగులోనూ భరోసా!

- **రైతు కష్టం తెలిసిన నాయకుడిగా...**
- **తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన**
- **అటు సమీక్షలు, ఇటు పర్యటనలతో నిరంతరం సమన్వయం**



అమరావతి (చైతన్యరథం): సచివాలయంలో సమీక్షలే కాదు పొలం గట్లు, పంట బోదెలపై తిరుగుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తుఫాను నష్టాన్ని స్వయంగా చూసి తెలుసుకున్నారు. రైతన్న కష్టానికి కదిలి.. పొలం గట్లపైకి వెళ్లారు. తుఫాను వల్ల నష్టపోయిన అన్నదాతలకు అండగా నిలిచేలా రాత్రిళ్లు సైతం సమీక్షలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పర్యటించారు. తుఫాను వల్ల కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగిన రైతుల కష్టాన్ని కళ్లారా చూసేందుకు ధ్వంసమైన రహదారుల్లోను, ముంపు ప్రాంతాల్లోను పర్యటించారు. అక్టోబరు 27 తేదీ నుంచి నిరంతరాయంగా ప్రజల్ని నిరంతరం అప్రమత్తం చేస్తూ.. క్షేత్రస్థాయిలో రైతుల కష్టాల్ని తెలుసుకుంటూ ముంపు ప్రాంతాల ప్రజలకు అండగా నిలిచారు. విద్యుత్ సరఫరాను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేలా పర్యవేక్షణతో పాటు నేల కొరిగిన చెట్లను తక్షణం తొలగించేలా యంత్రాంగాన్ని నడిపించి సంక్షోభ నివారణలో ఆయనకు ఆయనే సాటి అనిపించుకున్నారు. నెలల తరబడి కష్టపడి, అప్పులు చేసి, ఆశలతో సాగు చేసిన పంట నష్ట పోతే అన్నదాతకు ఎంత కష్టమో రైతుకే తెలుసు. అలాంటి కష్టకాలంలో రైతుకు ధైర్యం చెప్పేందుకు, వారి కన్నీళ్లు తుడిచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పొలం గట్లపై నడిచారు. నీట మునిగిన చేల మధ్యకు వెళ్లారు. పంట బోదెల వద్ద నిలబడి పంట నష్టాన్ని పరిశీలించారు. రైతుల పక్కన నిలబడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

తుఫాను నష్టం ఎక్కడుంటే అక్కడికి సీఎం

అర్నబ్ తుఫాను సమయంలో కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం వరకు ముఖ్యమంత్రి పర్యటించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. తాజాగా మురసు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోనూ పర్యటించారు. బాపట్ల జిల్లాలోని జిల్లెళ్లమూడి, గుంటూరు జిల్లాలోని రేటూరులో నీట మునిగిన వరి పొలాల వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. పొలం గట్లపై నడుస్తూ పంట బోదెలను చూస్తూ రైతుల ఆవేదనను ఆలకించారు.


అధికారుల నివేదికలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. పంట నష్టాన్ని చూసి రైతులు పడుతున్న ఆవేదనను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో పంట దెబ్బతింది.. ఎంత నష్టం వాటిల్లింది. రైతులకు తక్షణం అందించాల్సిన సాయం తదితర అంశాలను వారినే అడిగి తెలుసుకున్నారు. కష్టపడి పండించిన పంటను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తు రైతును కుంగదీయకుండా తిరిగి వ్యవసాయం చేసుకునేలా సహకారం అందించాలన్న దిశగా అధికారులకు సూచనలు చేశారు.

రైతులు, ప్రజల కోసం రాత్రి, పగలు అప్రమత్తం

తుఫాను తీరం దాటిన తర్వాతే కాదు... ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటి నుంచే ముఖ్యమంత్రి అప్రమత్తమయ్యారు. అక్టోబరు 27 నుంచే ఆర్నబ్ తుఫాను ప్రభావంపై వరుస సమీక్షలు నిర్వహించారు. ముందస్తు హెచ్చరికలు జారీ చేయించి, అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. మురసు తుఫాను సమయంలోనూ రాత్రిళ్లు సైతం మేల్కొని టెలికాన్ఫరెన్సుల ద్వారా కలెక్టర్లు, ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ పరిస్థితులు, వర్షాల తీవ్రత, ముంపు ప్రాంతాలు, ప్రజల తరలింపు, సహాయక చర్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించారు. విపత్తు సమయంలో రాష్ట్ర యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వంతోనూ నిరంతరం సంప్రదింపులు జరిపారు. నష్ట తీవ్రతను అంచనా వేయడం, బాధితులకు సాయం అందించడం, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయడంపై దృష్టి సారించారు. ఒకవైపు ఉన్నతాధికారులతో సమీక్షలు... మరోవైపు క్షేత్రస్థాయి పర్యటనలు... ఇంకోవైపు ప్రజలను అప్రమత్తం చేస్తూ విపత్తు నిర్వహణను ముఖ్యమంత్రి సమన్వయంతో నడిపించారు.

వారం వ్యవధిలోనే రెండు తుఫాన్లతో తీవ్రంగా నష్టపోయాం

ఉపశమనం కోసం తక్షణ సాయం అందించండి - కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు సీఎం చంద్రబాబు లేఖ



అమరావతి (చైతన్యరథం): వరుస తుఫాన్లతో ఆంధ్రప్రదేశ్‌కు భారీ నష్టం వాటిల్లిందని, మురసు తుఫాను కారణంగా ప్రాథమికంగా రూ.1,919.59 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వానికి వివరించారు. తుఫాను నష్టం నుంచి ఉపశమనం కోసం తక్షణం మధ్యంతర ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు సీఎం లేఖ రాశారు. వారం వ్యవధిలోనే రెండు వరుస తుఫాన్లతో ఏపీపై తీవ్ర ప్రభావం పడిందని సీఎం పేర్కొన్నారు. భారీ వర్షాలు, తీవ్ర గాలుల కారణంగా విద్యుత్, రహదారుల లాంటి మౌలిక సదుపాయాలు ధ్వంసం అయ్యాయని వివరించారు. అక్టోబరు 27న అర్నబ్ తుఫాను వల్ల జరిగిన నష్టం నుంచి రాష్ట్రం కోలుకుంటున్న సమయంలోనే మురసు తుఫాను విరుచుకుపడటంతో రైతులు, మత్స్యకారులు ఒకే సీజనులో రెండుసార్లు నష్టపోయారని తెలిపారు. వరద నీరు తగ్గిన తర్వాత నష్టాలపై పూర్తిస్థాయి అంచనాలు నిర్వహించి మరో 15 రోజుల్లో సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు.

తక్షణ సాయంతో రాష్ట్రానికి ఉపశమనం

మురసు తుఫాను కారణంగా వ్యవసాయ రంగంలో 1,43,122 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, 1,86,063 మంది రైతులు ప్రభావితం అయ్యారని ముఖ్యమంత్రి కేంద్ర హోం మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి రూ.874.96 కోట్ల నష్టం వాటిల్లిందని... ఉద్యాన పంటలు 6,504.38 హెక్టార్లలో దెబ్బతినగా, 12,178 మంది రైతులు నష్టపోయారని తెలిపారు. ఈ రంగానికి రూ.337.10 కోట్ల నష్టం జరిగిందని వివరించారు. దీంతో పాటు పశుసంవర్ధక, ఆక్వా, గృహ నిర్మాణం, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, విద్య, వైద్యారోగ్య శాఖలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ముందస్తు చర్యలు తీసుకోవడంతో ఆస్తి నష్టాన్ని కొంతమేర తగ్గించగలిగామని వివరించారు. మురసు తుఫాను కారణంగా నష్టపోయిన రైతులు, మత్స్యకారులు, గృహాలు దెబ్బతిన్న కుటుంబాలు, ఇతర బాధిత వర్గాలను ఆదుకోవడానికి, రాష్ట్రంలో దెబ్బతిన్న అత్యవసర మౌలిక సదుపాయాలు, సేవలను పునరుద్ధరించడానికి కేంద్ర హోం శాఖ తక్షణం మధ్యంతర ఆర్థిక సాయం మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు. కేంద్రం నుంచి తక్షణ సహాయం అందితే బాధితులకు ఉపశమనం కల్పించడంతో పాటు రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోగలమని స్పష్టం చేశారు.

బోటు మునిగి తమిళ జాలర్లు మృతి

- మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రగాఢ సానుభూతి

- మరో ఇద్దరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం

అమరావతి (చైతన్యరథం): తమిళనాడు మత్స్యకారుల బోటు ప్రమాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సముద్రంలో మత్స్యకారుల బోటు చిక్కుకుని పలువురు మృత్యువాతపడడం దురదృష్టకమన్నారు. మురసు తుపాను ప్రభావంతో సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం ఆవేదన కలిగించిందన్నారు. మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. తమిళనాడు బోటు ప్రమాదం... గల్లంతైన వారి కోసం జరుగుతున్న గాలింపు చర్యలపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత మూడు రోజులుగా గాలింపు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. పలువురు మత్స్యకారులు మరణించిన స్థితిలో ఉండగా ప్రకాశం జిల్లా కొత్తపట్నం సముద్ర తీరానికి బోటు కొట్టుకు వచ్చిందని అధికారులు చెప్పారు. ఈ బోటులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందిలో ఏడుగురు మృతి చెందగా.. మరో ఇద్దరు గల్లంతయ్యారని తెలిపారు. మత్స్యకారుల మృతదేహాలను గుర్తించి సహాయక చర్యలు చేపడుతున్నామన్నారు. మరో ఇద్దరి ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోందని వెల్లడించారు. ఇందు కోసం కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు, స్థానిక మత్స్యకారుల బృందాలు సహా సంబంధిత అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సీఎం సూచించారు. మృతదేహాలను గుర్తించడం, పోస్టుమార్టం తదితర అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తిచేసి వారి కుటుంబాలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మత్స్యకారులు తమిళనాడు రాష్ట్రానికి చెందినవారు కావడంతో అక్కడి అధికారులతో సమన్వయం చేసుకుంటూ మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.





వరద ఉధృతి చూసి... నీట మునిగిన వరి పైర్లను పరిశీలించి..

బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు క్షేత్రస్థాయి పర్యటన

బాపట్ల/గుంటూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం బాపట్ల, గుంటూరు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. తుఫాను, భారీ వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. బాపట్ల మండలంలోని జిల్లెళ్లమూడి వంతెన వద్ద ప్రవహిస్తున్న వరద ఉధృతిని సీఎం స్వయంగా పరిశీలించారు. స్థానికులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డ్రెయిన్లు, వర్షపు కాలువల ఉధృతిపై నీటిపారుదల శాఖ అధికారులకు తగిన సూచనలు చేశారు. అక్కడి నుంచి ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రేటూరు గ్రామానికి చేరుకుని దెబ్బతిన్న పొలాల వరకు రైతులతో కలిసి నడుచుకుం టూ వెళ్లారు. నీట మునిగిన వరి చేలను చూసి రైతుల కష్టాలను ఓపికగా ఆలకించారు. వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, తక్షణ పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.















చైతన్యరథం

విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

- అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం
- శివన్నపేట గురుకులంలో జ్వరాల పరిస్థితిపై మంత్రి ఆరా
- విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలి
- పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి

శ్రీకాకుళం/పార్వతీపురం (చైతన్యరథం): గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం శివన్నపేటలోని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్, యుఆర్జేసీ గురుకుల వసతి పాఠశాలలో విద్యార్థులకు జ్వరాలు, జలుబు, దగ్గు లక్షణాలు కనిపించిన నేపథ్యంలో ఆ జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో అచ్చెన్నాయుడు అప్రమత్తమయ్యారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. జ్వర లక్షణాలతో బాధపడుతున్న విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. గురుకుల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగించాలని, వైద్య నిపుణులతో విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులను



ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, ఇతర విద్యార్థులకు ఇన్ఫెక్షన్లు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తాగునీటి నాణ్యత, ఆహార పదార్థాల స్వచ్ఛత, వంటశాల పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జ్వరాల వ్యాప్తికి గల కారణాలను గుర్తించేందుకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, నివేదికల ఆధారంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

శివన్నపేట గురుకులంలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా అన్ని గురుకుల, సంక్షేమ వసతి పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఎక్కడైనా జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే స్పందించి వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల ఆరోగ్య భద్రత విషయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించరాదని, పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు వైద్య బృందాలు నిరంతరం అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు తల్లిదండ్రుల్లో ఆందోళన తొలగించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

మచిలీపట్నం అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



- ఓట్లేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి
- కార్పొరేటర్ల అభినందన సభలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం (చైతన్యరథం): ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. మచిలీపట్నంలోని వేదుక కన్వెన్షన్ హాల్‌లో స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసిన అభ్యర్థులు, విజయం సాధించిన కార్పొరేటర్లతో శుక్రవారం అభినందన సభ నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు.

ఈసందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. మచిలీపట్నం అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, విజయం సాధించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. మచిలీపట్నంలో మునుపెన్నడూ లేనివిధంగా కూటమి అభ్యర్థులకు ప్రజలు భారీ మెజారిటీ అందించడం, వైసీపీ వైపు ప్రజలు మొగ్గుచూపడం లేదనే విషయాన్ని మరోసారి స్పష్టంచేసిందన్నారు.ఎటువంటి గొడవలులేకుండా ప్రశాంతవాతావరణంలో ఎన్నికలుజరగడం సంతోషకరమన్నారు.

గెలుపుతో బాధ్యతమరింత పెరిగిందని, 60 డివిజన్లలో ప్రతిఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా పనిచేయాలని సూచించారు. పదవులు వచ్చాయనే అహంకారం లేకుండా అందరినీ కలుపుకొని మచిలీపట్నం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మహిళలకు కూటమి ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా పెద్దపీట వేసిందని, అభ్య ర్థులు పడిన కష్టానికి ప్రజలు ఇచ్చిన తీర్పు ఈ విజయమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో విజయం సాధించిన ప్రతి ఒక్కరూ ఎలాంటి తప్పులకు తావివ్వకుండా, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు వాటిని ప్రతి గడపకు చేరేలా కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మచిలీపట్నం మేయర్‌గా ఎన్నికైన అబ్దుల్ అబిదా, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, జనసేన నాయకులు బండి రామకృష్ణతో పాటు విజయం సాధించిన కూటమి కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చీరాల మున్సిపాలిటీ టీడీపీ కైవసం

- చైర్‌పర్సన్‌గా హానీ స్పందన విజయం

చీరాల (చైతన్యరథం): ఉత్కంఠగా సాగిన పుర పోరులో బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా టీడీపీ అభ్యర్థి ఎరిచెర్ల హానీ స్పందన.. సమీప ప్రత్యర్థిపై 6,408 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానానికి ప్రత్యక్ష పద్ధతిలో నమోదైన ఓట్ల లెక్కింపు శుక్రవారంఉత్కంఠగా జరిగింది. టీడీపీ అభ్యర్థికి 21,883ఓట్లు పోలయ్యాయి. ప్రధాన ప్రత్యర్థిగా నిలిచిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 15,415 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి 11,025ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు.వైసీపీ,కాంగ్రెస్ పార్టీలుఓట్లను చీల్చుకున్నప్పటికీ..కూటమి ఓటుబ్యాంకు అత్యంత పటిష్టంగా నిలబడి తిరుగులేని ఆధిక్యాన్ని తెచ్చిపెట్టింది. ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు



పట్టణ ప్రజలు ఆమోదముద్ర వేశారని ఈ భారీ మెజార్టీ స్పష్టం చేస్తోంది.

మొత్తం 44వార్డుల్లో ఎన్డీయే కూటమి ఏకంగా 25స్థానాలను కైవసం చేసుకుంది. ఇందులో తెలుగుదేశంపార్టీ ఒంటరిగానే 22వార్డులను గెలుచుకోగా, మిత్ర పక్షాలైన జనసేన 2, బీజేపీ 1 వార్డులో విజయకేతనం ఎగురవేశాయి. స్థానికంగా బలంగా పోటీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ 10 స్థానాలను దక్కించుకుని రెండో అతిపెద్ద శక్తిగా అవతరించింది. వైసీపీ 8 వార్డుల్లో గెలుపొందింది. ఒక స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో అత్యంత విస్మయపరిచే పరిణామం ఏమిటంటే.. అధికారంలో ఉన్నప్పుడు చీరాలను శాసించిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ స్థానాల్లో కేవలం 8వార్డులకే పరిమితమై మూడో స్థానానికి దిగజారడం. కాంగ్రెస్ కంటే తక్కువ వార్డులు రావడం ఆ పార్టీ కేడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేసింది. స్థానిక ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య వ్యూహాత్మక సమన్వయంతో చీరాల మున్సి పాలిటీలో కూటమి తిరుగులేని విజయంతోపాటు కౌన్సిల్‌లో పూర్తిస్థాయి మెజార్టీని సొంతం చేసుకుంది. మున్సిపల్ పీఠం దక్కడంతో పాటు అత్యధికవార్డుల్లో పసుపు జెండా రెపరెపలాడటంతో కూటమిశ్రేణులు బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకుంటూ విజయోత్సవాన్ని జరుపుకున్నారు.

అఖండ విజయంపై కూటమి ధీమా..

‘పరిషత్’ ఫలితాలు నేడే!

- ఓట్ల లెక్కింపునకు ఎస్ఈసీ పకడ్బందీ ఏర్పాట్లు
- 28 జిల్లాల్లో 365 కౌంటింగ్ కేంద్రాలు
- విధుల్లో దాదాపు 40వేల మంది సిబ్బంది
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో 70.72శాతం పోలింగ్

అమరావతి (చైతన్యరథం): పరిషత్ ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడికానున్నాయి. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిరిగానే పరిషత్‌ఎన్నికల్లో కూడా ఘన విజయం ఖాయమని కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రెండున్నరేళ్ల పాలనలో ప్రతిగడపకూ చేరిన సంక్షేమం, పల్లె ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులే తమకు అఖండ విజయం అందిస్తాయని గట్టి నమ్మకంతో ఉన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీపడ్డ వేలమంది అభ్యర్థుల భవితవ్యం మరికొన్ని గంటల్లో తేలనుండగా.. పోలింగ్ ప్రక్రియ ఎంత సజావుగా సాగిందో.. అంతకంటే క్రమ పద్ధతిలో కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు 28 జిల్లాల్లో అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. 365 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. శనివారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభమయ్యే కౌంటింగ్.. తొలి ఫలితం వచ్చేసరికి కనీసం నాలుగు గంటల సమయం పడుతుందని అంచనా.

కౌంటింగ్ కేంద్రాల వద్ద 19,885 మంది పోలీసులతో మూడంచెల భద్రత, సున్నిత ప్రాంతాల్లో సీసీటీవీ, డ్రోన్, బాడీ వోర్న్ కెమెరాలతో నిఘా ఏర్పాట్లుచేశారు. 365లెక్కింపు కేంద్రాల్లో 9,062 లెక్కింపు బల్లలు ఏర్పాటుచేయగా కౌంటింగ్ విధుల్లో దాదాపు 40 వేల మంది సిబ్బంది పాల్గొంటున్నారు. లెక్కింపు బల్లల్లో సగం జడ్పీటీసీలకు, సగం ఎంపీటీసీలకు కేటాయించారు. ప్రతి బల్లకు ఒక్కో రౌండ్‌లో వెయ్యి బ్యాలెట్‌పత్రాలు చొప్పునలెక్కిస్తారు.

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 77 జడ్పీటీసీలు, 2051 ఎంపీటీసీలు ఏకగ్రీవం కాగా.. మిగిలిన 582 జడ్పీటీసీ, 7767 ఎంపీటీసీ స్థానాలకుగాను 578 జడ్పీటీసీ, 7724 ఎంపీటీసీ స్థానాలకు ఈ నెల 4న పోలింగ్ జరిగింది.పోలింగ్‌లో పెద్దఎత్తున పాల్గొన్న ఓటర్లు తమ తీర్పును బ్యాలెట్ బాక్సుల్లో పొందుపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా 70.72 శాతం ఓటింగ్ నమోదు కావడం ఓటర్లలో చైతన్యానికి నిదర్శనంగా ఉంది. తుఫాన్ ప్రభావంతో ఏలూరుజిల్లా వేలేరుపాడు, బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లో 4జడ్పీటీసీ, 43ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలను శుక్రవారం నిర్వహించిన పోలింగ్ కూడా ప్రశాంతంగా ముగిసింది. ఇవి కాక మరో మూడు జిల్లాల్లో వివిధకారణాలవల్ల మళ్లీ పోలింగ్ నిర్వహించాలని ఎస్ఈసీ నిర్ణయించటంతో వాటికి కూడా పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. 28 జిల్లాల్లో మొత్తం 365కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11వేలకు పైగా కౌంటింగ్ సూపర్వైజర్లు విధులను నిర్వహించనున్నారు. వీరితోపాటు 28,500మంది కౌంటింగ్ సిబ్బంది, సహాయకులు ఉంటారు.

70.72శాతం పోలింగ్

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో 70.72 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగ్గా.. తుది పోలింగ్ శాతాన్ని ఎస్ఈసీ శుక్రవారం ప్రకటించింది. విశాఖ జిల్లాలో నాలుగు జడ్పీటీసీ స్థానాలు ఉండగా..అత్యధికంగా 82.51శాతం, అత్యల్పంగా అల్లూరి జిల్లాలో 62.01శాతం పోలింగ్ నమోదైంది. శ్రీకాకుళం జిల్లాలో 65.51, అనకాపల్లి 75.58,అనంతపురం 64.38,అన్నమయ్య 69.19, చిత్తూరు 76.30, బాపట్ల 67.47, కృష్ణా జిల్లా 73.21, కోనసీమ జిల్లాలో 66.33 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



చైతన్యరథం

కుట్రలతో ప్రజాతీర్పును అడ్డుకోలేరు

- స్థానిక ఎన్నికల్లో కూటమి ఘన విజయం ప్రజల విశ్వాసానికి నిదర్శనం
- బీసీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ఆత్మకూరులో పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లకు వైసీపీ నేతల యత్నం
- టీడీపీ కార్యకర్తలపై దాడులను సహించేది లేదు
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): ప్రజాస్వామ్యంలో ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజాతీర్పును మాత్రం అడ్డుకోలేరని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పత్రాలు చించడం, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని మంత్రి విమర్శించారు. కానీ నేడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోనూ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసి, ప్రచారం నిర్వహించి, ఎన్నికల్లో పోటీ చేసే స్వేచ్ఛను పొందారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు ఉండేలా, ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజాతీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు.

నెల్లూరు నగరంలో సంతపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని, మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, ఎన్డీఏ కూటమి విజయాలు, బీసీలకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రాధాన్యత, ఆత్మకూరు నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలపై మాట్లాడారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో పోటాపోటీగా ఎన్నికలు జరిగినప్పటికీ విజయం సాధించిన ప్రతి అభ్యర్థిని అభినందించామని, ఆత్మకూరు అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరినట్లు తెలిపారు.

గత నెల రోజులుగా అధికార, ప్రతిపక్ష పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లామని తెలిపారు. ప్రజలకు చేరువయ్యేలా పాలన అందించడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడమే ఎన్డీఏ కూటమి ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకుడు నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ నాయకత్వంలో సమన్వయంతో పనిచేయడం వల్లే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిందని పేర్కొన్నారు. ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని, ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించామని చెప్పారు.

ఎన్నికలు జరిగితేనే కేంద్ర నిధులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే ప్రతి రూపాయి ప్రజలకు చేరాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. 16వ ఆర్థిక సంఘం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు సుమారు రూ.12 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో పూర్తయితేనే కేంద్ర నిధుల విడుదలకు మార్గం సుగమం అవుతుందని, ఆ నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రతి గ్రామం, ప్రతి పట్టణాన్ని అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా సాగునీరు, తాగునీరు, రహదారులు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

బీసీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం

బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని మంత్రి గుర్తుచేశారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన నాటి నుంచి బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించి, రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో మరింత చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించే విషయంలో వైసీపీ నాయకులు కోర్టులను ఆశ్రయించి అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. అయినప్పటికీ బలహీన వర్గాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో ఎన్డీఏ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. నెల్లూరు నగర మేయర్ పదవిని బీసీ వర్గానికి చెందిన రూప్ కుమార్ యాదవ్‌కు కేటాయించడం బీసీలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. జనరల్ కేటగిరీకి వచ్చిన అవకాశాన్ని బీసీ వర్గానికి కల్పించడం ద్వారా బీసీలకు ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో స్పష్టమవుతోందన్నారు. బలహీన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఆత్మకూరు ఘటనపై వివరణ

ఆత్మకూరు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నుంచి పోలింగ్ వరకు ప్రతి మండలాన్ని, ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ తాను స్వయంగా గడపగడపకు వెళ్లానని మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు జరుగుతున్నట్లు సమాచారం అందిందని, ముఖ్యంగా ఒక పోలీసు కానిస్టేబుల్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారనే ఫిర్యాదు తన దృష్టికి వచ్చిందని వివరించారు. ఈ విషయాన్ని గుర్తించిన వెంటనే తాను అక్కడికి వెళ్లి, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి పక్షపాతం లేకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత పోలీసు సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. అనంతరం ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించానని, అయితే డీఎస్పీ అక్కడికి చేరుకోవడానికి సుమారు రెండు గంటల సమయం పట్టిందని పేర్కొన్నారు. అదే సమయంలో వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే సుమారు వంద మంది అనుచరులతో అక్కడికి వచ్చి తమను బెదిరించే ప్రయత్నం చేశారని, జరిగిన వాస్తవాలను పక్కదారి పట్టించేలా ఈ ఘటనను వివిధ రకాలుగా చిత్రీకరించారని విమర్శించారు. అనంతసాగరం మండలంలో రిగ్గింగ్‌కు ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారం అందడంతో తాను హుటాహుటిన అక్కడికి వెళ్లానని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సిబ్బంది, పోలీసు భద్రత ఉన్నప్పటికీ ఇలాంటి పరిస్థితులు ఎందుకు తలెత్తాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు.

రాజకీయాల్లో హద్దులు దాటొద్దు

తన రాజకీయ అనుభవంలో సగం కూడా లేని నాయకులు రాజకీయాలు నేర్పించడానికి వస్తే సహించేది లేదని మంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు వరకు లాగుతామంటూ బెదిరింపులకు దిగడం, పోలింగ్ కేంద్రాల వరకు అనుచరులను తీసుకువచ్చి భయభ్రాంతులకు గురిచేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాకు రాజకీయంగా ఎంతో చరిత్ర ఉందని, ఆనం కుటుంబానికి కూడా సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉందని గుర్తుచేశారు. రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

నెల్లూరు జిల్లాలో గతంలో నాటుబాంబుల సంస్కృతిని ప్రోత్సహించిన చరిత్ర ఎవరిదో ప్రజలకు తెలుసని, దోపిడీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆస్తుల కబ్జాలు, దౌర్జన్యాల ఆరోపణలపై సంబంధిత నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కి సంబంధించిన రూ.145 కోట్ల వ్యవహారంపై కూడా మంత్రి ప్రశ్నించారు. రాజకీయాల్లో వ్యక్తిగత దాడులకు దిగకుండా ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించారు.

కార్యకర్తలపై దాడులను సహించేది లేదు

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రశాంతంగా ఉండాలని, ఎలాంటి ఘర్షణలకు దిగకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం సూచిస్తుంటారని మంత్రి తెలిపారు. కార్యకర్తల సంక్షేమం, భద్రత పట్ల ముఖ్యమంత్రికి ఎంతో నిబద్ధత ఉందన్నారు. అయితే చేజర్ల మండలంలో చంద్రశేఖర్ అనే వైసీపీ నాయకుడి అనుచరులు అల్లర్లు సృష్టించి కొందరిపై దాడులకు పాల్పడినట్లు సమాచారం ఉందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడులకు దిగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇది వైసీపీ నాయకుల దౌర్జన్య వైఖరికి నిదర్శనమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా రాక్షస పాలనలో లేమని, రాజ్యాంగబద్ధంగా పాలన సాగిస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఉన్నామని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని ధిక్కరించేలా ఎవరైనా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజల విశ్వాసానికి నిదర్శనం

కూటమి నేతలందరం ఒకే మాటపై నిలబడి ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా ముగియడం, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసం, ఆశీర్వాదం ఎన్డీఏ కూటమికి ఉన్నందునే ఎన్నికల్లో ఘన విజయం సాధించామని తెలిపారు. వైసీపీ నాయకులు ఎన్నికలు ప్రశాంతంగా జరగడాన్ని కూడా జీర్ణించుకోలేకపోతున్నారని, ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారని, విధ్వంసకర రాజకీయాలను కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి పట్టణం అభివృద్ధి చెందేలా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

ఆధ్యాత్మిక సేవలతో పాటు..

విద్యా వైద్య రంగాలకు ప్రాధాన్యత

- టీటీడీ సాధికార మండలి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం అనంతరం ఈవో ముద్దాడ రవిచంద్ర

తిరుమల (చైతన్యరథం): తిరుమల తిరుపతి దేవస్థానాల సాధికారిక మండలి చైర్మన్‌గా టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయనతో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ప్రమాణం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు చైర్మన్‌కు వేదాశీర్వచనం అందించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా ముద్దాడ రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం టీటీడీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా, మెరుగైన రీతిలో కొనసాగించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భక్తులకు అన్ని విధాలా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. టీటీడీ నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారిస్తామని తెలిపారు. భక్తులకు సౌకర్యాలు, ఆధ్యాత్మిక సేవలతో పాటు విద్య, వైద్య రంగాల్లోనూ మరింత విస్తృతంగా సేవలందించడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో ముద్దాడ రవిచంద్ర సతీమణి పద్మావతి కూడా పాల్గొన్నారు.



చైతన్యరథం

జగన్ హయాంలో పల్లెలు సర్వనాశనం

- రూ.వేల కోట్ల కేంద్ర నిధులను దారిమళ్లించి పప్పుబెల్లాల్లా వాడేశారు
- పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకూ పైసలు లేకుండా చేసిన పాపం గొడ్డలిపార్టీదే
- సెంటు స్థలాల పేరుతో రూ.7 వేల కోట్ల దోపిడీ
- రూ.3,000 కోట్ల ఉపాధి హామీ నిధులు బొక్కేసిన వైసీపీ కార్యకర్తలు
- వైసీపీ కేడర్‌నే వాలంటీర్లుగా నియమించి పల్లెల్లో అరాచకం
- చెత్త పన్ను కట్టకపోతే పెన్షన్ తీసేస్తామంటూ వారితో బెదిరింపులు
- గ్రామీణ ప్రాంతాల్లో ఓటడిగే అర్హత ఆ పార్టీకి లేదు
- కూటమి పాలనతో వీడిన గ్రహణం, గ్రామాల్లో మొదలైన వికాసం
- మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు

అమరావతి (చైతన్యరథం): ఐదేళ్ల వైఎస్ జగన్ పాలనలో రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, పంచాయతీ రాజ్ వ్యవస్థలు పూర్తిగా సర్వనాశనమయ్యాయని, ఆ ఆక్రోశం, ఆవేదనతోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీపై తిరగబడి కూటమికి మరోసారి చారిత్రక విజయాన్ని అందించబోతున్నారని మాజా ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన 94 నుంచి 95 శాతం స్ట్రైక్ రేట్‌ను మించి పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో కూటమి గెలుస్తుందన్నారు. ఐదేళ్ల అరాచక పాలనలో పంచాయతీలను నిండా ముంచేసిన జగన్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఓటడిగే అర్హత కూడా లేదని మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు, రైతులు, పేదలు ఎదుర్కొన్న దుస్థితిని ఎండగట్టారు. రాష్ట్రంలో జెడ్పీటీసీలు, ప్రధాన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియ దాదాపుగా ముగిసిందని, త్వరలోనే పార్టీ రహితంగా జరిగే పంచాయతీ ఎన్నికలు కూడా రాబోతున్నాయని పేర్కొన్నారు. సాధారణ ఎన్నికలు వేరు, స్థానిక సంస్థల ఎన్నికలు వేరు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ ఎన్నికలే అసలైన గ్రామీణ ప్రజల నాడిని, వారి నిజమైన అభిప్రాయాలను స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ పట్టణ స్థానిక సంస్థల్లో మాదిరిగానే ప్రజలు చారిత్రక తీర్పు ఇవ్వబోతున్నారు. వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పూర్తిగా గ్రహణం పట్టింది. పల్లెల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు గాలికొదిలేశారు. ఆ చీకటి రోజులు ముగిసి, ఇప్పుడు గ్రహణం వీడిపోయింది. గ్రామాల్లో మళ్లీ వికాసం మొదలయింది. జగన్ ఐదేళ్ల పాలన గ్రామాలను ఎంతలా నాశనం చేసిందంటే.. ఆ నష్టం నుంచి తేరుకోవడానికే ఏళ్లకు ఏళ్లు పడుతోంది. గ్రామీణ వ్యవస్థలను పూర్తిగా సర్వనాశనం చేసేశారు. నిధులు లేక, పనులు చేయలేక 'మాకొద్దీ పదవులు' అంటూ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు రాజీనామాలు చేసే దుస్థితికి తెచ్చారు. స్థానిక సంస్థల అధికారాలను, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కాలరాశారు. ఘోరమైన పరిపాలనా లోపమే ఈ విధ్వంసానికి కారణం. గ్రామీణ ప్రజలు ఇవన్నీ గమనించారు కాబట్టే, ఇప్పుడు స్థానిక సంస్థల్లోనూ కూటమికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నారని అశోక్‌బాబు స్పష్టం చేశారు.

గ్రామీణ వ్యవస్థల వెన్నువిరిచిన వైఎస్ జగన్..

కేంద్రం 14, 15వ ఆర్థిక సంఘాల ద్వారా గ్రామ పంచాయతీలకు నేరుగా కేటాయించిన దాదాపు రూ.12,000 కోట్ల నిధులను జగన్ ప్రభుత్వం దొడ్డిదారిన దారిమళ్లించి పప్పుబెల్లాల్లా ఖర్చు చేసిందని మండిపడ్డారు. మున్సిపాలిటీల మాదిరిగా కాకుండా చిన్న పంచాయతీలన్నీ కేంద్ర నిధుల మీదే ఆధారపడి నడుస్తాయి. అలాంటి నిధులు లాక్కోవడంతో పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేక, కనీసం వీధుల్లో చల్లడానికి బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేక పంచాయతీలు దివాళా తీశాయి. 'బ్లీచింగ్ వేస్తే కరోనా పోతుంది' అని ఎగతాళిగా మాట్లాడిన జగన్, చివరకు ఆ బ్లీచింగ్ కూడా లేకుండా చేసి ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారు. నీటి సరఫరా, కనీస పౌర సేవలు నిలిచిపోయి పంచాయతీలు కేవలం నామమాత్రంగా మిగిలాయి. గ్రామీణ జీవన వ్యవస్థ ఆధారపడి ఉన్న వ్యవసాయం, పాడి, చేతివృత్తులు, వ్యవసాయ కూలీల రంగాలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టారు. రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేసి 6-7 నెలలైనా డబ్బులు చెల్లించని దుర్మార్గ చరిత్ర జగన్‌ది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.1,600 కోట్ల ధాన్యం బకాయిలను రైతులకు చెల్లించాం. నేడు కూటమి ప్రభుత్వం ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. వైసీపీ హయాంలో క్రాప్ ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీలను ఎగ్గొట్టారు. కరోనా కష్టకాలంలో పంట చేతికొచ్చినా అమ్ముకోలేక, అమ్మినా డబ్బులు రాక అన్నదాతలు రోడ్డున పడ్డారని అశోక్‌బాబు విమర్శించారు.

ఇళ్లస్థలాల పేరుతో భారీ అవినీతి

గ్రామీణ పేదలకు కొండంత అండగా ఉండాల్సిన ఉపాధి హామీ పథకంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు దాదాపు రూ.3,000 కోట్ల విలువైన పనిదినాలను బోగస్ పేర్లతో మింగేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి చెల్లించాల్సిన దాదాపు రూ.2,000 కోట్లను కక్షపూరితంగా నిలిపివేస్తే, చివరకు కోర్టుల ద్వారా న్యాయ పోరాటం చేసి ఆ నిధులు సాధించుకోవాల్సి వచ్చింది.

పేదలకు 25 లక్షల ఇళ్లు, సెంటు స్థలం పేరుతో దాదాపు రూ.7,000 నుంచి రూ.8,000 కోట్ల మేర భారీ అవినీతికి పాల్పడ్డారు. పట్టణాలకు ఆనుకుని గ్రామాల్లో ఉన్న టిడ్కో ఇళ్లపై ఆశలు పెంచుకున్న లక్షలాది మందికి అన్యాయం చేసి సుమారు 5 లక్షల ఇళ్లను ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి మొండిచేయి చూపారు. జగన్ ఇచ్చిన సెంటు స్థలాల్లో 40 శాతానికి పైగా ముంపు ప్రాంతాలు, కొండలు, గుట్టలే. నీళ్లల్లో వేసిన సర్వే రాళ్లు వరదల్లో కొట్టుకుపోయాయన్నారు. జగన్ ఇచ్చే సాయం నమ్మి పేదలు తమ వద్ద ఉన్న రెండు, మూడు లక్షల రూపాయల పొదుపు మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి స్లాబ్ దశ వరకు నిర్మించుకుంటే, ప్రభుత్వం నిధులు ఇవ్వక లక్షలాది ఇళ్లు మధ్యలోనే ఆగిపోయి పేద కుటుంబాలు అప్పులపాలయ్యాయి. గ్రామాల్లో వృద్ధులకు ఆసరాగా నిలిచే పెన్షన్లను తెలుగుదేశం సానుభూతిపరులనే నెపంతో రద్దు చేశారు. అదే సమయంలో వైసీపీ కార్యకర్తలకు అడ్డగోలుగా దివ్యాంగుల పెన్షన్లు కట్టబెట్టారు. వాలంటీర్ వ్యవస్థను పూర్తిగా వైఎస్సార్‌సీపీ కేడర్‌తో నింపేశారు. అన్నిటికంటే దారుణంగా గ్రామీణ పేదల జేబులు గుల్ల చేస్తూ, రూ.50-60 విలువ చేయని హానికరమైన సొంత బ్రాండ్ల నాసిరకం మద్యాన్ని రూ.100, రూ.200లకు అమ్ముకుని వారి ఆరోగ్యాన్ని నాశనం చేశారు. అందుకే 2024 ఎన్నికల్లో ఆ లిక్కర్ బాధితులే జగన్‌కు గట్టిగా బుద్ధి చెప్పారు. తాము చేసిన విధ్వంసం, అరాచకాలపై ప్రజలు తిరగబడి స్థానిక ఎన్నికల్లో కూటమికి 94-95% స్ట్రైక్ రేట్ ఇస్తే, ఓటమిని జీర్ణించుకోలేక మేమేదో అరాచకం చేశామని ఈసీకి 74 ఫిర్యాదులు ఇవ్వడం హాస్యాస్పదం. ప్రతి బూత్, ప్రతి మున్సిపాలిటీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీల్లో గొడవలు సృష్టించే కుసంస్కృతిని జగన్ తీసుకొచ్చారు. ప్రజల తిరుగుబాటును తట్టుకోలేక వైసీపీ మూకలు ఘర్షణలకు పాల్పడితే వాటిని మాపై రుద్దాలని చూడటం సిగ్గుచేటు. జగన్ ప్రభుత్వం మిగిల్చిన



శిథిలాలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్దుతోంది. అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పథకానికి రావాల్సిన దాదాపు రూ.3,000 కోట్ల బకాయిలను పరిష్కరించి, పనిదినాలను పెంచాం. గతంలో నిలిచిపోయిన ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లను పూర్తి చేసి పేదలకు గృహప్రవేశాలు చేయించాం. చిన్నపాటి మరమ్మతులతో నిరుపయోగంగా పడిఉన్న టిడ్కో ఇళ్లను బాగుచేసి లబ్ధిదారులకు అప్పగించాం. గ్రామాల్లో ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను మళ్లీ నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అశోక్‌బాబు చెప్పారు.

కూటమి పాలనలో మళ్లీ పల్లె వికాసం

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పంచాయతీల నిధులను అడ్డగోలుగా లాక్కున్న జగన్ పాపాలను గమనించిన కేంద్ర ప్రభుత్వం, చివరకు ఆయన చేతులు కట్టేస్తూ పంచాయతీల పేరుతోనే ప్రత్యేక ఖాతాలు తెరిపించి నేరుగా నిధులు జమ చేసే పరిస్థితి తెచ్చిందని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం నిధులు మళ్లించి పంచాయతీలను నిర్వీర్యం చేయబట్టే కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీల ఖాతాలకే నిధులు పంపే విధానం తెచ్చింది. కూటమి ప్రభుత్వం రాగానే కేంద్రంతో సమన్వయం చేసుకుని సుమారు రూ.4,100 కోట్ల పంచాయతీ రాజ్ నిధులను విడుదల చేయించాం.

ప్రస్తుతం గ్రామాలు పూర్తి ఆర్థిక స్వేచ్ఛతో తమ అభివృద్ధి పనులను తామే స్వయంగా చేసుకుంటున్నాయి. ఉపాధి హామీ పథకంలో పనిదినాలు పెంచడంతో పాటు రైతులకు పంటల బీమాను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గిరిజన, అటవీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కోసం చేపట్టిన 'అడవి బాట' కింద మొత్తం 3,215 కిలోమీటర్ల లక్ష్యంలో మొదటి ఏడాదిలోనే 1,974 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన రోడ్ల పనులను ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేస్తాం. ఇక 'పల్లె పండుగ 1, 2, 3' దశల కింద గ్రామాల్లో 12,500 కిలోమీటర్ల అంతర్గత సీసీ రోడ్లు నిర్మించాం. పల్లెలను హైవేలతో అనుసంధానం చేస్తూ రెండున్నరేళ్లలోనే 19,100 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లను పూర్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించాం. భూగర్భ జలాల పెంపునకు, పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ప్లాస్టిక్ షీట్లతో కూడిన 60,000 ఫామ్ పాండ్స్ (వ్యవసాయ కుంటలు) తవ్వించాం. పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికి గ్రామీణ ప్రాంతాల్లో 'గోకులం' పథకం కింద 60,000 సబ్సిడీ పశువుల షెడ్లను మంజూరు చేశాం. ఈ పథకానికి గ్రామాల్లో విపరీతమైన స్పందన రావడంతో ప్రస్తుతం ప్రతి గ్రామం, హ్యామ్లెట్ నుంచి వేలాది దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఆక్వా రంగానికి కరెంటు సబ్సిడీని కొనసాగిస్తూ, పెరిగిన ఉత్పత్తి ఖర్చులను అదుపు చేసేందుకు ప్రాసెసర్లు, తయారీదారులతో చర్చించి రైతులకు నష్టం రాకుండా చర్యలు తీసుకున్నాం.

దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పేద ఇళ్ల మీద కూడా చెత్త పన్ను వేసిన ఘనుడు జగన్. 'చెత్త పన్ను కట్టకపోతే పెన్షన్ తీసేస్తాం, తాగునీటి కుళాయి కట్ చేస్తాం' అంటూ వాలంటీర్లతో పేద ప్రజలను బెదిరించారు. పన్నులు వసూలు చేసి కూడా ఆ చెత్తను తొలగించకుండా గ్రామాలను డంపింగ్ యార్డులుగా మార్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ పరిశ్రమలతో కలిసి లక్షలాది టన్నుల పేరుకుపోయిన చెత్తను ఎరువుగా మార్చి పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్దింది. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు 75% ఉన్న గ్రామీణ జనాభా ఉపాధి, సరైన వసతులు లేక నగరాలకు, నిర్మాణ కూలీలుగా వలస పోతున్నారు. ఒకప్పుడు పాడి, చేతివృత్తులతో కళకళలాడిన పల్లెలు బోసిపోయాయి. ఈ పరిస్థితిని మార్చడానికి రోడ్లు, నాణ్యమైన విద్యుత్, స్కూళ్లు, పీహెచ్‌సీలను ఆధునీకరిస్తున్నాం. గతంలో మహిళా సంఘాలకు చెందిన రూ.1,600 కోట్ల ఇన్సూరెన్స్ సొమ్మును దారిమళ్లించి జగన్ మోసం చేశారు. కానీ టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు రుణ పరిమితి పెంచి, గతంలో వారికి ధాన్యం కొనుగోలు వ్యాపారాలు కూడా అప్పగించి మహిళా సాధికారతకు బాసటగా నిలిచింది. వాలంటీర్లను అడ్డం పెట్టుకుని ప్రజలను బెదిరించడం తప్ప జగన్ గ్రామీణ జీవితాలను ఏనాడూ బాగుచేయలేదు. స్వర్గీయ ఎన్టీ రామారావు కాలం నుంచే తెలుగుదేశం పార్టీకి గ్రామాలే పట్టుగొమ్మలు. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ అండతో ప్రతి గ్రామ సమస్యను ఆ గ్రామ ప్రజలే నిర్ణయించుకుని పరిష్కరించుకునేలా స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేస్తున్నామని అశోక్‌బాబు తెలిపారు.

జల్ జీవన్ నిధులూ మింగేసిన ఘనుడు జగన్..

గ్రామీణ ప్రజల గొంతు తడపాల్సిన జల్ జీవన్ మిషన్ నిధులను సైతం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దారిమళ్లించి పల్లెలను దాహార్తితో అల్లాడేలా చేసిందని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు మండిపడ్డారు. రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ కింద 90 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటే, కేంద్రం ఇచ్చిన నిధులను సైతం జగన్ ప్రభుత్వం మింగేసింది. కనీసం 25 లక్షల కనెక్షన్లు కూడా ఇవ్వకుండా గ్రామీణ ప్రజలను కలుషిత నీరు, డయేరియా వంటి రోగాల బారిన పడేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వాటా నిధులను జమ చేసి, దాదాపు రూ.12,000 కోట్లతో మిగిలిన అన్ని పంపు కనెక్షన్లను పూర్తి చేసి ప్రతి పల్లెకు సురక్షిత మంచినీరు అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో గ్రామీణ విద్యార్థులకు ఒక్క కిలోమీటర్ పరిధిలోనే బడులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటూ, అవసరమైన ఉపాధ్యాయులను నియమిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పీహెచ్‌సీలను ఆధునీకరించి, గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. రోడ్లు, రవాణా సౌకర్యాలను మెరుగుపరిచి పల్లెలను అనుసంధానిస్తున్నాం. పల్లెల్లో రైతులు, యువత, అన్ని వర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటోంది.

ఆర్థిక స్తోమత లేని యువతకు డైరీ, చేతివృత్తుల ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తున్నాం. చేనేత కార్మికులకు ప్రభుత్వం పూర్తి అండగా నిలవడంతో పల్లెల్లో పత్తి కొనుగోళ్లు పెరిగి రైతులకు మేలు జరుగుతోంది. కేంద్ర నిధులు నేరుగా పంచాయతీల ఖాతాలకే చేరేలా చేసి స్థానిక సంస్థలకు ఆర్థిక వెసులుబాటు కల్పించాం. పేదల ఇళ్ల నిర్మాణంలో కేంద్రం మొదట 75,000 ఇళ్లు మంజూరు చేస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ఢిల్లీ వెళ్లి మాట్లాడి ఏకంగా 3 లక్షల ఇళ్లు అదనంగా సాధించారు. ఈ ఐదేళ్లలో మొత్తం 9 లక్షల ఇళ్లను పేదలకు నిర్మించి ఇవ్వడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే గతంలో నిలిచిపోయిన ఇళ్లతో కలిపి 8 లక్షల ఇళ్లను పూర్తి చేశాం. రాయలసీమ నుంచి కోస్తాంధ్ర వరకు సమగ్ర గ్రామీణాభివృద్ధే కూటమి ప్రభుత్వ ఏకైక లక్ష్యం. గ్రామాల్లో విద్యా, వైద్య, తాగునీరు, గృహ నిర్మాణ రంగాల్లో మేము తెచ్చిన మార్పును ప్రజలు గుర్తించారు. పట్టణాల్లో మాకు 94% విజయం దక్కినట్లే, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఫలితాల్లోనూ గ్రామీణ ప్రజలు కూటమికి చారిత్రక విజయాన్ని అందించబోతున్నారని అశోక్ బాబు ధీమా వ్యక్తం చేశారు.

చెప్పిన అబద్ధమే వంద సార్లు..

అదే జగన్ నైజం

- 2019లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదు
- ఉద్యోగులకు కనీసం ఒక్క డీఏ కూడా ఇవ్వకుండా రివర్స్ పీఆర్సీతో దగా చేసిన ఘనుడు
- ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసే 'విక్టిమ్ కార్డు'తో మొసలి కన్నీరు
- అరాచకాలు, బూత్‌ల స్వాధీనం, హింసా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీనే
- గతం మరిచి ప్రజాస్వామ్య హక్కుల పోరాట యోధుడిలా నంగనాచి కబుర్లు
- అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో మరింత పెరిగిన నమ్మకం
- స్థానిక ఎన్నికల్లో అఖండ విజయం అందుకు నిదర్శనం
- టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్



అమరావతి (చైతన్యరథం): జగన్ మోహన్ రెడ్డి గత చరిత్ర మరిచి తాజా ప్రెస్‌మీట్‌లో ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న యోధుడిలా మాట్లాడిన తీరుచూసి ప్రజలందరూ విస్తుపోయారని టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ ఎద్దేవా చేశారు. జగన్ గత చరిత్ర, ఆయన పార్టీ నైజం, ఐదేళ్ల ఆయన విధ్వంసకర పాలన గురించి తెలియని ఏ అమాయకుడైనా ఆ ప్రెస్‌మీట్ వింటే నిజంగానే ప్రజాస్వామ్య హక్కుల కోసం జగన్ ఇంతలా తల్లడిల్లిపోతున్నాడా అని ఆశ్చర్యపోతారని, కానీ ఐదు కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన అసలు రూపం ఏంటో స్పష్టంగా తెలుసునని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాజేష్ మాట్లాడుతూ.. జగన్ అంటే ఏంటో, ఆయన విధానాలు ఏంటో, ఐదేళ్ల పాటు సాగించిన అరాచక పాలన ఏంటో ప్రజలకు స్పష్టంగా తెలుసు... న్యాయవ్యవస్థపై దాడి చేయడం, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం, ప్రతిపక్షాల గొంతు నొక్కడం లాంటి నియంతృత్వ పోకడలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన వ్యక్తి... నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నప్పటి నుంచి నేటి వరకు వైసీపీ శ్రేణులు ప్రదర్శిస్తున్న ఉన్మాదం గురించి, ఆ ఉన్మాదాన్ని నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తున్న జగన్ మోహన్ రెడ్డి వైఖరి గురించి ప్రజలకు తెలియనిది కాదు. ప్రజాస్వామ్య సంస్థలను ధ్వంసం చేసిన చరిత్ర జగన్‌ది కాదా? 2019 ఎన్నికలకు ముందు ఏ అబద్ధపు ప్రచారాలనైతే ఎంచుకున్నారో, నేటికీ జగన్ అదే పంథాను కొనసాగిస్తున్నారు. ఒకే అబద్ధాన్ని 10 సార్లు, 100 సార్లు, 1000 సార్లు చెబితే ప్రజలు నిజమని నమ్ముతారనే భ్రమల్లో ఆయన బతుకుతున్నారు. కానీ రాష్ట్ర ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి గత చరిత్రపై తిరుగులేని స్పష్టత ఉంది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన వ్యక్తి, ఇవాళ ప్రజాస్వామ్య ముసుగు వేసుకుని బుకాయించాలని చూస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూస్తూ ఊరుకోబోరని రాజేష్ హెచ్చరించారు.

11 సీట్లకు పాతరేసినా జ్ఞానోదయం కాలేదా?

2019 ఎన్నికల ముందు వైసీపీ సొంత మీడియా, పెయిడ్ సోషల్ మీడియా, కిరాయి మేధావుల ముసుగులో కొందరు వ్యక్తులు చేసిన అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు జగన్ మోహన్ రెడ్డికి అడిగిన దానికంటే ఎక్కువ మెజారిటీతో అధికారం కట్టబెట్టారు. కానీ పాలకుడిగా ఆయన ఐదేళ్ల విధ్వంసకర పాలన, మనస్తత్వాన్ని చూసిన తర్వాతే 2024 ఎన్నికల్లో రాష్ట్ర పౌర సమాజం 151 సీట్ల నుంచి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కని విధంగా 11 సీట్లకు పరిమితం చేసి కర్రు కాల్చి వాత పెట్టింది. అంతటి ఘోర పరాభవం ఎదురైనా, జగన్ ఇంకా పాత చింతకాయ పచ్చడి అబద్ధాలనే నమ్ముకుని ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాడని రాజేష్ నిప్పులు చెరిగారు. మా పాలన సువర్ణయుగం, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని ప్రెస్‌మీట్‌లో జగన్ పదేపదే చెప్పుకోవడం ఆయన రాజకీయ అజ్ఞానానికి, మానసిక స్థితికి నిదర్శనం. ప్రజలకు చేసిన మోసం తెలిసే కదా 2024లో చిత్తుచిత్తుగా ఓడించింది? అలాంటి వ్యక్తి నేడు ప్రజా తీర్పుతో ఏర్పాటైన ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని, సూపర్ సిక్స్ పథకాలను ప్రశ్నించడం హాస్యాస్పదం. తన మేనిఫెస్టోను 98% అమలు చేశానని పచ్చి అబద్ధాలు చెబుతున్న జగన్, రాష్ట్రంలో సగభాగమైన మహిళలకు ఇచ్చిన 'పూర్తి మద్యనిషేధం' హామీని ఎందుకు తుంగలో తొక్కారు? మద్యనిషేధం అమలు చేయకపోతే 2024లో ఓట్లే అడగను అని చెప్పిన జగన్ మాట తప్పారా..లేదా? ప్రభుత్వ మద్యం దుకాణాల ముసుగులో జే-బ్రాండ్లు తెచ్చి, 30 వేల మంది ప్రాణాలు గాల్లో కలవడానికి, లక్షలాది కుటుంబాలు రోడ్డున పడటానికి కారకుడు కాదా? మాట తప్పి, మడమ తిప్పి మహిళా లోకాన్ని మోసం చేసినందుకే అక్కాచెల్లెమ్మలు 2024లో జగన్‌ను రాజకీయంగా సమాధి చేశారు. ఎన్నికల ముందు కాలేజీలు, యూనివర్సిటీల చుట్టూ 'యువభేరి' సదస్సులు పెట్టి రాష్ట్ర యువతను జగన్ దారుణంగా వంచించారు. మెజారిటీ ఎంపీలను ఇవ్వండి, కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని నమ్మబలికి, ఎంపీలను గెలిపిస్తే ఐదేళ్ల పాటు సొంత కేసుల మాఫీ కోసం రాష్ట్ర ప్రయోజనాలను ఢిల్లీకి తాకట్టు పెట్టలేదా? దావోస్ పర్యటనలు అక్కర్లేదు, సీఐఐ సదస్సులు అక్కర్లేదని ప్రగల్భాలు పలికిన జగన్... ఐదేళ్లలో ఏ ఒక్క పరిశ్రమనైనా తెచ్చారా? ఉన్న పరిశ్రమలను తరిమికొట్టి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టలేదా? ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్, లక్షలాది ఉద్యోగాలు, మెగా డీఎస్సీ అని చెప్పి నిరుద్యోగ యువత జీవితాలతో ఐదేళ్లు చెలగాటమాడింది వాస్తవం కాదా? ఒకే అబద్ధాన్ని పదిసార్లు, వందసార్లు చెబితే నిజమైపోతుందను కోవడానికి ఇది 2019 కాదు, 2026. జగన్ మోహన్ రెడ్డి నమ్మక ద్రోహం, ఆయన చేసిన దగాపై రాష్ట్ర ప్రజలకు, యువతకు తిరుగులేని స్పష్టత ఉంది. ఇప్పటికైనా అబద్ధాల ప్రచారాలు మాని, ప్రజా తీర్పును గౌరవించడం నేర్చుకోవాలని రాజేష్ హితవు పలికారు.

కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడమా?

ప్రభుత్వోద్యోగులను అన్ని రకాలుగా మోసం చేసి, రాష్ట్రాన్ని రూ. 10 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టి, రాజధాని అమరావతిని అస్థిరపరిచిన గత పాలకుడు జగన్ మోహన్ రెడ్డి... నేడు సిగ్గులేకుండా సూపర్ సిక్స్ హామీల అమలుపై కూటమి ప్రభుత్వాన్ని వేలెత్తి చూపడం హాస్యాస్పదమని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జగన్ పాలనలో జరిగిన నయవంచన, కూటమి ప్రభుత్వ సంక్షేమం-అభివృద్ధిపై వాస్తవాలను వివరించారు. 2019 నాటి అశుతోష్ మిశ్రా కమిషన్ నివేదికను 2022 దాకా సాగదీసి, అప్పటివరకు ఉన్న 27% ఐఆర్ కన్నా తక్కువగా 23% ఫిట్‌మెంట్‌తో ఉద్యోగుల గొంతు కోశారు. హెచ్ఆర్ఏ స్లాబులు కుదించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సైతం ఇవ్వకుండా వేధించారు. ఐదేళ్ల పాలనలో ఉద్యోగులకు ఒక్కటంటే ఒక్క డీఏ కూడా మంజూరు చేయని ఏకైక దుర్మార్గపు పాలకుడు జగన్. వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని, పోలీసు సిబ్బందికి వీక్లీ ఆఫ్ ఇస్తానని చెప్పి నట్టేట ముంచారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారు. అసెంబ్లీ సాక్షిగా అమరావతిని రాజధానిగా అంగీకరించి, అధికారంలోకి వచ్చాక మూడు ముక్కలాట ఆడి రాష్ట్రాన్ని రాజధాని లేని దిక్కులేని స్థితికి తెచ్చారు. రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారం, ఏడాదికి రూ. 60 వేల కోట్ల వడ్డీలు-అసలు చెల్లింపుల వంటి ఆర్థిక విధ్వంసం వారసత్వంగా దక్కినా... పదవీ బాధ్యతలు చేపట్టిన 19 రోజుల్లోనే ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. 63 లక్షల మంది లబ్ధిదారులకు నెలకు రూ. 2,700 కోట్ల చొప్పున ఇప్పటివరకు ఏకంగా రూ. 79 వేల కోట్లను పెన్షన్ల కోసం వెచ్చించాం. వృద్ధులు, వితంతువులకు రూ. 4,000, దివ్యాంగులకు రూ. 6,000, డయాలసిస్ బాధితులకు రూ. 10,000, పూర్తి వైకల్యం ఉన్నవారికి రూ. 15,000 పెన్షన్ ఇస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచాం. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ వర్తింపజేస్తూ తల్లికి వందనం అమలు చేస్తున్నాం. గతంలో ఇంట్లో ఎంతమంది ఉన్నా ఒకరికే అదీ కోతలు పెట్టి రూ. 13,000 ఇచ్చిన జగన్ మాకు పాఠాలు చెబుతారా? పీఎం కిసాన్ నిధులకు అదనంగా జగన్ ఇచ్చింది కేవలం రూ. 7,500 అయితే, నేడు కూటమి ప్రభుత్వం కేంద్ర నిధులతో కలిపి ఏటా రూ. 20,000 (రాష్ట్ర వాటా రూ. 14,000) రైతులకు నేరుగా అందిస్తోంది. రాష్ట్రంలోని మహిళలకు ఇప్పటికే 5 కోట్ల 10 లక్షల ఉచిత సిలిండర్లు అందించగా, దీనికి రూ. 3,942 కోట్ల సబ్సిడీని ప్రభుత్వమే భరించింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఇప్పటికే 101 కోట్ల ఉచిత ప్రయాణాలు సాగించారు. ఆర్టీసీకి సబ్సిడీ రూపంలో ప్రభుత్వం రూ. 3,550 కోట్లను రీయింబర్స్ చేసింది. రాష్ట్రంలో 20 లక్షల మంది యువతకు ఉపాధి లక్ష్యంగా ఇప్పటికే సుమారు రూ. 23-24 లక్షల కోట్ల పారిశ్రామిక ఒప్పందాలు చేసుకున్నాం. దేశం మొత్తంలో నమోదైన పెట్టుబడి ప్రతిపాదనల్లో ఆంధ్రప్రదేశ్ ఏకంగా 25.3% వాటాతో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. 24 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించి, క్యాబినెట్ అనుమతులతో పరిశ్రమలను వేగంగా గ్రౌండింగ్ చేయిస్తున్నాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల రోడ్ల పునర్నిర్మాణానికి వేల కోట్ల నిధులు కేటాయించాం. 'పల్లె పండుగ 1.0, 2.0, 3.0' ద్వారా దాదాపు రూ. 23,000 కోట్లతో గ్రామీణ రహదారులను శరవేగంగా అభివృద్ధి చేస్తున్నాం. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వ పాలనను మెచ్చి సాధారణ ఎన్నికల్లో 164 సీట్లతో అఖండ విజయం అందించిన ప్రజలే... మొన్నటి మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లోనూ అదే చారిత్రక తీర్పును పునరుద్ఘాటించారు. పంచాయతీరాజ్ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు వైసీపీని తుంగలో తొక్కడానికి సిద్ధంగా ఉన్నారు. కూటమిపై ఉన్న నమ్మకంతో ప్రజలు ఘన విజయం కట్టబెడుతుంటే... తట్టుకోలేక రిగ్గింగ్‌లు, అరాచకాలు అంటూ అలవాటైన అబద్ధాలతో తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని రాజేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ఆత్మవంచన మానుకుని ప్రజా తీర్పును శిరసావహించాలని ఆయన హెచ్చరించారు.

హింస, బాంబుల రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ మీరే

రాష్ట్రంలో హింసను, అరాచకాన్ని బహిరంగంగా ప్రేరేపిస్తోంది వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి. నేటికీ తెలుగుదేశం శ్రేణులపై పెట్రోల్ బాంబులతో దాడులు చేస్తోంది మీ పార్టీ గూండాలే. దౌర్జన్యాలకు, బూత్‌ల ఆక్రమణకు పేటెంట్ హక్కు జగన్ రక్తంలోనే ఉందని రాజేష్ విరుచుకుపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని తేలిపోవడంతోనే జగన్ మీడియా ముందుకు వచ్చి 'విక్టిమ్ కార్డు' డ్రామాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. 2004 ఎన్నికల సందర్భంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమర్పించిన అఫిడవిట్‌ను ఒక్కసారి తిరగేస్తే ఆయనపై నమోదైన బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్, దౌర్జన్యాలు, పోలీసులను బెదిరించిన కేసులు రాష్ట్ర ప్రజలకు కనిపిస్తాయి. మా నాయకులు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ మీద ఎప్పుడైనా అలాంటి అరాచకపు కేసులు ఉన్నాయా? ప్రజాస్వామ్య స్ఫూర్తిని తూచా తప్పకుండా పాటిస్తున్న నాయకత్వం మాది. దశాబ్దాలుగా హింస, దాడులు, అక్రమాలనే రాజకీయ పెట్టుబడిగా మార్చుకున్న చరిత్ర వైఎస్ కుటుంబానిది, వైసీపీది కాదా? శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ప్రతి నియోజకవర్గంలో, ప్రతి మండలంలో వైసీపీ అభ్యర్థులు స్వేచ్ఛగా వేలాది ఎంపీటీసీ, వందలాది జెడ్పీటీసీ నామినేషన్లు వేశారు. నేను పార్టీ తరఫున తెనాలి నియోజకవర్గ అబ్జర్వర్‌గా క్షేత్రస్థాయిలో పర్యటించాను. తెనాలి రూరల్ మండల పరిధిలోని 21 ఎంపీటీసీ సెగ్మెంట్లలో, అక్కడ ఉన్న 79 పోలింగ్ బూతుల్లోనూ వైసీపీ ఏజెంట్లు కూర్చున్నారు. వైసీపీ అభ్యర్థులు ప్రచారం చేసుకున్నారు, ప్రజలను ఓట్లు అడిగారు, ఎన్నికల్లో స్వేచ్ఛగా పాల్గొన్నారు. మరి అరాచకం రాజ్యం ఏలుతుంటే, నామినేషన్లు వేయనివ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా వేల మంది వైసీపీ అభ్యర్థులు ఎలా బరిలో నిలిచారు? 79 బూతుల్లో మీ ఏజెంట్లు ఎలా కూర్చున్నారు? ఓడిపోతామని తెలిసే ఇప్పుడు మీడియా ముందు ఈ దొంగ ఏడుపులు ఎందుకు? జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ముక్తకంఠంతో తిరస్కరిస్తున్నారు. ఒకే పడికట్టు అబద్ధాలు, అదే విక్టిమ్ కార్డు డ్రామాలు ఎల్లకాలం చెల్లవని గుర్తించాలి. ఇవన్నీ పనికిరాని ఔట్‌డేటెడ్ వ్యూహాలు. ఎందుకు ప్రజలు మిమ్మల్ని పదేపదే ఛీత్కరిస్తున్నారో ఆత్మ విమర్శ చేసుకోకపోతే... రాబోయే ప్రతి ఎన్నికలోనూ ప్రజలు ఇంతకంటే ఘోరమైన పరాభవాన్ని మిగులుస్తారు. కార్యకర్తల్లో కనీస విశ్వాసాన్ని, స్ఫూర్తిని నింపలేని అసమర్థ నాయకత్వం జగన్‌ది. క్షేత్రస్థాయి వాస్తవాలు తెలుసుకున్న వైసీపీ శ్రేణులు కూడా ఇప్పటికే మేల్కొన్నారు. భవిష్యత్తులో జగన్ వెంట నడవడానికి సొంత పార్టీ కేడర్ కూడా సిద్ధంగా లేదు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం నుంచి 'జగన్ ఫ్యాక్టర్', వైసీపీ శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని అప్పసాని రాజేష్ స్పష్టం చేశారు.

చెప్పాం.. చేసి చూపిస్తున్నాం

- మహిళలకు రాజకీయ నాయకత్వం
- యువత భుజస్కంధాలపై సమగ్ర బాధ్యతలు..
- రాజకీయాల్లో కొత్త తరానికి సరికొత్త అవకాశాలు
- మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కనిపిస్తోన్న దృశ్యం
- రాజకీయ నేపథ్యం లేనివారికీ నాయకత్వ అవకాశం
- విద్యావంతులైన యువతరానికి అధిక ప్రాధాన్యత
- అన్న మాటను ఆచరణలో చూపుతున్న తెలుగుదేశం



రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించడం, యువతరాన్ని నాయకత్వ బాధ్యతలవైపు ప్రోత్సహించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకం. ఎన్నికల సమయంలో అవకాశాలు కల్పించడమే కాదు, రాజకీయ నిర్ణయాల్లో భాగస్వాములను చేయడం, పాలనా బాధ్యతలు అప్పగించడం ద్వారా మాత్రమే ఆ లక్ష్యం నెరవేరుతుందన్నది తెలుగుదేశం పార్టీ నమ్మి, ఆచరిస్తోన్న సిద్ధాంతం. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మేయర్లు, చైర్‌పర్సన్లుగా ఎన్నికైన అభ్యర్థుల వివరాలను విడివిడిగా పరిశీలిస్తే మహిళలు, విద్యావంతులు, రాజకీయ నేపథ్యం లేని కొత్త ముఖాలకు తెలుగుదేశం పార్టీ కల్పించిన ప్రాతినిధ్యం ఆసక్తికరం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సారథ్యంలోని తెలుగుదేశం పార్టీ తన రాజకీయ ప్రస్థానంలో మహిళలు, వెనుకబడిన వర్గాలు, యువ నాయకత్వానికి అవకాశాల అంశాన్ని ప్రస్తావిస్తూ రావడమే కాదు, ప్రతి ఎన్నికల సమయంలో ఆచరణలోనూ చూపుతోన్న అంశం. ప్రస్తుత ఎన్నికల్లోనూ పార్టీ ఈ అంశాలకు ప్రాధాన్యత కల్పించిందన్న విషయం.. తాజా విజేతల వివరాలు పరిశీలిస్తే అవగతమవుతుంది. అంటే – తాజా మున్సిపల్ ఎన్నికల్లో నమోదైన ఫలితాలు ఈ దిశగా పరిశీలించదగిన కొన్ని గణాంకాలను అందిస్తున్నాయి.

మహిళలకు నాయకత్వ బాధ్యతలు..

ఎనిమిది మంది మేయర్లు

తాజాగా జరిగిన 13 మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి విజయం సాధించిన వారు 10మంది అయితే.. కూటమి భాగస్వామ్య పక్షమైన జనసేన నుంచి ఇద్దరు విజయం సాధించారు. టీడీపీ నుంచి విజయం సాధించిన పదిమంది మేయర్ అభ్యర్థులలో (విశాఖపట్నం నుంచి డాక్టర్ ముక్కా శ్రావణి, విజయనగరం నుంచి అవనాపు భార్గవి, గుంటూరు నుంచి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, మచిలీపట్నం నుంచి షేక్ అబ్దుల్ అబీదా, కడప నుంచి సువర్ణ, కర్నూలు నుంచి వీవీ జయ ప్రత్యూష, చిత్తూరు నుంచి కటారి హేమలత, ఒంగోలు నుంచి నల్లమల్లి శ్రీశిల్ప మేయర్లుగా బాధ్యతలు చేపట్టనున్నారు) 8మంది మహిళలే కావడం ఆసక్తికరమైన అంశం. అంటే మొత్తం స్థానాల్లో.. తెలుగుదేశం పార్టీ మహిళలకు కల్పించిన వాటా సుమారు 61.5 శాతం. మహిళలకు అవకాశాలు కల్పించడంలో మరో ముఖ్యమైన అంశం.. వారి రాజకీయ నేపథ్యం. తెలుగుదేశం పార్టీ అవకాశం కల్పించిన ఎనిమిది మంది మహిళల వివరాలను విడిగా పరిశీలిస్తే.. నలుగురికి అసలు రాజకీయ నేపథ్యం లేనివారే. మరో నలుగురు రాజకీయ నేపథ్యమున్న కుటుంబాల నుంచి వచ్చినవారు. అంటే రాజకీయ కుటుంబాల నుంచి వచ్చినవారికే కాకుండా, స్వతంత్రంగా రాజకీయాల్లోకి వచ్చిన మహిళలకూ నాయకత్వ బాధ్యతలు ఇవ్వడం.. మహిళలకు రాజకీయ ప్రాధాన్యతల విషయంలో తెలుగుదేశం పార్టీ చెప్పిన దానికంటే ఎక్కువే చేస్తున్నట్టు. ఇది మహిళా రాజకీయ ప్రాతినిధ్యంలో రెండు కోణాలను చూపిస్తోంది. ఒకవైపు రాజకీయ అనుభవం, కుటుంబ నేపథ్యమున్న మహిళలకు అవకాశాలు కల్పిస్తూనే.. మరోవైపు రాజకీయ వారసత్వం లేని మహిళలను ఉన్నత స్థానాలకు చేర్చడం. ఈ రెంటిమధ్య సమతుల్యతను పరిశీలిస్తే.. పార్టీ రాజకీయలకు కొత్త నాయకత్వాన్ని అభివృద్ధి చేసుకునే అంశంగా పరిగణించొచ్చు. అయితే రాజకీయ నేపథ్యం లేదనే అంశాన్ని రాజకీయ అనుభవం లేనిదిగా భావించకూడదు. తెలుగుదేశం పార్టీ విజేతలను విడివిడిగా పరిశీలిస్తే.. ఐదుగురు గత రాజకీయ అనుభవం లేనివారైతే, ఐదుగురు రాజకీయ అనుభవం ఉన్నవారు. అలాగే నాయకుల కుటుంబాలకు వారసులుగా లేదా సంబంధిత నాయకత్వ కుటుంబాల నుంచి వచ్చినవారిలో ఇద్దరున్నారు. ఈ మూడు అంశాలు వేర్వేరు ప్రమాణాలు కావడం గమనార్హం.

విద్యావంతులైన నాయకత్వానికి ప్రాధాన్యత

రాజకీయాల్లో విద్యావంతుల భాగస్వామ్యం పెరగడం స్థానిక పాలనలో విధానాల అవగాహన, పరిపాలనా ప్రక్రియలు, ప్రజా సమస్యల విశ్లేషణ వంటి అంశాలకు ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ విజేతల విద్యార్హతలూ ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. పదో తరగతి కంటే తక్కువ విద్యార్హత కలిగినవారు ఎవ్వరూ లేరు. అండర్ గ్రాడ్యుయేట్లు ఇద్దరు, గ్రాడ్యుయేషన్, అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన వారు ఐదుగురు, డాక్టరేట్, ఇంజినీరింగ్, న్యాయ విద్య తదితర ప్రత్యేక విద్యార్హతలు కలిగిన వారు ముగ్గురు ఉన్నారు. అంటే –పార్టీనుంచి విజయం సాధించిన వారిలో ఎనిమిది మంది గ్రాడ్యుయేషన్ లేదా అంతకంటే ఎక్కువస్థాయి విద్యార్హతలు కలిగినవారే.



– నీలం నాయుడు, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్

30-50 ఏళ్ల వయసు విభాగంలో..

నాయకత్వంలో తరాల మార్పు గురించి చర్చించేటప్పుడు వయసు గణాంకాలూ కీలకమే. కార్పొరేషన్ ఎన్నికలలో కూటమి నుంచి విజయం సాధించిన 12 మందిలో 30 నుంచి 50 ఏళ్ల వయసులో ఉన్నవారు 11మంది. అందులో తెలుగు దేశం పార్టీనుంచి విజయం సాధించిన వాళ్లంతా 30నుంచి 50 ఏళ్లలోపు వయస్కులే. అంటే మధ్యతరగతి వయస్కుల నాయకత్వానికి గణనీయమైన ప్రాతినిధ్య మివ్వడం.. నాయకులు తమ వృత్తిపరమైన అనుభవం, విద్య, సామాజిక అవగాహనలను స్థానిక పాలనలో వినియోగించుకునే అవకాశం ఉంటుందనే. సామాజిక ప్రాతినిధ్యంగా.. రిజర్వేషన్ల ప్రాతిపదికన చూసినా టీడీపీ నుంచి విజయం సాధించిన 10మందిలో రెండు స్థానాలు బీసీ, ఒకటి ఎస్సీకి దక్కాయి. మహిళలు, బీసీలు, ఎస్సీలు, విద్యావంతులు, కొత్త రాజకీయ ముఖాలు.. ఇలా వివిధ వర్గాల ప్రాతినిధ్యాన్ని విడివిడిగా పరిశీలించడంతోపాటు, ఆయా వర్గాల మధ్య అంతర్గత ప్రాతినిధ్యాన్నీ విశ్లేషిస్తే.. తెలుగుదేశం పార్టీ ఏయే వర్గాలకు ఎలాంటి ప్రాధాన్యతనిస్తుందో స్పష్టమైన అవగాహన కలుగకపోదు.

మహిళా సాధికారతకు రాజకీయాలకతీతంగా ఆర్థిక ప్రోత్సాహం

మహిళలను రాజకీయంగా ప్రోత్సహించడం ఒక్కటే సాధికారత కాదు. ఆర్థిక స్వావలంబన, ఉపాధి, వ్యాపార అవకాశాలు, స్వయం ఉపాధి సంస్థల అభివృద్ధి కూడా మహిళల సామాజిక స్థాయిని పెంచే అంశాలు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024-29 కాలానికి తీసుకొచ్చిన ఎంఎస్ఎంఈ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీలో 2030 నాటికి 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యాన్ని ప్రకటించింది. ఈ విధానంలో మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. మహిళల ఆధ్వర్యంలోని వ్యాపార సంస్థలకు ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహకారం వంటి అంశాలు మహిళల స్వావలంబనకు తోడ్పడే విధానపరమైన చర్యలుగా చూడవచ్చు. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదిగిన మహిళలు స్థానిక సంస్థలు, సామాజిక సంఘాలు, ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో మరింత చురుకుగా పాల్గొనే అవకాశాలు కూడా పెరుగుతాయి.

యువతకు పదవులతోపాటు నిర్ణయాల్లో భాగస్వామ్యం

యువతకు రాజకీయ అవకాశాలు కల్పించడం అంటే కేవలం ఎన్నికల్లో పోటీ చేయించడమే టీడీపీ విధానం కాదు. పార్టీ నిర్మాణం, విధాన రూపకల్పన, ప్రజా సమస్యల గుర్తింపు, స్థానిక అభివృద్ధి ప్రణాళికలు, డిజిటల్ ప్రచారం, ప్రజలతో నిరంతర సంబంధాలు వంటి అంశాల్లో యువతకు బాధ్యతలు అప్పగించడమనే దృక్పథాన్ని ఆచరణలో చూపుతోంది. విద్యావంతులైన యువ నాయకత్వం స్థానిక పాలనలో సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ సేవలు, పట్టణ మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి అవకాశాల వంటి అంశాలపై కొత్త ఆలోచనలను తీసుకొస్తుందనడంలో సందేహాలు అక్కర్లేదు. యువతకు రాజకీయ ప్రవేశం కల్పించడంతోపాటు, వారికి శిక్షణ, అనుభవం, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించాలన్న తెలుగు దేశం పార్టీ విధాన నిర్ణయం – ఇందులో భాగమే!

చెప్పిన లక్ష్యాలు.. అమలులో కనిపించాల్సిన ఫలితాలు

మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం, యువతకు నాయకత్వ అవకాశాలు, కొత్త ముఖాలకు ప్రోత్సాహం వంటి అంశాలు రాజకీయ పార్టీలకు కేవలం ఎన్నికల నినాదాలుగా మిగలకూడదన్నది టీడీపీ నాయకత్వం పదేపదే చెప్పే మాట. అందుకే –ఎన్నికల్లో లభించిన పదవులను ప్రజలకు సేవ చేసే వేదికలుగా మారుస్తోంది. మహిళా ప్రజాప్రతినిధులకు స్వతంత్ర నిర్ణయాధికారం, యువ నాయకులకు విధానపరమైన బాధ్యతలు, రాజకీయ నేపథ్యం లేని వారికి ఎదిగే అవకాశాలు కల్పిస్తూ.. రాజకీయాల్లో కొత్త తరానికి నిజమైన స్థానం అందిస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో నమోదైన ఈ గణాంకాలు మహిళలు, విద్యావంతులు, రాజకీయ నేపథ్యం లేని అభ్యర్థులకు లభించిన ప్రాతినిధ్యాన్ని తెలియజేస్తున్నాయి. అదే సమయంలో –ఈ ప్రాతినిధ్యం పాలనా ఫలితాల్లో, ప్రజా సమస్యల పరిష్కారంలో, నిర్ణయాధికారంలో ప్రతిఫలించాలన్న ఆలోచనతో పార్టీ నాయకత్వం శ్రేణులను ముందుకు నడిపిస్తుండటం ముదావహం. రాజకీయాల్లో మహిళలకు స్థానం, యువతకు అవకాశం, కొత్త తరానికి బాధ్యత.. ఈ మూడు అంశాలు ప్రకటనలు దాటి ఆచరణలో నిరంతరంగా సాగినప్పుడే ప్రజాస్వామ్య నాయకత్వం మరింత విస్తృతమవుతుందన్నది తెలుగు దేశం ఆచరణలో చూపుతోన్న విధానం.

మురుసు తుఫాన్‌తో ప్రకాశం జిల్లాలో కుప్పకూలిన విద్యుత్ వ్యవస్థ

● అంధకారంలోకి వెళ్లిపోయిన పలు గ్రామాలు... ఫోన్‌లలో ఛార్జింగ్, సిగ్నల్స్ లేక, తాగడానికి నీళ్లు లేక ప్రజలు అవస్థలు

● యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిన విద్యుత్ శాఖ... 30 సెక్షన్‌లలో విద్యుత్ పునరుద్ధరణ



అమరావతి (చైతన్యరథం): మురసు తుఫాన్ తీరమైతే దాటింది కానీ.. కొన్ని గ్రామాల్లో మాత్రం ఇంకా చీకటి కొనసాగుతుంది. తుఫాన్ కారణంగా ప్రకాశం జిల్లాలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది. దీంతో 150 గ్రామాలు అంధకారంలోకి పోయాయి. దీంతో ఫోన్‌లలో ఛార్జింగ్, సిగ్నల్స్ లేక, తాగడానికి నీళ్లు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఆ గ్రామాల్లో కరెంట్ కష్టాలను తీర్చేందుకు విద్యుత్ శాఖ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది.కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి దాదాపు 700 మంది సిబ్బందిని ప్రకాశం జిల్లాకు రప్పించడం జరిగింది. చుట్టూ చీకటి.. బయట ప్రపంచంతో సంబంధాలు లేవు.. తాగడానికి నీళ్లు లేవు.. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉన్నా ప్రయోజనం లేదు. ఎందుకంటే అందులో ఛార్జింగ్ లేదు. గత మూడు రోజులుగా ఏపీలోని 150 గ్రామాల్లో పరిస్థితి ఇది. కరెంట్ లేక.. తాగడానికి నీళ్లు లేక అల్లాడుతున్నారు.

కూలిన విద్యుత్ వ్యవస్థ.. 150 పల్లెల్లో నీటి కోసం కటకట..

తుఫాన్ ప్రభావం కారణంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 776 గ్రామాల్లో కరెంట్ నిలిచిపోయింది. దీంతో నాగులుప్పలపాడు, కొత్తపట్నం మండలాల్లోకి 150కి పైగా గ్రామాలు మూడు రోజులుగా చీకటిలోనే మగ్గుతున్నాయి. కరెంట్ లేకపోవడంతో మోటార్లు లేక తాగునీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ప్రజలు చుక్క నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. తుఫాన్ గాలులకు జిల్లా విద్యుత్ వ్యవస్థ పూర్తిగా నాశనమైంది. ఏకంగా 2 వేల 500 కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. వందలాది ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయి. నాగులుప్పలపాడు మండలంలో ఐదు సబ్ స్టేషన్లతో పాటు మొత్తం 16 సబ్‌స్టేషన్ల పరిధిలో ప్రధాన లైన్లు తెగిలిపోయాయి. ఈ స్థాయిలో కరెంట్ కష్టాలు వచ్చాయి.

మొబైల్ ఛార్జింగ్‌కు రూ.50లు... సిగ్నల్ కట్..

కరెంట్ లేకపోవడంతో గ్రామాల్లో నివసిస్తున్న వారి దగ్గర మొబైల్ ఫోన్లు పూర్తిగా ఆగిపోయాయి. మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లు పగటిపూట కనీసం జనరేటర్లు కూడా వినియోగించలేదు. దీంతో మొబైల్ సిగ్నల్స్, ఇంటర్నెట్ సేవలు కూడా నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు బయటి ప్రపంచంతో దాదాపుగా పూర్తిగా సంబంధాలు కట్ అయిపోయాయి. అయితే దీంతో కొత్తపట్నం మండల కేంద్రంలో జనరేటర్లు ఏర్పాటు చేసి, మొబైల్ చార్జింగ్ పెట్టినందుకు అక్షరాలా రూ.50 వసూలు చేస్తున్నారు. అవసరం కొద్ది జనం కూడా అలాగే డబ్బులిచ్చి తమ ఫోన్లకు ఛార్జింగ్ చేసుకుంటున్నారు.

యుద్ధ ప్రాతిపదికన చర్యలు...

ఆ గ్రామాల్లో కరెంట్ కష్టాలను తీర్చేందుకు విద్యుత్ శాఖ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి దాదాపు 700 మంది సిబ్బందిని ప్రకాశం జిల్లాకు రప్పించడం జరిగింది. గురువారం సాయంత్రానికి 30 సెక్షన్లలో కరెంట్ పునరుద్ధరించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తుండగా.. సీపీడీసీఎల్ సీజీఎం సుబ్బారావు స్వయంగా నాగులుప్పలపాడులో పనులను పర్యవేక్షిస్తున్నారు.

శ్రీకాకుళం, కుప్పం విమానాశ్రయాల ఏర్పాటుకు సైట్ క్లియరెన్స్



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో నూతన విమానాశ్రయాల నిర్మాణానికి కీలక ముందడుగు పడింది. కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాల ఏర్పాటుకు కేంద్ర పౌర విమానయాన శాఖ (మోకా) సైట్ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో ఆ విమానాశ్రయాల నిర్మాణానికి అవసరమైన తదుపరి చర్యలు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వానికి మార్గం సుగమమైంది. ఈ రెండింటికి సంబంధించిన భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. వీటిని ల్యాండ్ లార్డ్ (ప్రభుత్వానికి పూర్తి హక్కులు ఉండే) విధానంలో చేపట్టాలా లేక పీపీపీ (ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్యం) విధానంలో నిర్మించాలా అనే అంశంపై రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రాగానే మోకాకు సమాచారం అందించి, ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన (ఆర్ఎఫ్‌పీ) జారీ చేయనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9 విమానాశ్రయాలను రూ.6,418 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఇందులో కుప్పం, శ్రీకాకుళం, అమరావతి విమానాశ్రయాల స్థల క్లియరెన్స్ కోసం మోకాకు ప్రతిపాదనలు పంపగా.. ప్రస్తుతానికి కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు కేంద్రం నుంచి అనుమతులు వచ్చాయి. అలాగే ఉడాన్ 2.0 పథకం కింద నాగార్జునసాగర్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసేందుకు వీలుగా మోకాకు ప్రత్యేకంగా దరఖాస్తు చేశారు.

శ్రీకాకుళం విమానాశ్రయం వివరాలు..

రూ.750.52 కోట్ల వ్యయంతో శ్రీకాకుళం విమానాశ్రయాన్ని మొదటి దశలో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకోసం 1,185.56 ఎకరాల విస్తీర్ణంలో ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌ను అధికారులు సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టును 2030 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కుప్పం ఎయిర్ పోర్ట్ కోసం 1,788 ఎకరాలను ప్రభుత్వం గుర్తించగా, ఇప్పటికే 1,300 ఎకరాల భూసేకరణ పూర్తయింది. భూసేకరణకు రూ.198.75 కోట్లు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.146 కోట్లు ఖర్చు చేయనున్నారు. త్వరలోనే ఈ విమానాశ్రయాల నిర్మాణాన్ని ఏ విధానంలో అభివృద్ధి చేయనున్నారో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

జ్వరం, విరోచనాలతో ఆస్పత్రిపాలైన కురుపాం విద్యార్థినులు



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లాలోని కురుపాం గురుకులం స్కూళ్లో మరోసారి కలకలం రేగింది. పాఠశాలకు చెందిన 44 మందికిపైగా విద్యార్థినులు ఒకేసారి అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అసలు విద్యార్థులకు ఏం జరిగిందో తెలియక అందరూ కంగారు పడుతున్నారు. గురుకుల పాఠశాలలోని కొందరు విద్యార్థులు అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యారు. వాంతులు, విరోచనాలు, జ్వరం, జలుబు బారిన పడ్డారు. దీనిపై అప్రమత్తమైన ఉపాధ్యాయులు, సిబ్బంది వెంటనే వారిని చికిత్స కోసం మాదలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం వారికి అక్కడ డాక్టర్లు వైద్యం అందిస్తున్నారు. అయితే, ఒకేసారి ఇంతమంది విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియ రాలేదు. దీనికి కల్తీ ఆహారం లేదా అపరిశుభ్రమైన నీరు ఏమైనా కారణమా? అనే కోణంలో ఆలోచిస్తున్నారు. లేక వాతావరణ మార్పుల వల్ల ఇలా జరిగిందా? అని కూడా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. మరోవైపు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి సత్యకుమార్ స్పందించారు. వెంటనే వైద్యాధికారులు, కలెక్టర్‌తో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అధికారులకు సూచించారు. అయితే విద్యార్థుల కోసం తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

సాలూరు అభివృద్ధికి కూటమి నాయకుల సమిష్టి కృషి అవసరం

●ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాలూరును ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దాలి

●రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి (చైతన్యరథం): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని మంత్రి కార్యాలయంలో సాలూరు మున్సిపల్ నూతన చైర్‌పర్సన్‌గా జనసేన పార్టీ తరఫున విజయం సాధించిన గొర్లే విజయకుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు ఆమెకు అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. అదే స్ఫూర్తితో కూటమి పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో, సమిష్టి బాధ్యతతో పనిచేస్తూ సాలూరు పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సాలూరును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కూటమి ఐక్యతను చాటుతూ సాలూరు అభివృద్ధికి నూతన అధ్యాయం లిఖించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జి. మాధవరావు, తిరుపతిరావు, గోవిందరావు, లక్ష్మీజీ, వెంకటరమణ, సూర్యనారాయణ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

విశాఖను విశ్వనగరంగా తీర్చిదిద్దాలి

● మేయర్‌గా ఎన్నికైన ముక్కా శ్రావణికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచన



పీఎంపాలెం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా విశాఖను అంతర్జాతీయ స్థాయి విశ్వనగరంగా అభివృద్ధి చేయాలని జీవీఎంసీ మేయర్‌గా ఎన్నికైన ముక్కా శ్రావణికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచిం చారు. ఎంవీపీ కాలనీలోని గంటా క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయనను శ్రావణి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను గంటా దంపతులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శ్రావణి మాట్లాడుతూ ఎమ్మెల్యే గంటా తనకు గెలుపు సెంటిమెంట్ అని పేర్కొన్నారు. గతంలో ఆయన ప్రోత్సాహంతోనే కార్పొరేటర్గా గెలిచానని, తన తండ్రి ముత్యాల నాయుడికి 2000లో టికెట్ ఇప్పించి అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ఆ సెంటిమెంట్‌తోనే భీమిలి నుంచే తన ప్రచారాన్ని ప్రారంభించానని, మేయర్గా విజయం సాధించాక ఆయన ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చినట్లు వెల్లడించారు.

సింహాద్రి అప్పన్న సేవలో శ్రావణి

సింహాద్రి అప్పన్నస్వామిని జీవీఎంసీ మేయర్ ఎన్నికైన ముక్కా శ్రావణి దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆండాళ్ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఏపీలో ఎబోలా వైరస్ భయాలు

భారత్‌లో ఎబోలా వైరస్ వ్యాప్తి భయాలు నెలకొంటున్నాయి. ఈ మేరకు కేంద్రం చేసిన హెచ్చరికలతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎబోలా వైరస్ రాష్ట్రంలోకి వ్యాప్తి చెందకుండా ఉండేందుకు విదేశాల నుంచి వాయు, సముద్ర మార్గాల్లో వచ్చే ప్రయాణికులపై ఫోకస్ పెట్టింది. వీరికి ఎయిర్ పోర్టుల్లో, సీ పోర్టుల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తోంది. వీటికి సంబంధించిన వివరాలను కేంద్రంతో తాజాగా రాష్ట్ర అధికారులు పంచుకున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎబోలా వైరస్ వ్యాప్తి నివారణకు రాష్ట్రంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ ఇవాళ వెల్లడించింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ కేంద్రాలు, పడకలు, వైద్య సిబ్బంది, అత్యవసర సామగ్రి, అనుమానిత కేసుల నిర్వహణకు తీసుకుంటున్న చర్యల్ని వివరించారు. ఇందులో భాగంగా తిరుపతి, భోగాపురం, విజయవాడ విమానాశ్రయాల్లో ఎబోలా అనుమానిత లక్షణాలున్న వారికి స్క్రీనింగ్ చేసేందుకు వైద్య సిబ్బందిని సిద్ధం చేశామని తెలిపారు. అలాగే విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు ఓడరేవుల్లోనూ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించామన్నారు. ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేశామని చెప్పారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ముప్పిడి

● బాధితుల యోగక్షేమాలపై ఆరా



కొవ్వూరు (చైతన్యరథం): తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామంలోని అల్లూరి సూరన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముసురు తుఫాను ప్రభావంతో బాధితులైన ప్రజల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న బాధితులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధితులకు ఈవెనింగ్ స్నాక్స్ అందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలోని కొత్త కాలనీలో ముసురు తుఫాన్ కారణంగా వరద ప్రభావానికి గురైన బాధితుల కోసం కాపవరం ఫాతిమున్నిసా బేగం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను ఎన్డీయే కూటమి నాయకులతో శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో బాధితులకు కల్పిస్తున్న వసతి, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకుని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

కొవ్వాడను ముంచేసిన వరద... రాకపోకలకు ఇబ్బంది



తాళ్లపూడి (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా కొవ్వాడలో వరద ముంచెత్తింది. దీంతో తాళ్లపూడి మండలంలోని ఊళ్లు, పంటలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గత రెండు రోజుల నుంచి ఏకధాటిగా వరద పోటెత్తడంతో తాళ్లపూడి మండలంలో వేలాది ఎకరాలు ముంపు బారిన పడ్డాయి. బయ్యవరం సమీపంలో కొండ దిగువన ఉన్న పంట పొలాల్లోకి నీరు చేరింది. రాగోలపల్లి, తుపాకులగూడెం, పోచవరం, తాడిపూడి, గజ్జరం, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట, పెద్దేవం, మలకపల్లి, వేగేశ్వరపురంలోని పంటచేలన్నీ వరద ముంపులోనే ఉన్నాయి. మరో పదిరోజుల్లో కోతకు వచ్చే వేలాది ఎకరాల్లో వరిపంట ముంపు బారిన పడిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వరద ఉద్ధృతితో మెరక భూముల్లోకి నీరు చేరుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీగా బురద వచ్చి చేరుతుండటంతో పంటలన్నీ కుళ్లిపోతాయని గగ్గోలు పెడుతున్నారు.భూమిని సాగుచేసే కౌలు రైతులు బోరున విలపిస్తున్నారు. వరి, అపరాలు, అరటి, కొబ్బరి, కోకో, చెరకు పంటలన్నీ ముంపులోనే ఉన్నాయి. పచ్చిక బయళ్లు సైతం ముంపు బారిన పడటంతో మేత కొరత ఏర్పడిందని రైతులు తెలిపారు. తాడిపూడి నుంచి పోచవరం, అన్నదేవరపేట నుంచి గోపాలపురం, తిరుగుడుమెట్ట నుంచి పెద్దేవం, మలకపల్లి నుంచి తిరుగుడుమెట్ట వెళ్లే మార్గాల్లో వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు సాగించేవారు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యాలు పెంచుకోవాలి

• జాతీయాస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు



రాజమహేంద్రవరం (చైతన్యరథం): జాంపేట ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్‌ను శుక్రవారం రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన విద్యార్థి ముప్పిడి ప్రసాద్ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే వాసు ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల నిర్వహించిన గోకవరం వార్షిక క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన ప్రసాద్, జిల్లా స్థాయిలోనూ తన సత్తా చాటి జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు, నగరానికి గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థి సాధించిన విజయాన్ని ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతో పాటు క్రీడా నైపుణ్యాలను కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధిస్తారని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు సీఎస్ఆర్ నిధుల ద్వారా అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వాసు తెలిపారు. విద్యార్థి ప్రసాద్ మరిన్ని విజయాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

వరద నీటిలో మృత్యువుతో పోరాడిన యువతి

● చెట్టుకొమ్మను పట్టుకుని వేళాడుతూ సాయం కోసం అభ్యర్థన... సహాయక సిబ్బందితో దక్కిన ప్రాణాం



కాలువ దాటే ప్రయత్నం ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిని అంచనా వేయలేక మేనమామ, మేనకోడలు ఒక్కసారిగా నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. అయితే మృత్యువుతో పోరాడిన యువతి అదృష్టవశాత్తూ చెట్టు కొమ్మను పట్టుకుని ప్రాణాలతో బయటపడింది. సహాయక సిబ్బంది ఆమెను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. కానీ ఆమెతో పాటు కొట్టుకుపోయిన మేనమామ మాత్రం ఇంకా ఆచూకీ లేకుండా పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల కొవ్వాడ పరిసర ప్రాంతాల్లో ఈ ప్రమాదం జరిగింది. మేనకోడలిని బస్సు ఎక్కించేందుకు దేవరపల్లి హైవే వద్దకు మేనమామ విజయ్ కుమార్ తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో ఉన్న కాలువ భారీ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. అయితే నీటి ప్రవాహాన్ని సరిగ్గా అంచనా వేయకుండా కాలువ దాటేందుకు ప్రయత్నించారు. అంతే.. ఒక్కసారిగా ఇద్దరూ వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. కటిక చీకటిలో వేగంగా ప్రవహిస్తున్న నీటిలో చిక్కుకున్న యువతి ప్రాణాలు కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. ఈ క్రమంలో అదృష్టవశాత్తూ ఆమెకు ఓ చెట్టు కొమ్మ తగలడంతో దానిని గట్టిగా పట్టుకుంది. దీంతో నీటి ప్రవాహంలో మరింత దూరం కొట్టుకుపోకుండా ఆగిపోయింది. ఈలోగా ఘటన గురించి తెలుసుకున్న అధికారులు, సహాయక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. వరద నీటిలో చిక్కుకున్న యువతిని ఎంతో జాగ్రత్తగా ఒడ్డుకు చేర్చి ప్రాణాలు కాపాడారు. అయితే ఆమెతో పాటు నీటిలో కొట్టుకుపోయిన మేనమామ విజయ్ కుమార్ ఆచూకీ మాత్రం ఇంకా లభించలేదు. ఆయన కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గోదావరి జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు, కాలువలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. సాధారణంగా కనిపించే కాలువలే అయినా భారీ వర్షాల సమయంలో వాటి ప్రవాహ వేగం ఊహించలేని విధంగా పెరుగుతుంది. దీంతో చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాల మీదకు తెస్తోంది. ఈ ఘటన మరోసారి వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల ఆవశ్యకతను గుర్తుచేస్తోంది.

నిరాధార ఆరోపణలు చేయడం తప్ప జగన్‌కు ఏం తెలుసు?

●ఐదేళ్లు లెక్కలేనన్ని పాపాలు చేసిన జగన్.. నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదం

● వ్యవస్థలపై నారాధార ఆరోపనలు చేయడమే జగన్ లక్ష్యం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మండిపాటు

చిలకలూరిపేట (చైతన్యరథం): "ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు, నాయకుల మధ్య పరస్పర విమర్శలు సహజమే. కానీ వాస్తవాల్ని పూర్తిగా వక్రీకరిస్తూ, తాను చెప్పే అబద్ధాలే ప్రజలు నమ్మాలనే భ్రమల్లో బతుకుతూ, పదేపదే ప్రభుత్వం.. వ్యవస్థలపై నిరాధార ఆరోపణలు చేయడమే లక్ష్యంగా జగన్.. వైసీపీనేతలు తమ నోళ్లకు పనిచెబుతున్నారు. ఐదేళ్లు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పూర్తిగా అపహాస్యం చేసిన జగన్. నేడు ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని గొంతు చించుకోవడం హాస్యాస్పదంగా ఉంది.

జగన్ పాలనలో ఓటర్ల చేతులపై రక్తపు మరకలు... కూటమి ప్రభుత్వంలో ఓటర్ల వేళ్లపై సిరా చుక్కలు

ముఖ్యమంత్రిగా ఐదేళ్లు ప్రజల్ని పీడించి, ఎన్నికల్ని అత్యంత హింసాత్మకంగా మార్చిన జగన్..ఒకసారి తన ఆటవిక పాలనను గుర్తు చేసుకోవాలి. 2024 సార్వత్రిక ఎన్నికలు, తాజా స్థానిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా, నిస్సంకోచంగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజా ప్రభుత్వంలో స్వేచ్ఛగా ఓటర్ల వేళ్లపై సిరా చుక్కలుంటే, జగన్ ప్రభుత్వంలో ఎన్నికల బరిలో నిలిచిన ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు, ఓటర్ల చేతులే రక్తపు మరకలతో తడిసిపోయాయి. జగన్ పాలనలో ఎన్నికలు అత్యంత పాశవికంగా, అప్రజాస్వామికంగా జరిగాయని చెప్పడానికి ఆనాడు వారి చేతులకు అంటిన రక్తపు మరకలే నిదర్శనం. ఐదేళ్లు లెక్కకుమిక్కిలి పాపాలు చేసిన వారు.. ఎన్నికల ప్రక్రియలో లోపాల గురించి మాట్లాడుతుంటే ప్రజలు అసహ్యించుకుంటున్నారు.



సీఎంగా ఏనాడైనా జగన్ విపత్తుల బాధితులకు అండగా నిలిచాడా? నేనున్నానని ధైర్యం చెప్పాడా?

తాను సీఎంగా ఉన్నప్పుడు తుఫాన్లు, విపత్తుల బారిన పడిన బాధితులకు జగన్ అండగా నిలిచాడా? నేనున్నాను మిమ్మల్ని ఆదుకుంటానని ఒక్కరికైనా ధైర్యం చెప్పాడా? మొక్కుబడిగా నలుగురైదుగురు అధికారులు, నాయకులతో తూతూమంత్రపు సమీక్షలు చేసి, తన అవినీతి మీడియాలో ఆకాశానికి ఎత్తించుకొని, ప్రజల్ని ఆదుకున్నట్టు ప్రచారం చేసుకున్న జగన్ మోసపూరిత పాలనను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. నేడు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా సమస్యల ముంగిటకు వెళ్లి, వాటిని ఎదుర్కొంటున్నవారితో మాట్లాడి, వారికి కొండంత అండగా నిలుస్తున్నారు.

'మురసు' నష్టనివారణ చర్యలు 90 శాతం పూర్తయ్యాయి. మిగిలినవి రేపటిలోగా పూర్తవుతాయి

మురసు ప్రభావంతో అస్తవ్యస్తమైన నియోజకవర్గంలో పరిస్థితులు క్రమక్రమంగా చక్కబడుతున్నాయి. శుక్రవారం సాయంత్రానికి నియోజకవర్గవ్యాప్తంగా 80శాతం వరకు విద్యుత్ పునరుద్ధరణ పూర్తయింది. మరికొన్ని చోట్ల బురదమేటలు, నేలకూలిన చెట్ల తొలగింపులో జాప్యంకారణంగా విద్యుత్ లైన్ల ఏర్పాటు వీలుకాలేదు. అలానే నీటమునిగిన పంటల్ని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది, నష్టం వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ యాప్‌లలో నమోదు చేస్తున్నారు. ఆ ప్రక్రియ పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టవచ్చు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజాజీవనం చాలావరకు మెరుగుపడింది. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు తగ్గకపోవడం, రోడ్లపై పేరుకున్న బురద తొలగింపు సాధ్యంకానందున 20శాతం వరకు పనులు పూర్తికాలేదు. మొత్తంగా పట్టణ పరిధిలో 80శాతం వరకు పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజ్‌ల్లోని చెత్త, పూడిక తొలగింపు, తాగునీటి సరఫరా మెరుగుపడింది, శనివారం నాటికి పూర్తిచేయాలని అన్ని శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ప్రత్తిపాటి పుల్లారావు వెల్లడించారు.

నేడు పరిషత్ తీర్పు... మధ్యాహ్నం 3 గంటలకు ఫలితాలు వెల్లడి

అమరావతి (చైతన్యరథం): పరిషత్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రంగం సిద్ధమైంది. ఎంపీటీసీ, జడ్పీటీసీల జాతకాలు వెల్లడించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. శనివారం ఉదయం 8గంటలకు లెక్కింపు ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 3 గంటల్లోగా ఎంపీటీసీ, రాత్రి 7 గంటలకల్లా జడ్పీటీసీ ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా. ఈ నెల 5న జరిగిన జిల్లా, మండల పరిషత్ ఎన్నికల్లో విజేతలెవరో ప్రకటించేందుకు ఎస్ఈసీ అన్ని ఏర్పాట్లు చేసింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఓట్లు లెక్కించేందుకు రంగం సిద్ధం చేసింది. ఏకగ్రీవాలు పోనూ 582 జట్పీడీసీలు, 7767 ఎంపీటీసీలకు ఎన్నికలు జరిగాయి. ఆయా జిల్లాల్లో ఉన్న స్థానాలను బట్టి 28 జిల్లాల పరిధిలో 365 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 9 వేలకుపైగా కౌంటింగ్ టేబుల్స్ సిద్ధం చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్సుల్ని ఉదయాన్నే కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తారు. తొలుత పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులు తెరుస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్లు వేరు చేసి ట్రేలలో వేస్తారు. ఆ తర్వాతే అసలు లెక్కింపు ప్రారంభం అవుతుంది. మధ్యాహ్నం 3 గంటలకల్లా ఎంపీటీసీ విజేతలెవరో తేలిపోయే అవకాశం ఉంది. ఎంపీటీసీ ఓట్లతో అనుసంధానం చేసి జడ్పీటీసీ ఫలితాలు ప్రకటించాల్సి ఉన్నందున ఆ ఫలితాలు రాత్రి 7 గంటల వరకూ పట్టే అవకాశం ఉందిని అనిల్‌చంద్ర పునేఠా వివరించారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

పదవిని బాధ్యతగా భావించండి... ఓటర్ల నమ్మకాన్ని నిలబెట్టుకోండి

●నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లకు అభినందనలు తెలిపిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందిస్తూ నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. బుధవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ను నూతనంగా ఎన్నికైన నియోజకవర్గ కార్పొరేటర్లు వచ్చి కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి కార్పొరేటర్లను గెలిపించారని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేయాలని సూచించారు. ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ కలిసికట్టుగా అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలో 400 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్పొరేటర్లు ముందంజలో ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎదురయ్యే ప్రతి సమస్యనూ ప్రభుత్వాధికారులు దృష్టికిగానీ, మా దృష్టికిగానీ వెంటనే తీసుకురావాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందేలా చూడాల్సిన బాధ్యత కార్పొరేటర్లదేనని స్పష్టం చేశారు. పదవి అనేది బాధ్యత మాత్రమేనని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ సారథ్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

గొంది నరేంద్ర మృతి టీడీపీకి తీరని లోటు: ప్రభుత్వ విప్ యార్లగడ్డ

●పార్టీ కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా వెనకడుగు వేయకుండా పనిచేసిన నిబద్ధత గల నాయకుడు నరేంద్ర



గన్నవరం (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, నిరంతరం కృషి చేసిన నిబద్ధత గల నాయకుడు గొంది నరేంద్రను కోల్పోవడం బాధాకరమని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విచారం వ్యక్తం చేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యుడైన గొంది నరేంద్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన గన్నవరం మండలం దావాజీగూడెంకు తరలించారు. శుక్రవారం ఉదయం నరేంద్ర భౌతికకాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పూలమాల వేసి, తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి తుది నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేంద్రతో తనకున్న అనుబంధాన్ని యార్లగడ్డ గుర్తు చేసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు నరేంద్రపై పలు అక్రమ కేసులు పెట్టి వేధించినప్పటికీ, పార్టీని వీడకుండా తన విజయానికి కృషి చేశారని తెలిపారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలను గుర్తించి కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించానన్నారు. పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం రోజున అనారోగ్యానికి గురై, 40 రోజులపాటు మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడవడం బాధాకరమన్నారు. నరేంద్ర అనారోగ్యానికి గురైన సమయంలో తాను కుటుంబసమేతంగా అహోబిలం పర్యటనలో ఉన్నానని యార్లగడ్డ తెలిపారు. శ్రీశైలంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం నరేంద్ర అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వెంటనే పర్యటనను రద్దు చేసుకుని విజయవాడకు చేరుకున్నానని, అక్కడి నుంచి మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరానని తెలిపారు. అయినప్పటికీ విధి వక్రించి నరేంద్రను దూరం చేయడం బాధాకరమన్నారు. గన్నవరం--దావాజీగూడెం రహదారి విస్తరణ సమయంలో నరేంద్ర స్థానికులతో మాట్లాడి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా చూశారని, రహదారి అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని యార్లగడ్డ పేర్కొన్నారు.

కూటమి ఐక్యతతోనే ప్రజా సంక్షేమం, సమగ్రాభివృద్ధి

●గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కూటమి కార్పొరేటర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి ఐక్యతే ప్రజా సంక్షేమానికి బలమైన పునాది అని, చిన్నపాటి అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ కుటుంబంలో సమస్యలను పరిష్కరించుకున్నట్లే మన ముగ్గురం సమన్వయంతో సాగాలని, నాలుగో వ్యక్తికి అధికారాన్ని అప్పగించే అవకాశం ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యురాలు గళ్ళా మాధవి స్పష్టం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధ్యక్షతన నియోజకవర్గ ఎన్డీయే కూటమి కార్పొరేటర్లు, అభ్యర్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ విచ్చేశారు. కార్పొరేషన్ చైర్మన్లు డేగల ప్రభాకర్, మల్లె ఈశ్వర్ రావు, బుచ్చి రామ్ ప్రసాద్, మద్దిరాల మ్యానీ, తాళ్ళ వెంకటేష్ యాదవ్, కనపర్తి శ్రీనివాసరావు, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు, కోవెలమూడి రవీంద్ర, జనసేన పార్లమెంటరీ సమన్వయకర్త కిలారి రోశయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, నారాయణ రెడ్డి, అబ్బూరి నాగ మల్లేశ్వరరావు,మానుకొండ శివ ప్రసాద్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గత 2024 ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు, కూటమి శ్రేణులు తనకు 50 వేల భారీ మెజారిటీని అందించి గెలిపించారని, అదే బాధ్యతతో, పార్టీ నాయకులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణని కూడా నియోజకవర్గం నుంచి 50 వేలకు పైగా మెజారిటీతో నిలబెట్టామని, నమ్మిన నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలబడటమే మన రాజకీయ విధానం కావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో ప్రతి అభ్యర్థి విజయం వెనుక నిస్వార్థంగా శ్రమించిన ప్రతి ఒక్క నాయకుడిని, కార్యకర్తను, కుటుంబాన్ని ఏమాత్రం విస్మరించకూడదని, అందరినీ కలుపుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు విజనరీ నాయకత్వంలో ముందుకు సాగుతున్నామని చెబుతూ, కార్పొరేటర్లందరూ తమ డివిజన్లలో ప్రత్యేక ముద్ర వేసి ఆదర్శ నాయకులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజల అవసరాలు, డివిజన్ల అభివృద్ధి ప్రణాళికలను మేయర్ దృష్టికి తీసుకెళ్లి, కౌన్సిల్ ఆమోదంతో పాటు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అభివృద్ధిని ప్రత్యక్షంగా చూపించాలని స్పష్టం చేశారు. అలాగే మహిళా శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ నియోజకవర్గంలో మహిళా ప్రజాప్రతినిధులు ఆదర్శవంతంగా పనిచేస్తూ నగరవ్యాప్తంగా ప్రగతి పథంలో మార్పును చాటాలని, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణలా ప్రజాసేవను బాధ్యతగా భావిస్తూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు

● అతి స్వల్ప ఓట్లతో ఓటమి చెందిన పానుగుపాటి విజయలక్ష్మికి తగిన గుర్తింపు కల్పిస్తాం : పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): ఇటీవల జరిగిన విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో భవానిపురం 34వ డివిజన్ నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన పానుగుపాటి విజయలక్ష్మి అతి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన ఆ డివిజన్‌కి విజయలక్ష్మి కార్పొరేటర్ అని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న అన్నారు. "ఎన్నికల్లో గెలుపోటములు సహజం. అతి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందినంత మాత్రాన ప్రజల కోసం పనిచేయాలనే సంకల్పాన్ని వదులుకోకూడదు. ఎన్నికల్లో వచ్చిన ఫలితాన్ని ఒక అనుభవంగా తీసుకొని, ఓటమికి గల కారణాలు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలు, ఎన్నికల సమయంలో ఎదురైన ఇబ్బందులు అన్నింటినీ సమగ్రంగా విశ్లేషించుకోవాలి. పానుగుపాటి విజయలక్ష్మి ఎన్నికల్లో చేసిన కృషిని, ప్రజల్లో ఆమెకు ఉన్న గుర్తింపును, అతి స్వల్ప ఓట్ల తేడాతో వచ్చిన ఫలితాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి, కూటమి ప్రభుత్వం తరఫున ఆమెకు తగిన గుర్తింపు కల్పించే విధంగా నా వంతు కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను. పదవులు ఉన్నప్పుడే ప్రజలకు సేవ చేయాలని కాదు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలి. 34వ డివిజన్‌లో ప్రతి వీధిలో పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలి. ఎన్నికల్లో మనకు వచ్చిన ఫలితాన్ని సమీక్షించుకొని, ఎక్కడ లోపాలు జరిగాయి, ప్రజలకు మరింత చేరువ కావడానికి ఏమి చేయాలి అనే అంశాలపై దృష్టి పెట్టాలి. ప్రజల నమ్మకాన్ని సంపాదించుకోవడానికి నిరంతరం కష్టపడాలి. ప్రజా సేవకు ఎన్నికల ఫలితాలు అడ్డంకి కాకూడదు. ప్రజల మధ్య ఉంటూ, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలి. పానుగుపాటి విజయలక్ష్మి అధైర్యపడకుండా మరింత పట్టుదలతో ప్రజా సేవలో కొనసాగాలి. ఆమెకు పార్టీ అండగా ఉంటుంది." అని బుద్ధా వెంకన్న స్పష్టం చేశారు. ప్రజల కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తగిన గుర్తింపు వచ్చేలా నా వంతు కృషి చేస్తాను. భవానిపురం 34వ డివిజన్ అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం మనమందరం కలిసికట్టుగా పనిచేద్దాం. 34 వ డివిజన్ అధ్యక్షునిగా పి.చిన్న సుబ్బయ్య అని బుద్ధా వెంకన్న తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బోబ్బూరి నారాయణ స్వామి, రమణయ్య, కునుకు నాగేశ్వరావు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గెలిచిన కౌన్సిలర్లు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి : వై.వీ.బీ రాజేంద్రప్రసాద్



ఉయ్యూరు (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కౌన్సిలర్లు చలమల శెట్టి రమణ, నెరుసు బాలకృష్ణ, మోట నాగేంద్ర, చింతయ్య, కొలగాని సునీత మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్‌ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌ని, మాజీ సర్పంచ్ యలమంచిలి భ్రమరాంబని వారు ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్లను అభినందించిన రాజేంద్ర ప్రసాద్‌వారికి శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఎన్నికల్లో విజయం సాధించడం ఒక బాధ్యతకు ఆరంభమని, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, ఈ విజయాన్ని ఉయ్యూరు ప్రజలకే అంకితం చేస్తున్నానని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. "ఉయ్యూరు పట్టణ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలి. అనుక్షణం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలి. పదవిని ప్రజాసేవకు ఉపయోగించుకుని మంచి పేరు తెచ్చుకోవాలి" అని కౌన్సిలర్లకు ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్ ఉద్బోధించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ... "తమ గెలుపు కోసం ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, వారి సతీమణి మాజీ సర్పంచ్ యలమంచిలి బ్రమరాంబ చేసిన కృషి, అందించిన ప్రోత్సాహం మరువలేనిదని అన్నారు. ఎన్నికల సమయంలో రాజేంద్రప్రసాద్ అందించిన మార్గదర్శకత్వం, కార్యకర్తలకు ఇచ్చిన భరోసా తమ విజయానికి ఎంతో దోహదపడిందని " గెలిచిన కౌన్సిలర్లు కొనియాడారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, ఉయ్యూరు మున్సిపాలిటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని కౌన్సిలర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ భ్రమరాంబ, జంపన శ్రీనివాస్, కౌన్సిలర్లు నేరుసు బాలకృష్ణ, మోటురు నాగేంద్ర, చింతయ్య, చలమలశెట్టి వెంకటరమణ, కోలగానీ సునీత, కొలగాని సాంబశివరావు, బాణావత్ రవి దాసు శ్రీనివాసరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యవస్థ గురించి

మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఎద్దేవా



నెల్లూరు, (చైతన్యరథం): నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో శాసనమండలి సభ్యులు, జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, పిల్ రావు, మనుబోలు శ్రీధర్ రెడ్డి, మాతంగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీద మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నుండి ఎలాగైనా తప్పించుకోవాలని జగన్ నుండి వైసీపీ కార్యకర్త స్థాయి వరకు కోరుకున్నారని విమర్శించారు. మోసపూరితంగా రిజర్వేషన్ వివాదంను వైసీపీ నేతలు సృష్టించారు, న్యాయస్థానాల్లో పిటిషన్లు వేసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నారన్నారు. సర్ ఓటర్ లిస్టు ద్వారా లక్షలాదిమంది వైసీపీ అభిమానుల ఓట్లు తొలగిస్తున్నారని తమకు పాత ఓటర్ లిస్టుతోనే ఎన్నికలు జరపాలని ఆందోళనలు చేశారని గుర్తు చేశారు. ఎన్నికలను ఏ ఓటర్ లిస్టు ప్రకారం నిర్వహించాలో నిర్ణయించేది ఎన్నికల సంఘమే తప్ప కూటమి పార్టీలు కాదన్న సంగతి వైస్సార్సీపీ నేతలకు తెలియకపోవడం విచారకరమని ఎద్దేవా చేశారు. కొత్త ఓటర్ లిస్టు(సర్) వచ్చేందుకు ఆలస్యం కానుండడం, అప్పటివరకు ఎన్నికలు నిర్వహించకపోవడం ద్వారా మున్సిపాలిటీలు, పంచాయతీ, మండల, జడ్పీలు కేంద్ర నిధులు కోల్పోయే ప్రమాదంను ప్రభుత్వం గుర్తించిందని వివరించారు. ఏ ఓటర్ లిస్టు ప్రకారం ఎన్నికలను జరుపగలరో నిర్ణయం తీసుకోవాలని ఏ లిస్టు ప్రకారమైనా తాము సిద్ధంగా ఉన్నామని ఎన్నికల సంఘానికి కూటమి ప్రభుత్వం తెలియజేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల గురించి, ఎన్నికల వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికలను తాను ఎలా నిర్వహించారో జగన్ ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. నాటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌ను కమ్మవాడని జగన్ అవమానించారని గుర్తు చేశారు. అధికారులను కులాలతో ముడిపెట్టి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల మీద వైసీపీ నేతలు సుప్రీంకి వెళ్లారని ఎన్నిసార్లు డేటు మార్చినా ప్రజా అభిప్రాయాన్ని మార్చలేకపోయారని పేర్కొన్నారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయాన్ని చూసి ఈవీఎమ్ లతో గెలిచామన్నారు, నేడు బ్యాలెట్ పేపర్లతో కూడా 2024కు మించి ఘన విజయం సాధించామన్నారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను కనీసం నామినేషన్లు వేయనివ్వలేదన్నారు. టీడీపీ గెలిచిన స్థానాలను ప్రకటించనివ్వలేదన్నారు. నేటి స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ నేతలు దూరంగా పారిపోయారు. కొందరు తప్పులు తడకలుగా నామినేషన్లు వేసి ఎన్నికల నుంచి తప్పించుకోవడంతో పాటు కూటమి పార్టీల నేతలపై బురద చల్లుతున్నారన్నారు.

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం పెట్టుబడులు, ఉద్యోగ కల్పన కోసం ప్రతి రంగాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నారా చంద్రబాబునాయుడు, ప్రధాని నరేంద్ర మోడీ, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ కృషి చేస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రజలు కూటమి పాలనను కోరుకుంటున్నారు, కూటమి పాలనతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి ఓటు రూపంలో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేశారు, వైసీపీ నేతలు ఇప్పటికైనా నాటకాలు కట్టి పెట్టాలని హితవు పలికారు.

జగన్ ఓటే వేయలేదు...

కూటమిని నమ్మి ప్రజలు ఓటేశారు!

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఎమ్మెల్సీ, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతగా చెప్పుకునే ప్రతిపక్ష హోదాలేని వైసీపీ అధ్యక్షుడు జగన్.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేయలేదన్నారు. పోటీచేసే సత్తాలేక.. వైసీపీ నేతలు తప్పులతో నామినేషన్లు వేశారని విమర్శించారు. దమ్ము, ధైర్యం లేక పారిపోయి తమపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కూటమి పార్టీలతోనే అభివృద్ధి, సంక్షేమమని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. అందుకే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కూటమి పార్టీల నేతలకు ప్రజలు మద్దతు ఇస్తున్నారని చెప్పారు. మున్సిపాల్టీల కంటే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఫలితాలు సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఒన్ మినిట్ వీడియోలతో సోషల్ మీడియాలో విషప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ మండిపడ్డారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మంత్రి నారాయణపై లేనిపోని విమర్శలు చేశారని... ఆయా డివిజన్లలో ఎవరు గెలిచారని ప్రశ్నించారు. 'పెట్రోల్ బాంబులు ఎవరు వేశారు. కత్తులతో తరిమింది ఎవరు' అంటూ నిలదీశారు. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి స్వయంగా కారుతో టీడీపీ కార్యకర్తలని చంపేయబోయారని... ఆ సమయంలో ఎదురు తిరగరా అంటూ నిలదీశారు. వైసీపీ చెప్పే అబద్ధాలను ప్రజలు ఎవరూ నమ్మలేదని.. కూటమి నేతల నాయకత్వాన్ని నమ్మారని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు.

ఓటర్ల అభిమానానికి కృతజ్ఞతలు : సుగవాసి



రాయచోటి (చైతన్యరథం): గాలివీడు మండల జడ్పీటీసీ ఎన్నికల్లో అమూల్యమైన మద్దతును, అభిమానాన్ని, ప్రోత్సాహాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని టీడీపీ అభ్యర్థి సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. తనపై చూపించిన ఆదరణ, తనపై ఉంచిన నమ్మకం, అందించిన ప్రేమాభిమానాలు, ఇవన్నీ తన జీవితంలో ఎంతో విలువైనన్నారు. ఎన్నికల ఫలితం ఏదైనా... మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, మీ ఆశయాలకు, ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తానని హృదయపూర్వకంగా తెలియజేస్తున్నానన్నారు.

హైకోర్టులో షాక్‌తో చెవిరెడ్డి గూబ పగిలింది!

తిరుపతి (చైతన్యరథం): వైసీపీ నేత చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, మరో ఇద్దరికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో షాక్ తగిలింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తిరుపతి రూరల్‌లోని చంద్రగిరి, పాకాల మండల పరిధిలోని పలు వార్డుల్లో రీ పోలింగ్ నిర్వహించాలని, ఓట్ల లెక్కింపు ప్రక్రియను వాయిదా వేయాలని న్యాయస్థానంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. తిరుపతి రూరల్, చంద్రగిరి, పాకాల మండలాల్లో పోలింగ్‌లో అక్రమాలు జరిగినట్లు కలెక్టర్ నుంచి నివేదిక రాలేదని ఎన్నికల కమిషన్ తరుపున న్యాయవాది అశ్వని కుమార్ న్యాయస్థానానికి వివరించారు. ఇలాంటప్పుడు అక్కడ రీ పోలింగ్‌కు ఆదేశాలు ఇవ్వలేమని అశ్వని కుమార్ పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం రీ పోలింగ్‌కు ఆదేశించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. కౌంటింగ్ ప్రక్రియను కూడా నిలువరించలేమని న్యాయస్థానం తేల్చిచెప్పింది.





ఇది నమ్మకంతో ప్రజలు అందించిన చారిత్రక విజయం

ఎన్నికల ఫలితాలపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి విశ్లేషణ

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నగర మేయర్ రూప్ కుమార్ యాదవ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి పార్టీలు చారిత్రాత్మక విజయం సాధించాయని నెల్లూరు రూరల్లో 36 డివిజన్లో కుడా వైసిపీ బోణి కొట్టలేదని ఎద్దేవా చేశారు. ఈ విజయంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకం నిజమయిందన్నారు. రికార్డ్ మెజార్టీతో మేయర్ అభ్యర్థిని ప్రజలు గెలిపించారని అన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ విజయాన్ని ఎక్కడా దుర్వినియోగం చేసే పరిస్థితి తలెత్తదన్నారు. రాజకీయాలు ఎన్నికలప్పుడు మాత్రమే.. ఇక అందరినీ కలుపుకొని పోతామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. రూ. 966 కోట్ల నిధులతో రూరల్లో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఆశీర్వదించారు. వైసిపీ మేయర్ అభ్యర్థి అనం విజయకుమార్ రెడ్డి సొంత డివిజన్ కుడా గెలవలేకపోవడం ప్రజల్లో వారి పట్ల ఉన్న వ్యతిరేకత స్పష్టం అయ్యిందన్నారు. మేము దౌర్జన్యాలు చేసుంటే అనంతపురం, నాయుడుపేటలలో ఎందుకు ఓడిపోతాం. వైసిపీ నాయకులు వాళ్ల మేయర్ అభ్యర్థి విజయకుమార్ రెడ్డిని చూసి నేర్చుకోవాలన్నారు. ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత అధికారుల పని, ప్రజల తీర్పును గౌరవించారన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తి ఎన్నికలు జరిగిన తీరును అభినందిస్తుంటే ఓడిపోయిన వారు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపీ నాయకులందరు వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో సహా విజయకుమార్ రెడ్డి దగ్గర రాజకీయ పాఠాలు నేర్చుకోవాలన్నారు. కూటమి మేయర్ అభ్యర్థిగా నాకు అఖండ మెజార్టీ ఇచ్చిన ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహాయ సహకారాలు,అభివృద్ధి, మంచి పనులే తమ విజయానికి కారణమని, మా మీద ఉంచిన నమ్మకాన్ని ఖచ్చితంగా నిలబెట్టుకుంటానని నగర మేయర్ రూప్ కుమార్ యాదవ్ వెల్లడించారు.

బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించిన మంత్రి సవిత



పెనుకొండ (చైతన్యరథం): అనంతపురం జిల్లా రాప్తాడు జడ్పీ హైస్కూల్ లో పదో తరగతి చదువుతున్న బాలికపై ఉన్మాది జరిపిన దాడి ఘటన అత్యంత బాధాకరమని మంత్రి సవిత అన్నారు.

బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని మంత్రి సవిత శుక్రవారం పరామర్శించి, వైద్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాలికకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ బాలికకు నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైందని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం మెరుగుపడుతోందని వైద్యులు తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. విద్యార్థిని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంత్రి నారా లోకేశ్ ఈ ఘటనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, బాలిక వైద్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున డాక్టర్ గంగాధర్ రెడ్డి బాలిక ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. మహిళలు, బాలికలపై దాడులకు పాల్పడితే ప్రభుత్వం ఉపేక్షించబోదని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, యువత తమ భవిష్యత్తు నాశనం చేసే గంజాయి ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

కొలిమిగుండ్లలో కలకలం రేపిన కొండచిలువ

కొలిమిగుండ్ల (చైతన్యరథం): మండలంలోని బెలుం శింగవరం గ్రామంలో కొండచిలువ కలకలం రేపింది. బుధవారం ఉదయం గ్రామ వెలుపల ఉన్న పేరం మోహన్‌రెడ్డి ఇంటి ఆవరణలోకి వచ్చిన కొండచిలువ కోళ్లపై దాడి చేసింది. దీంతో కోళ్లు పెద్ద ఎత్తున అరుస్తూ పరుగులు తీశాయి. అప్పటికే ఏడు కోళను కొండచిలువ తిన్నట్లు ఇంటి యజమాని వాపోయాడు. కోళ్లను తిన్నాక కొండ చిలువ మత్తుగా అక్కడే పడిపోయింది. గ్రామస్థులు ఆటవీశాఖ అధికారులకు ఈ విషయం తెలయజేయడంతో వారు కొండచిలువను తీసుకవెళ్లి ఆడవిలో వదిలిపెట్టారు.

బామ్మలమే... ఎగరేశాం ఓటు బావుటా!

అనంతపురం జిల్లాలో వందేళ్లు నిండిన ఇద్దరు బామ్మలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చాలా మంది పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేసేందుకు. నిర్లక్ష్యం వహిస్తారు. మంచి పాలకులను ఎన్నుకునేందుకు ఓటు వేసినట్లు తాడిపత్రి గ్రామీణ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన దస్తగిరమ్మ చెబుతున్నారు. నడిచే ఓపిక లేకున్నా ఎలాగైనా ఓటు వేయాలని వస్తుండగా.. మాజీ సర్పంచి చింబిలి వెంకటరమణ గమనించి ఆమెను కొంత దూరం చెయ్యి పట్టి నడిపించారు. ఆతర్వాత తన అనుచరుల ద్వారా ద్విచక్ర వాహనంలో పోలింగ్ బూత్కు తీసుకెళ్లి వదిలారు. వృద్ధురాలు కేంద్రంలోకి వెళ్లి ఓటు వేశారు. ఉరవకొండ మండలం ఇంద్రావతిలో 105 ఏళ్ల వయస్సున్న కురుబ జయమ్మను కుటుంబ సభ్యులు పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చి ఓటు వేయించారు.







చిప్పగిరిలో తప్ప పోలింగ్ ప్రశాంతం

కర్నూలు (చైతన్యరథం): జిల్లాలో గ్రామీణ ఓటర్లు పోలింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఓటేసేందుకు మేము సైతం అంటూ వృద్ధుల నుంచి యువత వరకు కదిలొచ్చారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద జనం బారులు దీరారు. ఏ పల్లెకు వెళ్లినా.. ఏ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించినా.. ఎవరిని కదిపినా ఒకటే మాట ఓటేయడం మన బాధ్యత. పల్లె ప్రగతిపై ఓటర్లు తమ ఆకాంక్షను చాటారు. పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఓటేసేందుకు జనం పోటెత్తారు. వృద్ధులు, మహిళలు, గర్భిణులు, పసిపిల్లల తల్లులు, దివ్యాంగులు, యువత సైతం ఓటేసేందుకు తరలిరావడం స్ఫూర్తిదాయకం. ఓటరన్న తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. ఫలితాలు ఎలా ఉంటాయో? అభ్యర్థులు, రాజకీయ నాయకుల్లో ఉత్కంఠ మొదలైంది. పరిషత్ ఎన్నికల్లో భాగంగా ఓటేసేందుకు ప్రజలు పోటెత్తారు. ఎండలు పెరిగినా ఓటర్లలో ఉత్సాహం తగ్గలేదు. మధ్యాహ్నం కాస్త తగ్గినా ఉదయం, సాయంత్రం భారీగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటేశారు. ఒకటి రెండు చిన్నపాటి సంఘటనలు మినహా కందనవోలు ముంగిట పరిషత్ పోరు ప్రశాంతంగా ముగిసింది. అధికార యంత్రాం గం, రాజకీయ వర్గాలు ఊపిరి పీల్చుకు న్నాయి. సాయంత్రం 5గంటల తరువాత కూడా పలు గ్రామాల్లో వరుసల్లో నిలబడటం కొసమెరుపు. జిల్లా వ్యాప్తంగా 8,82,335 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించు కున్నారు. జిల్లా వ్యాప్తంగా 68.23 శాతం పోలింగ్ నమోదైంది. ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో వలస వెళ్లిన ఓటర్లు గ్రామాలకు చేరుకొని ఓటేశారు.

పరిషత్ పోరు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, అభ్యర్థులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం కౌంటింగ్ నిర్వహించనున్నారు. జిల్లాలో 26 జడ్పీటీసీలు ఉన్నాయి. 26జడ్పీటీసీ స్థానాలకు 97 అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి 26, ప్రతిపక్ష వైసీపీ 26 సహా సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ వివిధ పార్టీలు, స్వతంత్రులు 45 మంది బరిలో ఉన్నారు. 26 మండల పరిషత్తుల్లో 432 ఎంపీటీసీ స్థానాలున్నాయి. వాటిలో 73 ఎంపీటీసీ స్థానా లు ఏకగ్రీవం కాగా 359 స్థానాలకు 1,002 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నిక కోసం గురువారం పోలింగ్ జరిగింది. 12,50,166 మంది ఓటర్లు తమ ఓటు వినియోగించు కోవడానికి వీలుగా 1,432 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆర్వోలు, పీవో, ఏపీవో, ఓపీవోలు సహా వివిధ స్థాయిల్లో 8,287 మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొన్నారు. ఉదయం ఏడు గంటలకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు ఏ.సిరి పర్య వేక్షణలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకో వడానికి వీలుగా బారికేడ్లు, షామియాలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించారు. ఉదయం తొమ్మిది గంటలకు రెండు గంటల్లోనే 11.25 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తరువాత క్రమంగా పుంజుకొని 11గంటలకు 29.31 శాతం, మధ్యాహ్నం 1 గంటకు 48.95 శాతం, మూడు గంటలకు 62.34 శాతం ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటేశారు. పోలింగ్ ముగిసే సమయానికి 68.23 శాతం అంటే 8.82లక్షల ఓటర్లు తమ ఓటు వేశారు. ఇది పల్లె ఓటర్లలో చైతన్యానికి నిదర్శమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. సగటున 55.28 శాతం ఓటర్లే ఓటేశారు. అందులో సామాన్య జనం నివాసముండే కాలనీల్లో ఓటర్లు పోటెత్తితే.. విద్యావంతులు, మేధావులు, ఉద్యోగులు ఉండే కాలనీల్లో 40-45 శాతానికి పోలింగ్ మించలేదు. అదే గ్రామాల్లో ఓటే నా లక్ష్యం అంటూ వయస్సుతో నిమిత్తం లేకుండా కుటుంబ సభ్యులతో వృద్ధులు, చిన్నారులను ఎత్తుకొని తల్లులు, యువత, రైతులు, కూలీలు, మహిళలు అన్నివర్గాల ఓటర్లు తమ పనులను పక్కన పెట్టి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. చిప్పగిరి మండలం గుమ్మనూరులో వైసీపీ వర్గీయులు, కూటమి బీజేపీ నేత, గుంతకల్లు ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది.



వైసీపీ కవ్వింపు చేష్టలను కాదని

ఓటెత్తిన మహిళలు

పుట్టపర్తి (చైతన్యరథం): జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చేపట్టిన ముందస్తు చర్యలు ఫలించాయి. సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, పోలీసు బందోబస్తు, పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర పర్యవేక్షణ, సిబ్బంది సమన్వయంతో ఎక్కడా ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తలేదు. జిల్లాలోని 32 మండలాల పరిధిలో జడ్పీటీసీ, 377 ఎంపీటీసీ స్థానాలకు గురువారం నిర్వహించిన ఎన్నికల్లో 73.72 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. పలుచోట్ల క్యూలైన్లలో గంటల కొద్దీ నిలబడాల్సి వచ్చింది. కొన్ని మండలాల పరిధిలో ఒకే చోట నాలుగైదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో మహిళలు, వృద్ధులు కొంత ఇబ్బందులకు గురయ్యారు.జిల్లాలో మొత్తం గ్రామీణ ఓటర్లు 11,35,917 మంది ఉండగా వారిలో 8,37,406 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మరో 2,98,511 మంది పోలింగ్కు దూరంగా ఉన్నారు. పెనుకొండలో అత్యధికంగా 80.87 శాతం నమోదైంది. ఇక్కడ 29,256 మంది ఓటర్లకు 18,808 మంది ఓటేశారు. పుట్టపర్తి 79.81 శాతం, రోళ్లలో 79.21శాతం, నల్లచెరువులో 79.09 శాతం, అగళిలో 78.91 శాతం పోలింగ్ నమోదైంది. మడకశిరలో 78.71 శాతం ఓటింగ్ జరిగింది. మరోవైపు ముదిగుబ్బలో అత్యల్పంగా 66.61 శాతం, తనకల్లులో 67.81, రామగిరిలో 68.35 శాతం నమోదైంది. పరిషత్ ఎన్నికల వేళ పలుచోట్ల వైకాపా నాయకుల దౌర్జన్యాలు, ప్రలోభాల పర్వాలు కొనసాగాయి. ఓటర్లను ప్రభావితం చేసేందుకు గోరంట్లలో తాయిలాలు పంపిణీ చేయడంతోపాటు విందులు ఏర్పాటు చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ వారించిన కూటమి నాయకులపై దాడులకు యత్నించారు.గోరంట్ల మండలం మలసముద్రం ఎంపీటీసీ ఎన్నికల్లో వైకాపా నాయకులు వల్ల ఓటర్లకు ఓ ఇంట్లో భోజన వసతి ఏర్పాటు చేయడంతోపాటు డబ్బులు పంచారు. ఈ సమాచారం అందుకున్న సీఐ శేఖర్ అక్కడికి చేరుకున్నారు. అయితే అప్పటికేఅప్రమత్తమైన కొందరు నాయకులు అక్కడి నుంచి జారుకున్నారు. మిగిలినకొంతమంది సీఐతో వాగ్వాదానికి దిగారు. ఇంతలో అక్కడకు మాజీ మంత్రి ఉషశ్రీచేరుకుని సీఐపై చిందులు తొక్కారు. అక్కడే వీధిలో నేలపై కూర్చుని సీఐ డౌన్డౌన్అంటూ నినాదాలు చేశారు.



ఇమ్మిగ్రేషన్ విధానంలో కెనడా కీలక మార్పులు

- 2027 నాటికి 6.22 లక్షల మందికి పైగా కొత్త శాశ్వత నివాస హోదా
- ఇప్పటికే దేశంలో ఉన్న తాత్కాలిక నివాసితులకే తొలి ప్రాధాన్యం
- జనాభా స్థిరీకరణ, ఆర్థిక పరిపుష్టే లక్ష్యంగా నిర్ణయాలు



ఒట్టావా: అంతర్జాతీయ వలసదారుల ప్రధాన గమ్యస్థానమైన కెనడా తన ఇమ్మిగ్రేషన్ విధానంలో కీలక మార్పులు చేపట్టింది. దేశంలో జనాభా వృద్ధిని స్థిరీకరించడం, ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడం, ఇప్పటికే దేశంలో నివసిస్తున్న తాత్కాలిక నివాసితులకు పెద్దపీట వేయడమే లక్ష్యంగా కొత్త నిర్ణయాలు తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కెనడా ఫెడరల్ బడ్జెట్, సరికొత్త ఇమ్మిగ్రేషన్ లెవెల్స్ ప్లాన్ ప్రకారం 2027 నాటికి వివిధ విభాగాల ద్వారా దాదాపు 6,22,000 మందికి పైగా కొత్తగా శాశ్వత నివాస హోదా (పర్మనెంట్ రెసిడెన్సీ) కల్పించనున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

విభాగాల వారీగా పీఆర్ కేటాయింపులు: ఫెడరల్ ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం 2027 నాటికి వివిధ నివాస విభాగాల వారీగా లక్ష్యాలను వ్యూహాత్మకంగా విభజించారు.

ఆర్థిక విభాగం (ఎకనామిక్ కేటగిరీ): దేశ ఆర్థిక, పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యధికంగా 2,44,700 మందికి స్థానం కల్పించారు. ఇందులో నైపుణ్యం కలిగిన నిపుణులు, ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ, ప్రావిన్షియల్ నామినీ ప్రోగ్రామ్‌ల (పీఎన్‌పీ) అభ్యర్థులకు ప్రాధాన్యత దక్కనుంది.

కుటుంబ పునరేకీకరణ (ఫ్యామిలీ కేటగిరీ): కుటుంబాల మధ్య అనుబంధాన్ని, బంధువుల కలయికను ప్రోత్సహిస్తూ సుమారు 81వేల మందికి అవకాశం కల్పిస్తున్నారు.

శరణార్థులు-మానవతా సాయం: అంతర్జాతీయ బాధ్యతల్లో భాగంగా శరణార్థులు, రక్షణ పొందిన వ్యక్తుల కోటా కింద 49,300 మందిని, మానవతా దృక్పథం ఆధారంగా మరో 5వేల మందిని శాశ్వత నివాసితులుగా అంగీకరించనున్నారు.

స్థిరమైన లక్ష్యాలు: ఇది కాకుండా 2027-29 కాలానికి సంబంధించి ఏటా స్థిరంగా 3.80 లక్షల మందికి కొత్త శాశ్వత నివాస లక్ష్యాలను నిర్దేశించినట్టు కెనడా ప్రభుత్వం స్పష్టం చేసింది.

తాత్కాలిక నివాసితులకు పెద్ద ఊరట: తాజా ఇమ్మిగ్రేషన్ ప్రణాళికలో అత్యంత ప్రధానమైన అంశం.. ఇప్పటికే కెనడాలో తాత్కాలిక నివాసితులుగా ఉంటున్న వారికి ఊరటనివ్వడమే. దేశంలో నివసిస్తున్న సుమారు 2 లక్షల మంది తాత్కాలిక నివాసితులు 2027 చివరి నాటికి శాశ్వత నివాస హోదా పొందేందుకు ఒక ప్రత్యేక 'వన్ టైమ్' మార్గాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో దాదాపు లక్ష మంది ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ లేదా పీఎన్‌పీ కింద అర్హత సాధించిన వారికి అవకాశం కల్పించనున్నారు. దీనివల్ల కొత్తగా విదేశాల నుంచి వచ్చే వారిపై భారం తగ్గడంతో పాటు స్థానికంగా ఉన్న నైపుణ్య వలసదారులకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు వివరించారు.



ఆనాటి ఆ స్నేహ ఆనందగీతం...

లాస్‌వెగాస్‌లో ఎస్‌జేఎంఈటీ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

లాస్‌వెగాస్: కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గలోని ఎస్‌జేఎంఈటీ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అమెరికాలోని లాస్‌వెగాస్ నగరంలో ఆనందోత్సాహాల నడుమ అత్యంత ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనంలో కళాశాలతో అనుబంధం ఉన్న సుమారు 200 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని తమ కళాశాల రోజుల్లోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 1980లో ప్రారంభమైన ఎస్‌జేఎంఈటీ కళాశాలలో తమకు బోధించిన గురువులు, స్నేహితులు, కళాశాలలో గడిపిన మరపురాని క్షణాలను వారు గుర్తు చేసుకున్నారు. వృత్తి, కుటుంబ జీవితం, ఉద్యోగ విరమణ, భవిష్యత్ ప్రణాళికలు తదితర అంశాలపై వారు ఆత్మీయంగా ముచ్చటించారు. ఎన్ని ఏళ్లు గడిచినా తమ మధ్య స్నేహ బంధం, అనుబంధం చెక్కుచెదరలేదని ఈ సమ్మేళనం మరోసారి చాటిచెప్పింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన శ్రీధర్ గోనుగుంట్ల, శ్రీనివాస్ గొండి, వెంకట్ మలపాటి, భక్త బల్లా, మాదల శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, పాపిరెడ్డి, శరత్‌పున్ రెడ్డి, వంశీ గరికపాటి, శ్రీనివాస్ రెడ్డి ఎర్ర, చంద్ర రాగ్యరి, కృష్ణ పూర్రులకు పూర్వ విద్యార్థులందరూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాహకుల సమష్టి కృషి, చక్కటి సమన్వయం, ఆత్మీయ ఆతిథ్యం ఈ సమ్మేళనాన్ని చిరస్మరణీయంగా నిలిపాయి. ఈ ఆత్మీయ కలయికకు చొరవ తీసుకున్న వెనిగళ్ల రవికుమార్ కృషిని పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆకాంక్షిస్తూ, 2028లో మరోసారి కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. మధుర జ్ఞాపకాలను హృదయాల్లో పదిలపరుచుకుని పూర్వ విద్యార్థులు ఆనందంగా వీడ్కోలు పలికారు.

7న టాంపాలో 'స్వరావధానం'

టాంపా (ఫ్లోరిడా): తెలుగు సంఘం ఆఫ్ ఫ్లోరిడా, టాంపా బే ఆధ్వర్యంలో దసరా, దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నవంబరు 7న జరిగే సంబరాలకు ప్రముఖ యాంకర్ లావణ్య గూడురుతో పాటు మరో యాంకర్ రాగా బొమ్మారెడ్డి హాజరవుతున్నారు. టాంపాలోని ఇండియన్ కల్చరల్ సెంటర్లో సంప్రదాయ, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, మ్యూజికల్ ఈవెంట్స్ జరుగుతాయి.



ఎంట్రీ అందరికీ ఉచితమమేనని నిర్వాహకులు తెలిపారు. రిజిస్ట్రేషన్‌తో పాటు ఫ్రీ దివాళీ స్వీట్స్ కూడా ఇస్తారు. సంబరాల్లో భాగంగా వెంకట ప్రభాకర్ గరికిపాటిచే 'స్వరావధానం' ఏర్పాటు చేశారు. India cultural centre hall 5511 lynn rd, tampa FL 33624 వేదికపై సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది.


రాగమార్పు: సుధా
రసమార్పు/భావమార్పు: శ్రీధర్ యర్రంశెట్టి
తాళమార్పు: ప్రహ్లాద్ మాడభూషి
రాగమాలిక: అమరనాథ్ వంగర
నిషిద్ధ స్వరం: భాస్కర్ సోమంచి
స్వరాక్షరి: బాలా అమరవేదీ
అప్రస్తుత ప్రసంగం: రాధిక నోరి

ఈ కార్యక్రమాలకు కుటుంబ సభ్యులతో పాటు ఇరుగుపొరుగు వారిని కూడా తీసుకొచ్చి సంబరాల్లో హాయిగా గడుపుదాం.. ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేసుకుందామని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఓక్లహోమాలో 14న 'దీవాళి నైట్'

ఓక్లహోమా: ఇండియా అసోసియేషన్ ఆఫ్ ఓక్లహోమా ఆధ్వర్యంలో 'దీవాళి నైట్' నిర్వహణకు సన్నాహాలు జరుగుతు న్నాయి. నవంబరు 14న OCCC visual and performing atrs centre theatre 7777 may ave, Oklahoma city, ok 73159 వేదికగా An evening of light, culture and celebration అన్న థీమ్‌తో వేడుకలకు సర్వం సిద్ధమవుతోంది. ఇందులో పాల్గొనదలచిన వారు కచ్చితంగా ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు.

refreshments 4 pm - 4.45 pm
Diwali programme - 5 pm - 8 pm



festive dinner - 8 pm - 9 pm

ఈ వేడుకల్లో అందరూ కుటుంబ సమేతంగా పాల్గొనాలని, బంధువులు, నైబర్స్‌తో కూడా ఈ విషయాన్ని పంచుకుని అందరూ కలిసి దీపావళి జరపుకుందామని నిర్వాహకులు పిలుపునిచ్చారు. రిజిస్ట్రేషన్స్ కోసం https://iaok.org/event-6866735 వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

బే ఏరియా రాధాకృష్ణ ఆలయంలో 'దీపావళి మహోత్సవ్'

సాన్‌జోస్ (కాలిఫోర్నియా): బే ఏరియా రాధాకృష్ణ ఆలయంలో నవంబరు 6 నుంచి 8వ తేదీ వరకు 'దీపావళి మహోత్సవ్-2026' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పూజలు, అభిషేకాలు, కీర్తనలు, భక్తి సంగీతం, దీపావళి మేళా, పవిత్రమైన 1008 దీపాల వెలుగులతో వేడుకలు కన్నుల పండువగా సాగనున్నాయి.

6వ తేదీ: ధన్‌తేరస్ మహోత్సవ్
ఉదయం శ్రీగణేష్ పూజ, మహాలక్ష్మి పూజ, భగవాన్ ధన్వంతరి పూజ, మహాలక్ష్మి కేసర్ అభిషేకం, కుంకుమార్చన. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు భోగ్, హారతి, శ్రీరామ్ కీర్తనలు అనంతరం ప్రీతి భోజ్ (ప్రసాద వితరణ).

7వ తేదీ: కాళీ చౌదాస్, దీపావళి మేళా
అఖండ హనుమాన్‌చాలీసా పాఠ్, హనుమజ్జీ పూజ, అభిషేకం, 108 దీపాల వెలుగులు, ప్రత్యేక హనుమత్ ఆరతి. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు హనుమజ్జీ పూజ, దీపావళి మేళా, 'బే రాగీస్' ఆధ్వర్యంలో లైవ్ భక్తి సంగీత కచేరీ.

8వ తేదీ: దీపావళి మహాపర్వ్
ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సండే సత్సంగ్, సీతారామ్ అభిషేకం, కీర్తనలు అనంతరం ప్రీతి భోజ్. సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు శ్రీగణేష్, మహాలక్ష్మి పూజలతో దీపావళి పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 7.30 నుంచి గ్రాండ్ లైటింగ్ ఆఫ్ 1008 దీయాస్ (1008 దీపాల వెలుగుల వేడుక) ప్రారంభమై తదుపరి ప్రీతి భోజ్‌తో వేడుకలు ముగుస్తాయి.

వేదిక: రాధాకృష్ణ టెంపుల్ ఆఫ్ బే ఏరియా, 4411 హైలాండ్ ఏవెన్యూ, సాన్‌జోస్, CA 95127.

మరిన్ని వివరాలకు (669) 200-9358 నెంబరును సంప్రదించవచ్చు (లేదా) rktbayarea.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.



బెంగళూరులో దారుణం..

ఉద్యోగిని కొట్టి చంపిన యజమాని

బెంగళూరు: తన కుమార్తెతో సన్నిహితంగా ఉంటున్నాడనే కోపంతో ఓ ఫ్యాక్టరీ యజమాని తన వద్ద పనిచేసే ఉద్యోగిని దారుణంగా కొట్టి చంపాడు. గదిలో బంధించి బ్యాట్‌తో రాత్రంతా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటన కర్ణాటక రాజధాని బెంగళూరులోని యలహంక ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తమిళనాడుకు చెందిన ఆనంద్ రాజ్ కొన్నేళ్లుగా బెంగళూరులో స్వీట్ కార్న్ మెషిన్లు తయారు చేసే చిన్న ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నాడు. సుమారు రెండేళ్ల క్రితం కేరళకు చెందిన కిరణ్‌ను ఉద్యోగిగా నియమించుకున్నాడు. ఆనంద్ రాజ్ కుమార్తె మైసూరులో పీయూసీ ద్వితీయ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఆమెకు కిరణ్‌తో పరిచయం ఏర్పడి, అది సాన్నిహిత్యానికి దారితీసింది. ఈ విషయం తెలుసుకున్న ఆనంద్ రాజ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నాడు. నవంబర్ 2న భార్యతో కలిసి స్వగ్రామానికి వెళ్తున్నానని కుమార్తెకు చెప్పిన ఆనంద్ రాజ్.. అదే రోజు మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ సమయంలో కుమార్తెతో కలిసి గదిలో ఉన్న కిరణ్‌ను చూసి ఆగ్రహానికి



గురయ్యాడు. అతడిని ఓ గదిలో బంధించి, భార్యా కుమార్తెను బంధువుల ఇంటికి పంపించాడు. అనంతరం కిరణ్‌పై రాత్రంతా బ్యాట్‌తో దాడి చేశాడు. మరుసటి రోజు కడుపు కింది భాగంలో తన్నడంతో కిరణ్ కుప్పకూలిపోయాడు. వెంటనే ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆనంద్ రాజ్‌ను అరెస్టు చేసి, హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడా? అత్యాచారయత్నమా?

వైద్యుడిపై సినీనటుల దాడి కేసులో ట్విస్ట్

వైద్యం పేరుతో ఓ వైద్యుడిని తమ ఫ్లాట్‌కు రప్పించిన నటులు ఆయన్నుంచి రూ. 3.5లక్షల విలువైన వస్తువులు దోచుకున్నట్లుగా నమోదైన కేసు కీలక మలుపు తిరిగింది. సదరు వైద్యుడిపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. డాక్టర్ తనకు మత్తుమందు ఇచ్చి లైంగికంగా వేధించారని నటి బంధువు ఆరోపించడంతో ఈ కేసు నమోదైంది. వైద్యం కోసం ఫ్లాట్‌కు పిలిస్తే.. ఈ దారుణానికి ఒడిగట్టాడని బాధితురాలు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. నటి అతుల్య చంద్ర బంధువుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఇంటి వద్దే వైద్యం అందేలా ఆమె ఏర్పాట్లు చేశారు.

కొచ్చిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రాక్టీస్ చేస్తున్న వైద్యుడు ఫ్లాట్‌కు వచ్చి చికిత్స అందించేవారు. అలా వచ్చిన సమయంలో వైద్యుడు తనకు మత్తు మందు ఇచ్చి



లైంగికంగా వేధించాడని బాధితురాలు ఇటీవల నటికి చెప్పింది. దీంతో ఆమె తన స్నేహితులు, నటుడు-నిర్మాత బిబిన్ పెరుంబిల్లితో కలిసి వైద్యుడికి తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. ప్లాన్ ప్రకారం అత్యవసరంగా చికిత్స అందించాల్సిందిగా ఫోన్ చేసి, ఫ్లాట్‌కు రప్పించారు. వైద్యుడు వచ్చిన వెంటనే అందరూ ఒక్కసారిగా అతడిని చుట్టుముట్టి దాడి చేశారు. బాధితురాలికి రూ. 25 లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకొని వదిలేశారు. అనంతరం పోలీసులను ఆశ్రయించిన వైద్యుడు.. నటులు, వారి సన్నిహితులు తనను ఫ్లాట్‌లో బంధించి దాడి చేశారని ఆరోపించారు. తన నుంచి రూ. 3.5 లక్షల విలువైన వస్తువులు లాక్కున్నారని పేర్కొన్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే అత్యాచారానికి పాల్పడినట్లు కేసు పెడతామని బెదిరించారన్నారు. దీంతో పోలీసులు పలు కోణాల్లో ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్డీయే కోసం సోనియా ఓటు చోరీ చేశారా?

- బీజేపీ వ్యంగ్యాస్త్రాలు

ఓట్ల చోరీ ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై భాజపా అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ మండిపడ్డారు. గతంతో పోలిస్తే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలుపు శాతం తక్కువగానే ఉందని భాజపా అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. గతంలో సీఈసీగా వీఎస్ సంపత్ ఉన్నప్పటితో పోలిస్తే.. నేడు జ్ఞానేశ్ కుమార్ సీఈసీగా ఉన్నప్పుడు ఎన్డీయే సాధించిన గెలుపు శాతం తక్కువగానే ఉందన్నారు. మరి, అప్పుడు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఎన్డీయే కోసం ఓటు చోరీకి పాల్పడ్డారా? అని ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలోనే వీఎస్ సంపత్ 2012 జూన్ నుంచి 2015 జనవరి వరకు సీఈసీగా బాధ్యతల్లో ఉన్నారని గుర్తు చేశారు. వీఎస్ సంపత్ సీఈసీగా ఉన్నప్పుడు ఎన్డీయే గెలుపు శాతం 75శాతం కాగా.. జ్ఞానేశ్ కుమార్ వచ్చాక అది 66శాతంగానే ఉందని తెలిపారు. వీఎస్ సంపత్ ఉన్నప్పుడే భాజపా స్ట్రైక్ రేట్ అధికమన్నారు. మరి, రాహుల్ గాంధీ లెక్క ప్రకారం



చూస్తే.. సోనియా గాంధీ భాజపా కోసం ఓట్లచోరీ చేశారా? అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్డీయేకు అనుకూలంగా ఉన్నారని రాహుల్ చెబుతున్నారని.. కానీ, వాస్తవాలు, గణాంకాలు ఆయన ఆరోపణలు తప్పని నిరూపిస్తున్నాయని తెలిపారు. జ్ఞానేశ్ కుమార్ 2024 మార్చిలో సీఈసీగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

ప్రజాభిప్రాయం బెయిల్‌ను నిర్దేశించలేదు: కేరళ కోర్టు



మినీ కూపర్ కారు ప్రమాద ఘటనలో కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాభిప్రాయాలు బెయిల్‌ను నిర్దేశించకూడదని పేర్కొంది. నిందితుల బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. నలుగురు నిందితులకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. వారిలో ప్రధాన నిందితుడి విడుదలపై మాత్రం పరిమితులు విధించింది. 10 రోజుల తర్వాత అతడిని బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించింది. అలప్పుళ సౌత్‌కు చెందిన 19 ఏళ్ల సజీవ్.. గత నెల తన స్నేహితుడితో కలిసి నెడుంబస్సేరి సమీపంలోని ఎయిర్‌పోర్టు రోడ్డుపై మినీకూపర్‌లో వేగంగా వెళ్తూ.. ఓ స్కూటర్‌ను ఢీకొట్టాడు. దాంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు యువతులు, ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సమయంలో నిందితులు మద్యం మత్తులో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటన రాష్ట్రంలో తీవ్ర ప్రజాగ్రహానికి దారితీసింది. ఈ క్రమంలోనే నిందితుల బెయిల్ పిటిషన్ విచారణ జరిగింది. కేవలం ప్రజల అభిప్రాయాల ఆధారంగా న్యాయస్థానాలు నిర్ణయాలు తీసుకోవు. చట్టపరమైన నిబంధనల ప్రకారమే నడుచుకోవాలి" అని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది.

రీల్స్ కోసం.. స్నేహితుడినే తగలెట్టేశారు!



కోల్‌కతా: రీల్స్ మోజులో పడి కొందరు ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. రైలుకు ఎదురుగా వెళ్లడం, ఎత్తైన ప్రాంతం నుంచి కిందకి దూకడం లాంటి చేష్టలతో కుటుంబానికి తీరని నష్టం చేస్తున్నారు. తాజాగా రీల్స్ కోసం కొందరు యువకులు తమ స్నేహితుడికి బలవంతంగా పెట్రోల్ తాగించేందుకు ప్రయత్నించడమే కాక.. అతడికి నిప్పంటించారు. అక్టోబర్ 27న కోల్‌కతాలో చోటుచేసుకున్న ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్భా ప్రాంతానికి చెందిన ఓ యువకుడు తన పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా.. మధ్యలో అతడి స్నేహితులు కలిశారు. దగ్గర్లోని చెరువు కట్ట దగ్గరికి తీసుకెళ్లి పరాచకాలు ఆడారు. రీల్స్ తీద్దామని చెప్పి.. అతడితో బలవంతంగా పెట్రోల్ తాగించే ప్రయత్నం చేశారు. ప్రతిఘటించే క్రమంలో కొంత పెట్రోల్ అతడి దుస్తులపై పడింది. అంతలో ఒకడు తన దగ్గరున్న అగ్గిపెట్టి తీసి.. నిప్పంటించాడు. బాధితుడు భయంతో దుస్తులు విప్పేసి పరుగులు తీయగా... కాలిన గాయాలతో ఉన్న బాధితుడిని చుట్టు పక్కల వారు గమనించి ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు గుర్తించారు. రీల్స్ తీసి, సోషల్ మీడియాలో పోస్టు చేద్దామనే ఉద్దేశంతోనే ఇలా చేసినట్లు నిందితులు తెలిపారు.



అడ్రెస్ అడిగాడు.. గొలుసు లాక్కెళ్లాడు!

చిరునామా అడిగినట్లు నటించి ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడో దుండగుడు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వివరాల్లోకి వెళ్తే.. నవంబర్ 3న రాత్రి 9.23 గంటల సమయంలో కండివాలి వెస్ట్‌లోని ఉమాంగ్ అపార్ట్‌మెంట్‌లోకి టోపీ ధరించిన ఓ వ్యక్తి ప్రవేశించాడు. ఇంటి తలుపు తెరిచేందుకు ప్రయత్నిస్తున్న వృద్ధురాలి వద్దకు వెళ్లి, ఆ భవనంలోని ఓ వ్యక్తి చిరునామా అడిగాడు. ఇందుకోసం ఓ కాగితాన్ని కూడా ఆమెకు చూపించాడు. అతడు అడిగిన చిరునామా తెలియజేసేందుకు వృద్ధురాలు మెట్ల వైపు చూపించింది. అయితే, ఆ వెంటనే దుండగుడు ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాడు. మెడలో ఉన్న బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. ఊహించని పరిణామంతో వృద్ధురాలు తీవ్ర ఆందోళనకు గురైంది. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు అపార్ట్‌మెంట్‌లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. చిరునామా అడుగుతున్నట్లు నమ్మించి దోపిడీకి పాల్పడిన దుండగుడి దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

డెమోక్రాట్ల విజయంతో..

కుదేలైన అమెరికా మార్కెట్లు!

- ఏఐ షేర్లలో భారీ అమ్మకాలు
- ఒక్కరోజే ట్రిలియన్ల డాలర్ల సంపద ఆవిరి
- నాస్‌డాక్ 5.5 శాతం పతనం



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల ఘనవిజయం స్టాక్ మార్కెట్లను కుదిపేసింది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో పెట్టుబడులు పెట్టిన కంపెనీల షేర్లలో భారీ అమ్మకాలు చోటుచేసుకున్నాయి. డేటా సెంటర్ల నిర్మాణంపై డెమోక్రాట్లు ఆంక్షలు విధించే అవకాశం ఉందన్న ఆందోళనతో ఇన్వెస్టర్లు టెక్నాలజీ షేర్లకు దూరమయ్యారు. దీంతో గురువారం (నవంబర్ 5) అమెరికా మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. టెక్నాలజీ కంపెనీలకు ప్రధాన వేదికగా ఉన్న నాస్‌డాక్ కాంపోజిట్ ఏకంగా 5.5 శాతం పడిపోయింది. 1,421 పాయింట్లు నష్టపోయి 24,315 వద్ద ముగిసింది. ఎస్‌అండ్‌పీ 500 సూచీ 4.4 శాతం, డౌజోన్స్ 3.4 శాతం క్షీణించాయి. ఒక్కరోజులో ఎస్‌అండ్‌పీ 500 కంపెనీల మార్కెట్ విలువ దాదాపు 3 ట్రిలియన్ డాలర్లు తగ్గింది. నాస్‌డాక్ 100 సూచీలోని కంపెనీల మార్కెట్ విలువలోనే సుమారు 2.5 ట్రిలియన్ డాలర్లు ఆవిరయ్యాయి.

చిప్ కంపెనీలకు భారీ దెబ్బ

ఏఐ రంగంలో కీలకమైన చిప్ తయారీ సంస్థల షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. ఎన్విడియా షేర్లు 9.3 శాతం, అడ్వాన్స్‌డ్ మైక్రో డివైసెస్ (ఏఎండీ) షేర్లు 17.3 శాతం పడిపోయాయి. ఫిలడెల్ఫియా సెమీకండక్టర్ ఇండెక్స్ 12 శాతానికి పైగా క్షీణించింది. అమెజాన్, ఆల్ఫాబెట్ వంటి దిగ్గజ సంస్థల షేర్లు కూడా నష్టాలను చవిచూశాయి.

ఏఐ పెట్టుబడులపై పెరుగుతున్న సందేహాలు

డెమోక్రాట్ల విజయంతో అమెరికా కాంగ్రెస్‌లో ఏఐ రంగంపై నియంత్రణలు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా విద్యుత్, నీటి వినియోగం ఎక్కువగా ఉండే డేటా సెంటర్ల నిర్మాణానికి స్థానికంగా వ్యతిరేకత పెరుగుతోంది. టెక్సాస్‌లో కొత్త డేటా సెంటర్ల నిర్మాణాన్ని నిలిపివేస్తామని గవర్నర్‌గా ఎన్నికైన గినా హినోజోసా ప్రకటించడం ఈ ఆందోళనలకు మరింత బలం చేకూర్చింది. మరోవైపు ఏఐ కోసం దిగ్గజ సంస్థలు చేస్తున్న భారీ ఖర్చులకు తగిన ఆదాయం, లాభాలు వస్తాయా అన్న ప్రశ్నలు కూడా ఇన్వెస్టర్లను వెంటాడుతున్నాయి.

ఆసియా మార్కెట్లపైనా ప్రభావం

అమెరికా మార్కెట్ల పతనం ఆసియా మార్కెట్లకూ విస్తరించింది. దక్షిణ కొరియా కోస్పి సూచీ 5.3 శాతం పడిపోగా, జపాన్ మార్కెట్లలోనూ టెక్నాలజీ, చిప్ కంపెనీల షేర్లపై ఒత్తిడి కనిపించింది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఆధారిత వ్యాపారాల భవిష్యత్తుపై పెట్టుబడిదారులు పునరాలోచనలో పడ్డారు. అయితే శుక్రవారం అమెరికా మార్కెట్లలో కొంత ఉపశమన సంకేతాలు కనిపించాయి. నాస్‌డాక్ ఫ్యూచర్స్ 1.48 శాతం పెరగ్గా, ఎన్విడియా, ఏఎండీ, మైక్రాన్ వంటి చిప్ కంపెనీల షేర్లు ప్రీ-మార్కెట్ ట్రేడింగ్‌లో కోలుకున్నాయి. దీంతో గురువారం నాటి పతనం తర్వాత మార్కెట్లు నిలదొక్కుకుంటాయా? లేక ఏఐ పెట్టుబడులపై అనిశ్చితి మరింత నష్టాలకు దారితీస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

ఏడు షరతులు.. అణు ప్రతిపాదన!

- అమెరికాకు ఇరాన్ కొత్త పంచ్..
- ముందుగా దిగ్బంధం ఎత్తేయాలి..
- ఆ తర్వాతే అణు చర్చలు!



అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధానికి తెరదించే ప్రయత్నాలు మరోసారి ఊపందుకున్నాయి. అయితే శాంతి చర్చలకు ముందే ఏడు కీలక షరతులను అంగీకరించాలని ఇరాన్ పట్టుబడుతోంది. ఈ మేరకు తన కొత్త అణు ప్రతిపాదనను ఖతార్ మధ్యవర్తిత్వంతో అమెరికాకు పంపించింది. ఇరాన్ పంపిన ప్రతిపాదనను వాషింగ్టన్ పరిశీలిస్తున్నట్లు ఆ దేశ సీనియర్ అధికారి ఒకరు రాయిటర్స్ వార్తా సంస్థకు వెల్లడించారు. అయితే ఏడు షరతులు అమలు చేసిన తర్వాతే అణు అంశంపై చర్చలు జరుపుతామని టెహ్రాన్ స్పష్టం చేస్తోంది. ఇరాన్ అధికారికంగా ఏడు షరతుల పూర్తి జాబితాను విడుదల చేయలేదు. అయితే అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం వాటిలో ప్రధానంగా అమెరికా విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయడం, ఇరాన్ ఓడరేవులపై నావికా దిగ్బంధాన్ని తొలగించడం, విదేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం, యుద్ధంలో జరిగిన నష్టాలకు పరిహారం చెల్లించడం ఉన్నాయి. అలాగే ఇరాన్ భూభాగంపై అమెరికా దాడులు నిలిపివేయడం, లెబనాన్ సహా అన్ని ప్రాంతాల్లో ఘర్షణలకు ముగింపు పలకడం, మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక ఉనికిని తగ్గించడంవంటి డిమాండ్లు ఉన్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి.ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అధిపతి మొహసేన్ రెజాయీ నవంబర్ 5న రష్యా పర్యటన సందర్భంగా మాట్లాడుతూ..ఈషరతులు అమలయ్యేంతవరకు హర్మూజ్ జలసంధిని తెరిచేది లేదని,చర్చలు కూడా జరిపేది లేదని స్పష్టం చేశారు.

440 టన్నులా? 440 కిలోల యురేనియం నిల్వలా?

అణు కార్యక్రమమే ఇరుదేశాల మధ్య ప్రధాన వివాదంగా మారింది. ఇరాన్ వద్ద సుమారు 440 కిలోల 60శాతం శుద్ధి చేసిన యురేనియం నిల్వ ఉన్నట్లు అంతర్జాతీయనివేదికలు పేర్కొంటున్నాయి. ఈ నిల్వలను పూర్తిగా అప్పగించాలని అమెరికా కోరుతోంది.అయితే ఇరాన్ తనదేశం నుంచి యురేనియంను బయటకు తరలించేందుకు అంగీకరించ డంలేదు.అంతర్జాతీయ అణుశక్తిసంస్థ పర్యవేక్షణలో ఇరాన్‌లోనే దాని శుద్ధిస్థాయిని తగ్గించే అవకాశాల పై గతంలో ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి. కానీ తాజా ప్రతిపాదనలో ఈ అంశంపై ఇరాన్ఎలాంటి తుదిఅంగీకారం తెలిపిందో స్పష్టత లేదు.

ఎన్నికల ఎదురుదెబ్బ.. అయినా తగ్గని ట్రంప్

మరోవైపు అమెరికాలో మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌తో యుద్ధం కూడా తమ పార్టీ ఓటమికి కారణమైన అంశాల్లో ఒకటని ట్రంప్ అంగీకరించారు. అయినప్పటికీ సైనిక చర్య విషయంలో తన నిర్ణయాన్ని తప్పుగా భావించడం లేదని, అవసరమైతే యుద్ధాన్ని కొనసాగించడానికి సిద్ధమని సంకేతాలిచ్చారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ ప్రతిపాదనపై అమెరికా స్పందన కీలకంగా మారింది. ఖతార్ దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ, ఆంక్షలు, నావికా దిగ్బంధం, హర్మూజ్ జలసంధి, యురేనియం నిల్వలపై ఇరుదేశాల మధ్య విభేదాలు ఇంకా తొలగలేదు. చర్చలు ఫలిస్తాయా? లేక పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటాయా? అన్నది ఇప్పుడు అంతర్జాతీయ సమాజం ఆసక్తిగా గమనిస్తోంది.

బంగ్లాదేశ్‌లో భారత వైద్య విద్యార్థి మృతి!

- రెండు రోజుల తర్వాత చెరువులో మృతదేహం లభ్యం
- కుమారుడి మరణవార్తతో ఆసుపత్రిపాలైన తల్లి
- రంగంలోకి భారత హైకమిషన్

బంగ్లాదేశ్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న భారత వైద్య విద్యార్థి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు. రెండు రోజుల క్రితం అదృశ్యమైన అతడి మృతదేహం మెడికల్ కాలేజీ సమీపంలోని చెరువులో లభ్యమైంది. కుమారుడి మరణవార్తతో తీవ్ర మనోవేదనకు గురైన అతడి తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన జమ్ము కశ్మీర్‌లోని సోపోర్ ప్రాంతంలో విషాదం నింపింది. సోపోర్‌కు చెందిన 26 ఏళ్ల అద్నాన్ అల్తాఫ్ బంగ్లాదేశ్‌లోని కుమిల్లా జిల్లాలో ఉన్న ఈస్టర్న్ మెడికల్ కాలేజీలో ఐదో సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్నాడు. 2017-18 విద్యా సంవత్సరంలో కాలేజీలో చేరిన అతడు నవంబర్ 4 నుంచి జరగాల్సిన రెండో ప్రొఫెషనల్ ఎంబీబీఎస్ మైక్రోబయాలజీ పరీక్షలకు హాజరుకావాల్సి ఉంది. ఇటీవలే తల్లితో కలిసి బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లాడు.



రెస్టారెంట్‌కు వెళ్లి.. అదృశ్యం

నవంబర్ 2 రాత్రి సుమారు 11 గంటల సమయంలో అద్నాన్ కాలేజీ క్యాంపస్ నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం సమీపంలోని ఇండియన్ రెస్టారెంట్‌కు వెళ్లిన అతడు అర్ధరాత్రి సమయంలో కనిపించకుండా పోయాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కాలేజీ యాజమాన్యం, అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 4 ఉదయం కుమిల్లా జిల్లాలోని బురిచాంగ్ ఉపజిల్లా మోనిపూర్ గ్రామంలో చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం కుమిల్లా మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు.

తల్లి ఆరోగ్యంపై ఆందోళన

అద్నాన్ కొంతకాలంగా మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడని, అతడికి తోడుగా ఉండేందుకు తల్లిని కూడా కాలేజీ క్యాంపస్‌లో ఉండేందుకు అనుమతించామని యాజమాన్యం తెలిపింది. అయితే అతడి మరణవార్తతో తల్లి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ప్రస్తుతం ఆమె బంగ్లాదేశ్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు భారత హైకమిషన్ సెకండ్ సెక్రటరీ ఎం.కె. సింగ్ నవంబర్ 5న కాలేజీని సందర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. అద్నాన్ తల్లిని పరామర్శించారు. కుమారుడి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి భారత ప్రభుత్వం సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అద్నాన్ మృతికి గల అసలు కారణం ఏమిటన్నది పోలీసుల దర్యాప్తు, పోస్టుమార్టం నివేదిక ద్వారా తేలాల్సి ఉంది. ప్రమాదవశాత్తూ చెరువులో పడిపోయాడా? మరేదైనా కారణం ఉందా? అన్న విషయాలపై అధికారిక నిర్ధారణ ఇంకా వెలువడలేదు.

బీఎల్‌ఏలో నాయకత్వ మార్పు

బషీర్ జెబ్‌కు ఉద్వాసన!

పాకిస్థాన్‌లో భద్రతా బలగాలు, ప్రభుత్వ సంస్థలపై దాడులతో కలకలం రేపిన బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ సంస్థ కమాండర్-ఇన్-చీఫ్ బషీర్ జెబ్ బలోచ్ ఇకపై ఆ పదవిలో కొనసాగబోరని బీఎల్‌ఏ ప్రకటించింది. ఆయనకు సంబంధించిన పరిపాలనా, సైనిక, విధానపరమైన అధికారాలన్నింటినీ కొత్త నాయకుడి ఎంపిక పూర్తయ్యే వరకు సీనియర్ కమాండ్ కౌన్సిల్‌కు అప్పగించింది. నవంబర్ 3న సంస్థ అధికార ప్రతినిధి జీయాంద్ బలోచ్ ఈ విషయాన్ని ప్రకటించారు. అక్టోబర్ 16న జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో నాయకత్వ మార్పుపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. త్వరలోనే కొత్త కమాండర్‌ను ప్రకటిస్తామని సంస్థ తెలిపింది. 2018లో అస్లాం బలోచ్ మరణం తర్వాత బషీర్ జెబ్ సంస్థ పగ్గాలు చేపట్టారు. ఆయన నాయకత్వంలో బీఎల్‌ఏ పాకిస్థాన్‌లో పలు కీలక దాడులకు పాల్పడింది. 2025లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు హైజాకింగ్ ఘటనతో అంతర్జాతీయంగా వార్తల్లో నిలిచింది. అయితే, 2026 జనవరిలో చేపట్టిన హెరోఫ్-2 ఆపరేషన్ తర్వాత సంస్థలో వ్యూహాత్మక విభేదాలు తలెత్తినట్లు కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. భారీ సంఖ్యలో సాయుధులను ఒకేసారి రంగంలోకి దించడం వల్ల సంస్థకు నష్టాలు ఎదురయ్యాయని, ఈ వ్యూహంపై మజీద్ బ్రిగేడ్‌కు చెందిన రహ్మాన్ గుల్ సహా కొందరు కమాండర్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. మహిళా ఆత్మాహుతి దాడుల వినియోగం కూడా సంస్థపై విమర్శలకు, అంతర్జాతీయంగా ప్రతికూల అభిప్రాయాలకు కారణమైందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, ఈ అంశాలే బషీర్ జెబ్ నాయకత్వ మార్పునకు కారణమని బీఎల్‌ఏ అధికారికంగా ధ్రువీకరించలేదు.



మరోవైపు, బషీర్ జెబ్‌పై విషప్రయోగం జరిగిందని, ఆయనను చికిత్స కోసం భారత్‌కు తరలించారంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ వాదనలకు విశ్వసనీయమైన స్వతంత్ర ఆధారాలు లభించలేదు. ఆయన ప్రస్తుత పరిస్థితి, ఆచూకీపై కూడా స్పష్టత లేదు. బీఎల్‌ఏ ఈ మార్పును సంస్థాగత, రాజ్యాంగబద్ధమైన నాయకత్వ బదిలీగా అభివర్ణిస్తోంది. అయితే, తెరవెనుక అసలు కారణాలపై అనుమానాలు కొనసాగుతున్నాయి. కొత్త నాయకుడి ఎంపిక, ప్రస్తుత కమాండ్ కౌన్సిల్ పాత్ర, ఈ పరిణామం సంస్థ కార్యకలాపాలపై చూపే ప్రభావం ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి.

2027 ప్రపంచకప్‌పై గురి..

న్యూజిలాండ్ సిరీస్‌తో భారత్ సన్నాహాలు - దక్షిణాఫ్రికా పరిస్థితులను అంచనా వేసేందుకు మంచి అవకాశం - పేసర్లపై పూర్తి నమ్మకం: కెప్టెన్ శుభ్‌మన్ గిల్

ఆక్లాండ్: వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌ను సన్నాహకంగా ఉపయోగించుకుంటున్నామని భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెల్లడించాడు. న్యూజిలాండ్‌లో నవంబర్ నెలలో ఉండే వాతావరణం, పిచ్ పరిస్థితులు దక్షిణాఫ్రికాలో జరిగే ప్రపంచకప్ సమయంలో ఎదురయ్యే పరిస్థితులకు దగ్గరగా ఉంటాయని అభిప్రాయపడ్డాడు. అందువల్ల ఈ పర్యటన తమకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పాడు.

సాధారణంగా భారత్ దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటనలకు డిసెంబర్, జనవరి నెలల్లో వెళ్తుంటుందని గిల్ గుర్తుచేశాడు. అయితే 2027 వన్డే ప్రపంచకప్ అక్టోబర్-నవంబర్‌లో జరగనుండటంతో, ఈసారి న్యూజిలాండ్‌లో నవంబర్ ప్రారంభంలో ఆడటం ప్రత్యేక అనుభవాన్ని ఇస్తుందన్నాడు. ఈ పరిస్థితుల్లో ఆడటం ద్వారా ఆటగాళ్లు ప్రపంచకప్‌కు ముందుగానే అలవాటు పడతారని పేర్కొన్నాడు.

పేసర్లకు పరీక్ష..

న్యూజిలాండ్ పిచ్‌లపై బంతి స్వింగ్ అవడంతోపాటు మంచి బౌన్స్ లభిస్తుందని గిల్ తెలిపాడు. ఇలాంటి పరిస్థితుల్లో భారత యువ పేసర్లు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఉందన్నాడు. అర్ష్‌దీప్ సింగ్, అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్ వంటి బౌలర్లపై తనకు నమ్మకం ఉందని చెప్పాడు. ముఖ్యంగా పిచ్ బౌన్స్ తగ్గిన తర్వాత మధ్య ఓవర్లలో వికెట్లు తీయగల పొడవైన, వేగవంతమైన బౌలర్లు జట్టుకు అవసరమని వివరించాడు. 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేయగల బౌలర్లు బ్యాటర్లకు ఇబ్బందులు సృష్టిస్తారని అభిప్రాయపడ్డాడు.

ఐదో, ఆరో స్థానాల్లో బ్యాటింగ్ చేసే ఆటగాళ్ల విషయంలోనూ జట్టు అనువైన వ్యూహాన్ని అనుసరిస్తుందని గిల్ తెలిపాడు. పరిస్థితిని బట్టి అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపే అవకాశం ఉందన్నాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టుకు అందించే సమతూకం ఎంతో విలువైనదని, అతడు త్వరగా కోలుకుని తిరిగి జట్టులోకి రావాలని ఆశిస్తున్నట్లు చెప్పాడు.

తొలి వన్డేతో శుభారంభం..

ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 3-2తో గెలుచుకోవడం జట్టుకు ఆత్మవిశ్వాసాన్నిచ్చిందని గిల్ పేర్కొన్నాడు.



శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో టీ20 జట్టు బాగా ఆడిందని ప్రశంసించాడు. ఆ ఉత్సాహంతో వన్డే సిరీస్‌లో అడుగుపెట్టిన భారత్.. నవంబర్ 4న ఆక్లాండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. విరాట్ కోహ్లీ 74 పరుగులతో రాణించగా, అన్షుల్ కాంబోజ్ రెండు వికెట్లు తీశాడు. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.

రెండో వన్డే నవంబర్ 7న వెల్లింగ్టన్‌లో, మూడోది నవంబర్ 10న హామిల్టన్‌లో జరగనున్నాయి. చివరి రెండు మ్యాచ్‌లు మౌంట్ మాంగనూయ్‌లో జరుగుతాయి. ఈ సిరీస్‌లో యువ ఆటగాళ్ల ప్రదర్శన, బౌలింగ్ కూర్పు, బ్యాటింగ్ ఆర్డర్ ప్రయోగాలు 2027 ప్రపంచకప్ జట్టు ఎంపికకు కీలకంగా మారనున్నాయి.



15 ఏళ్లకే కెప్టెన్..

- వైభవ్ సూర్యవంశీకి అరుదైన గౌరవం
- బిహార్ సీనియర్ జట్టు పగ్గాలు..
- ముస్తాక్ అలీ ట్రోఫీలో తొలి రెండు మ్యాచ్‌లకు నాయకత్వం

పట్నా: భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీకి మరో అరుదైన అవకాశం దక్కింది. కేవలం 15 ఏళ్ల వయసులోనే బిహార్ సీనియర్ పురుషుల జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 2026-27 సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో తొలి రెండు మ్యాచ్‌లకు అతడు జట్టును నడిపించనున్నాడు. ఈ మేరకు బిహార్ క్రికెట్ సంఘం (బీసీఏ) 17 మందితో కూడిన జట్టును ప్రకటించింది. నవంబర్ 14న ఇండోర్‌లో సౌరాష్ట్రతో బిహార్ తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం నవంబర్ 16న రైల్వేస్‌తో తలపడుతుంది. సూరజ్ కశ్యప్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. భారత-ఎ జట్టుతో రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో పాల్గొనాల్సి ఉండటంతో వైభవ్‌కు తొలి రెండు మ్యాచ్‌లకే నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. మంగళ్ మహౌర్, షకీబ్ హుస్సేన్‌ల ఎంపిక ఫిట్‌నెస్‌కు లోబడి ఉంటుంది. ఈ ఏడాది వైభవ్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 175 పరుగులు చేసి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 776 పరుగులతో అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడు. అంతర్జాతీయ టీ20ల్లోనూ అరంగేట్రం చేసి ఆకట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో సీనియర్ జట్టుకు కెప్టెన్సీ దక్కడం అతడి కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలవనుంది.

ప్రధాని మోదీని కలిసిన టీ20 మాజీ కెప్టెన్ సూర్యకుమార్

టీమిండియా టీ20 జట్టు మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇవాళ ప్రధాని మోదీని కలిశారు. దేశ రాజధానిలో సూర్య కుమార్, ఆయన భార్య దేవీశా శెట్టి.. ప్రధాని మోదీతో సమయాన్ని గడిపారు. ఈ సందర్భంగా 2026 టీ20 వరల్డ్‌కప్‌లో గెలిచిన గోల్డ్ మెడల్‌ను క్రికెటర్ సూర్య తన మెడలో ధరించాడు. సూర్య దంపతులతో పాటు ఓ బాలిక కూడా మోదీని కలిసింది. ఆ చిన్నారి కన్నడ భాషలో గణేశుడి భక్తి కీర్తనలను పాడి ప్రధానికి వినిపించింది. ప్రధాని మోదీ ఆ వీడియోను తన ఎక్స్ అకౌంట్‌లో షేర్ చేశారు.



దీపావళి వేళ.. రాముడు, సరయూ దివ్యంగా వెలిగిపోయారని, ఆ శుభప్రదమైన క్షణాలు దీపావళి పండుగను మరింత కాంతివంతంగా మార్చాయని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. శ్రీరాముడు 14 ఏళ్ల వనవాసం తర్వాత అయోధ్యకు చేరుకుంటాడని, ఈ నేపథ్యంలో సరయూ తీరంలో దీపావళి సంబరాలు జరుగుతాయన్న ఉద్దేశాన్ని ప్రధాని తన మెసేజ్ ద్వారా వెల్లడించారు.

చితకొట్టిన సెహ్వాగ్ కొడుకు

అండర్-19 ఆసియా కప్‌లో భారత్ బోణీ.. నేపాల్‌పై ఘన విజయం! 10 వికెట్ల తేడాతో గెలుపు.. పాక్‌తో తదుపరి పోరు

మస్కట్: అండర్-19 ఆసియా కప్‌లో భారత యువ జట్టు శుభారంభం చేసింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో నేపాల్‌ను 10 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. తొలుత భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి నేపాల్‌ను స్వల్ప స్కోరుకే పరిమితం చేయగా.. ఆ తర్వాత ఓపెనర్లు ఆర్యవీర్ సెహ్వాగ్, లక్ష్య రాజేశ్ రాయ్‌చందాని అజేయ అర్ధశతకాలతో జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు. టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకోగా, తొలుత బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 42.3 ఓవర్లలో 128 పరుగులకు ఆలౌటైంది. దర్ష్ సోనార్ (43), ఆషిష్ లుహార్ (29), నీరజ్ కుమార్ యాదవ్ (20) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్ 18 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. అర్జున్ రాజ్‌పుత్ 8 పరుగులకే మూడు వికెట్లు తీసి నేపాల్ పతనాన్ని వేగవంతం చేశాడు. యశ్వీర్ గౌడ్ రెండు వికెట్లు సాధించాడు.

అనంతరం 129 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 19.1 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా 129 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. మాజీ భారత క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ 52 బంతుల్లో 70 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడి ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. మరో ఓపెనర్ లక్ష్య రాజేశ్ రాయ్‌చందాని 63 బంతుల్లో 53 పరుగులు చేశాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు అజేయంగా 129 పరుగులు జోడించారు. ఈ విజయంతో భారత్ గ్రూప్-ఏలో శుభారంభం చేసింది. నవంబర్ 5 నుంచి 14 వరకు ఒమన్‌లోని మస్కట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో భారత్ తదుపరి మ్యాచ్‌లో ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. గ్రూప్‌లో నేపాల్, యూఏఈ కూడా ఉన్నాయి. గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.




భార్య క్యాన్సర్ పోరాటం.. టిక్నర్ జీవితాన్నే మార్చేసింది!

వెల్లింగ్టన్: భారత్‌తో తొలి వన్డేలో న్యూజిలాండ్ బౌలర్ బ్లెయిర్ టిక్నర్ ఆడిన తీరు అందరినీ ఆకట్టుకుంది. చివర్లో బ్యాటింగ్‌కు వచ్చి భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. గుర్నూర్ బ్రార్ బౌన్సర్లతో కవ్వించినా.. టిక్నర్ మాత్రం చిరునవ్వుతోనే స్పందించాడు. ఔటై పెవిలియన్‌కు వెళ్తున్నప్పుడూ అదే ప్రశాంతతను ప్రదర్శించాడు. అయితే, మైదానంలో అతడు కనిపించే ఈ ప్రశాంతత వెనుక ఎన్నో కఠిన అనుభవాలు ఉన్నాయని తాజాగా వెల్లడించాడు. తన భార్య సారా క్యాన్సర్‌తో చేసిన పోరాటం తన జీవితంపై, క్రికెట్‌పై ఉన్న దృక్పథాన్నే మార్చేసిందని టిక్నర్ చెప్పాడు. 2024లో సారాకు అక్యూట్ లింఫోబ్లాస్టిక్ లుకేమియా అనే రక్త క్యాన్సర్ నిర్ధారణ అయింది. ఆమె చికిత్స కోసం కుటుంబం రెండేళ్లకు పైగా కఠిన పరిస్థితులను ఎదుర్కొంది. ఈ సమయంలో క్రికెట్‌కంటే కుటుంబమే ముఖ్యమని తనకు అర్థమైందని 33 ఏళ్ల టిక్నర్ తెలిపాడు. "నా జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదురయ్యాయి. సారా, నా కుటుంబం నాకు అండగా నిలిచాయి. క్రికెట్ నా జీవితానికి ఎంతో ఇచ్చింది. కానీ మ్యాచ్ ముగిసిన తర్వాత భార్య, కుమార్తె దగ్గరకు వెళ్లగలగడం ఎంతో సంతోషాన్నిస్తుంది. జీవితంలో క్రికెట్ కంటే ముఖ్యమైన విషయాలు చాలా ఉన్నాయి" అని టిక్నర్ భావోద్వేగంగా చెప్పాడు.

భారత్‌తో తొలి వన్డేలో 11వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన టిక్నర్ 23 బంతుల్లో 34 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సిక్సర్లు, ఒక ఫోర్ ఉన్నాయి. అర్ష్‌దీప్ సింగ్ వేసిన ఓవర్లో మూడు సిక్సర్లు బాదడం విశేషం. జాకబ్ డఫీతో కలిసి చివరి వికెట్‌కు 41 పరుగులు జోడించాడు. అయితే, అతడి పోరాటం న్యూజిలాండ్‌ను ఓటమి నుంచి కాపాడలేకపోయింది.


చైతన్య రథం
సినిమా
శనివారం 7 నవంబరు 2026 X

చిత్రమైన టైటిల్‌తో కమల్ కొత్త ప్రాజెక్టు



అగ్రనటుడు కమల్హాసన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న కొత్త చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఎస్.యు. అరుణ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'సాండియార్' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రామ రణబీర్‌కు మహేష్ ప్రశంసలు..



సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రశంసలతో 'రామాయణ' చిత్ర బృందం మరోసారి వార్తల్లో నిలిచింది. రణబీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నితీష్ తివారీ తెరకెక్కించిన పౌరాణిక ఇతిహాసం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. సినిమా చూసిన మహేష్.. చిన్నప్పటి నుంచి వింటూ పెరిగిన రామాయణ గాథను ఇంత అద్భుతంగా తెరపై ఆవిష్కరించడం ఆనందంగా ఉందంటూ సోషల్ మీడియాలో స్పందించారు. రణబీర్, యశ్, సాయి పల్లవిల నటనను 'మ్యాజికల్' అంటూ కొనియాడారు. ఇంత భారీ చిత్రాన్ని రూపొందించిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితీష్ తివారీలను ప్రత్యేకంగా అభినందించారు. అయితే మహేష్ ప్రశంసల వెనుక మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి'లో మహేష్ బాబు కూడా శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని మహేష్ స్వయంగా గతంలో వెల్లడించారు. ఈ పాత్ర కోసం సుమారు ఆరు నెలల పాటు ప్రత్యేక శిక్షణ తీసుకున్నట్లు కూడా తెలిపారు. మరోవైపు, సినిమాలో రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ ఉంటుందని, దాన్ని కథలో భాగంగా పలు ఉపఘట్టాలుగా చూపించనున్నట్లు రాజమౌళి వెల్లడించారు. ఇప్పుడు రణబీర్ రాముడిగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన నేపథ్యంలో.. త్వరలో మహేష్ రాముడి అవతారాన్ని ఎలా ఆవిష్కరిస్తారన్న ఆసక్తి పెరుగుతోంది.

బాలయ్యతో చిందేసే భామ ఎవరో?

ఎన్బీకే అభిమానులకు మరో మాస్ ట్రీట్ సిద్ధమవుతోందా? గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'దాదా'లో ప్రత్యేక గీతం ఉండబోతోందనే ప్రచారం ఆసక్తి రేపుతోంది. ఈ పాటకు థమన్ అదిరిపోయే మాస్ బీట్స్ సిద్ధం చేస్తున్నాడన్న టాక్ నేపథ్యంలో.. బాలయ్యతో కలిసి స్టెప్పులేసే బ్యూటీ ఎవరనే ఇంకా స్పష్టత లేదు. ఈ వార్తపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. బాలయ్య, థమన్ కాంబినేషన్‌కు మాస్ ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన పాటలు, నేపథ్య సంగీతం అభిమానులను థియేటర్లలో ఉర్రూతలూగించాయి. దీంతో 'దాదా' సంగీతంపై కూడా భారీ అంచనాలున్నాయి. మరోవైపు బాలకృష్ణ సరసన కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, మంచు మనోజ్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ఇదిలా ఉంటే, సినిమా విడుదల వాయిదా పడుతుందంటూ ఇటీవల ప్రచారం జరగడంతో అభిమానుల్లో కొంత ఆందోళన నెలకొంది. అయితే డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా సినిమాను విడుదల చేయనున్నట్లు మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు. ఫస్ట్ సింగిల్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు కూడా ప్రకటించారు. వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలున్నాయి. మరి ఐటెం సాంగ్ వార్త నిజమవుతుందా? బాలయ్యతో స్టెప్పులేసే ఆ స్పెషల్ బ్యూటీ ఎవరు? అన్నది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే!



అదో భయపెట్టిన అనుభవం!



సినీ పరిశ్రమలో ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా అడుగుపెట్టడం చాలా కష్టమని నటి శోభిత ధూళిపాళ్ల అన్నారు. తనకు గాడ్ ఫాదర్ ఎవరూ లేకపోవడంతో ఇండస్ట్రీలో అవకాశాల కోసం తొలినాళ్లలో చాలా భయపడ్డానని ఆమె తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శోభిత.. తన సినీ ప్రయాణం, కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న కష్టాలను పంచుకున్నారు. "కాలేజీ రోజుల్లో జీక్యూ, వోగ్ మ్యాగజైన్ కవర్ పేజీలు చూసినప్పుడు.. నాలాంటి వారికి ఆ స్థాయికి చేరుకోవడం అసాధ్యమని అనుకునేదాన్ని. పరిశ్రమకి వచ్చినప్పుడు నాకు మద్దతుగా ఎవరూ లేరు. ఏం చేయాలో తెలిసేది కాదు. సలహాలు ఇచ్చేవారు, మార్గం చూపే వారు లేరు. నా జీవితంలో అదొక భయపెట్టే అనుభవం" అని శోభిత తెలిపారు. "ఎన్నో ఆడిషన్ల తర్వాత నాకు తొలి సినిమా అవకాశం వచ్చింది. కేన్స్‌కి వెళ్లినప్పుడు ఎంతో మంది గొప్పవాళ్లను కలిశా. అక్కడ ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. అనుకుంటే ఏదైనా సాధించొచ్చని అప్పుడే అర్థమైంది. ఇదొక సర్కస్ లాంటిదని, ఇక్కడ మన టాలెంట్‌కు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదని తెలుసుకున్నా. ఆ తర్వాతే నాలో భయం పోయింది. కానీ, ఈ స్థాయికి రావడానికి చాలా ధైర్యం, కష్టం, సమయం కావాలి" అని ఆమె చెప్పుకొచ్చారు. తాను నమ్మిన కథలను ఎంచుకుంటూ, గర్వంగా ఫీల్ అయ్యే పాత్రలు పోషిస్తుండటం అదృష్టంగా భావిస్తున్నానని శోభిత ఆనందం వ్యక్తం చేశారు. శోభిత ప్రస్తుతం.. పా.రంజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక సైన్స్ ఫిక్షన్ యాక్షన్ డ్రామా 'వేట్టువం'లో నటిస్తున్నారు. ఈ సినిమాలో ఆమె 'రాధి' అనే పాత్రలో కనిపించనున్నారు.

ఓటీటీకి హనుమాన్ అంశ్



ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'హనుమాన్ అంశ్. కేవలం రూ.2 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా.. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.450 కోట్లకు పైగా వసూలు చేసింది. విశాల్ చతుర్వేది దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీలో శోభినవ్ సత్య ప్రధాన పాత్ర పోషించారు. ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ అక్టోబరు 9న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చింది. తాజాగా ఈ చిత్రం.. ఓటీటీలో సందడి చేసేందుకు ముస్తాబవుతోంది. ప్రముఖ ఓటీటీ వేదిక 'సోనీలివ్'లో నవంబరు 27 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని సోనీలివ్ అధికారికంగా ప్రకటించింది.

కథేంటంటే..

దేశానికి స్వాతంత్ర్యం రాకముందు జరిగే కథ ఇది. లక్ష్మీ నారాయణ శర్మ (శోభినవ్ సత్య) 13ఏళ్ల వయసులో తల్లిని కోల్పోతాడు.చనిపోయిన తన తల్లిని ఎలాగైనా తిరిగి చేరుకోవాలని.. శ్రీరాముడు మాత్రమే తమని తిరిగి కలపగలడని నమ్మి..తల్లి నేర్పించిన ధ్యానసాధన ద్వారా ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభిస్తాడు. ఈ క్రమంలోనే హనుమాన్ చాలీసా స్ఫూర్తితో హనుమంతుడి ద్వారా రాముడ్ని చేరుకోవచ్చని నమ్మి ఆ దిశగా తన ఆధ్యాత్మిక జీవితాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తారు. మరి అలా రాముడ్ని అన్వేషిస్తూ హనుమాన్ భక్తిమార్గంలో లక్ష్మీనారాయణ చేసిన ప్రయాణం ఎలాంటి మలుపులు తిరిగింది? ఆధ్యాత్మిక చింతనలో పడి 13ఏళ్ల వయసులో ఇల్లు వదిలి వెళ్లిన ఆ కుర్రాడు.. తనకెదురైన అడ్డంకుల్ని అధిగమించి.. నిస్వార్థ ప్రేమతో సమాజానికి సేవ చేస్తూ నీమ్ కరోలి బాబాగా ఎలా మారారు? ఈ క్రమంలో తను చేసిన అద్భుతాలేంటి? అన్నది ఈ చిత్ర కథ.

ఎమ్మీ వేదికపై సేతుపతి!



తమిళ స్టార్ విజయ్ సేతుపతి ఖాతాలో మరో అరుదైన ఘనత చేరబోతోంది. విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ విలక్షణ నటుడికి ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుకలో అవార్డు ప్రెజెంటర్‌గా వ్యవహరించే అవకాశం దక్కింది. నవంబర్ 23న న్యూయార్క్‌లో జరగనున్న 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుకలో ఆయన అవార్డును అందించనున్నారు. ఈ ఘనత సాధించనున్న తొలి భారతీయ నటుడిగా విజయ్ సేతుపతి ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. గతంలో ప్రియాంక చోప్రా 2016లో ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డుల వేడుకలో అవార్డు ప్రెజెంటర్‌గా వ్యవహరించారు. అయితే ప్రైమ్‌టైమ్ ఎమ్మీ, ఇంటర్నేషనల్ ఎమ్మీ రెండూ వేర్వేరు వేడుకలు కావడం విశేషం. ఇంటర్నేషనల్ ఎమ్మీ వేదికపై భారతీయ నటుడిగా విజయ్ సేతుపతికి ఈ అవకాశం దక్కడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ విషయంలో ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ టెలివిజన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ బోర్డు సభ్యురాలు, నిర్మాత కవితా గుప్తా కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. గతంలో వీర్ దాస్‌ను ఈ వేదికపై వ్యాఖ్యాతగా తీసుకురావడంలోనూ ఆమె పాత్ర ఉంది. మరోవైపు విజయ్ సేతుపతి నటించిన 'మహారాజా' కూడా అంతర్జాతీయంగా వార్తల్లో నిలుస్తోంది. చైనాలో ఈ చిత్రానికి వచ్చిన ఆదరణతో హాలీవుడ్ సంస్థలు రీమేక్ హక్కులపై ఆసక్తి చూపించాయి. ఇప్పటికే ఓ అమెరికన్ ఏజెన్సీ రీమేక్ హక్కులను తీసుకుని, ప్రముఖ హాలీవుడ్ నటుడితో ప్రాజెక్టును రూపొందించే ప్రయత్నాల్లో ఉంది. మాథ్యూ మెక్‌కోనహే పేరు వినిపిస్తున్నప్పటికీ ఆయన నటించడం ఇంకా ఖరారు కాలేదు. ఇలా ఒకవైపు ఎమ్మీ వేదికపై గుర్తింపు.. మరోవైపు హాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న 'మహారాజా'.. విజయ్ సేతుపతి కెరీర్‌లో అంతర్జాతీయంగా ఆసక్తి పెరుగుతోంది.